అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


**ఐపిఎల్ ఫైనల్ నేడే**



గుజరాత్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు తలపడనున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు


సంపుటి 27, సంచిక: 343 | మంగళవారం | 03-06-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




## పదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థలను
# చక్కదిద్దుతున్నాం...

- ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ రూపొందించాం
- పెట్టుబడులు, పర్యాటకానికి రాష్ట్రంలోని అనుకూలతలను ప్రపంచానికి చూపించాం
- హైదరాబాద్ పెట్టుబడులకు కేరాఫ్‌గా మారింది
- తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు మహిళలే
- మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- భూ వివాదాలు లేకుండా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం
- తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంతో పోటీ పడేలా 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్ రూపొందించామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. 2047 నాటికి తెలంగాణను గొప్ప అభివృద్ధి పథంలో నడిపించాల్సి ఉందన్నారు. తెలంగాణకే ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రపంచానికి చూపించామని వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రావతరణ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. అవతరణ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జపాన్‌లోని కితాక్యూషూ సిటీ మేయర్ టేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతుందని, అప్పటివరకు త్రీ ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. పెట్టుబడులు, పర్యాటకానికి తెలంగాణలో ఉన్న అనుకూలతలను ప్రపంచానికి చూపించామన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడంతో పాటు పెట్టుబడులు రాబట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయని, దీంతో హైదరాబాద్ పెట్టుబడులకు కేరాఫ్‌గా మారిందన్నారు. దశాబ్దాల పోరాటంతో తెలంగాణను సాధించుకున్నామని, సకల జనుల ఆకాంక్షలు నెరవేరిన రోజన్నారు. కట్టుబానిసత్వాన్ని, వెట్టిచాకిరీని తెలంగాణ తరువాయి 2లో





## త్యాగాలతో రాష్ట్రం సాధించుకున్నా
# ఆకాంక్షలు నెరవేరలే

- సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, అజీజ్ పాషా ఆవేదన
- కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తి చేసి మాట నిలబెట్టుకోవాలని సూచన
- మగ్దూంభవన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రజలు తమ అసాధారణ పోరాటాలు, అనేక త్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పటికీ పదేళ్ల కాలంలో వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలను నేరవేర్చుతామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వాటిని పూర్తి చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారు సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారాయణ జాతీయ జెండాను ఎగురవేయగా, సయ్యద్ అజీజ్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహా, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎన్.జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.అంజయ్యనాయక్, కెవిఎల్, తరువాయి 2లో

# 5వ తేదీన రాలేను

- కాళేశ్వరం విచారణ కమిషన్‌ను మరో గడువు కోరిన మాజీ సిఎం కెసిఆర్
- 11వ తేదీకి విచారణ వాయిదా



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'జస్టిస్ పి.సి ఘోష్ విచారణ కమిషన్'కు అత్యంత ఉత్కంఠ నెలకొన్నది. ఈ నెల 5వ తేదీన విచారణకు హాజరు కావాల్సిన బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు గడువు కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు విచారణను ఈ నెల 11వ తేదీకి కమిషన్ వాయిదా వేసింది. కాళేశ్వరం విచారణ విషయంలో కెసిఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని కొందరు, తర్జన భర్జన పడుతున్నారని మరికొందరు ఇలా రకరకాల చర్చ జరుగుతోంది. తొలుత ఈ నెల 5న జరిగే విచారణకు కెసిఆర్ హాజరవుతారని, అంతకుముందు కాళేశ్వరంపై బిఆర్ఎస్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేసే అవకాశాలు ఉంటాయని ప్రచారం జరిగింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మాజీ తరువాయి 2లో

# ప్రజల వద్దకే 'రెవెన్యూ'


- నేటి నుంచి 20వ తేదీ వరకు అన్ని మండలాల్లో సదస్సులు
- తహసీల్దార్‌తో కూడిన బృందం భూ సమస్యలు పరిష్కరిస్తుంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం తమ స్వార్థం కోసం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగపర్చిన విధానాలతో జరిగిన తప్పులను సరిచేసి, మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేసి, భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళ్తున్నామని తెలిపారు. 'ప్రజల వద్దకే రెవెన్యూ' అనే నినాదంతో రెవెన్యూ సదస్సులకు తహశీల్దార్‌తో కూడిన బృందం వెళ్లి, భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తుందని అన్నారు. 'రెవెన్యూ సదస్సు'ల అంశంపైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తరువాయి 12లో..



# ప్రపంచం WORLD NEWS

## కాంట్రాక్టు ప్రాతిపదికపై విదేశాలకు ఘనా యువ కార్మికులు

**అక్రా:** ఘనదేశ యువకులను ఫిక్సెడ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికపై విదేశాలకు పంపుతామని ఆ దేశ అధ్యక్షుడు జాన్ ద్రమణి మహమ ప్రకటించారు. ఘనా దేశం విదేశాలకు బంగారం, కోకా, ముడి చమురు, పామాయిల్, కసావా, మామిడిపండ్లు, అరటిపండ్లను ఎగుమతి చేస్తుందని, ఇకమీదట ఘనలో మధ్యతరగతి పేదరికాన్ని నిర్మూలించేందుకు ఘనా యువకులను కూడా విదేశాలకు ఫిక్సెడ్ కాంట్రాక్టు ప్రాతిపదికపై పంపుతామని మహమా ప్రటించారు. ఐతే ఘనా దేశ యువకులు ఎప్పటికీ అమ్మకానికి సిద్ధంగా లేరని కూడా ఆయన అదేసమయంలో చెప్పారు. వందల సంవత్సరాలుగా ఘనదేశ యువకులు అమెరికా సహా ఇరత దేశాలకు కార్మికులుగా, పనిమనుషులుగా అమ్ముడుపోతూ వస్తున్నారు. విదేశాలలో పనులకు వారిని గతకాలంలో మధ్యవర్తులు అమ్మకానికి పెట్టేవారు. అందుకు విరుద్ధంగా చట్టపరిధిలో 2000 మంది ఘనా యువకుల కార్మికశక్తిని ఫిక్సెడ్ లేబర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికపై విదేశాలకు పంపనున్నారు. దీనివల్ల ఘనాలో కుటుంబాలు, ప్రభుత్వం కూడా ఆర్థికలబ్ధి పొందుతాయని మహమా అన్నారు.



## పోలెండ్ అధ్యక్ష ఎన్నికల్లో..
# ట్రంప్ మద్దతిచ్చిన నవ్రోకి గెలుపు

**వార్సా :** పోలెండ్ అధ్యక్ష ఎన్నికలలో జాతీయవాది, చరిత్రకారుడు, డోనాల్డ్ ట్రంప్ మద్దతుగల అభ్యర్థి కరోల్ నవ్రోకీ (42) విజయం సాధించారు. ఆయన ఐదు సంవత్సరాలు అధ్యక్ష పదవిలో ఉంటారు. దీంతో పోలెండ్ ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్ ప్రభుత్వానికి గడ్డురోజులు మొదలయ్యాయి. నవ్రోకీ మొదటి నుండీ ట్రంప్ తరహా ఆలోచనా ధోరణులనే ప్రతిబింబిస్తున్నారు. సెక్యులర్ ఆలోచనలకు వ్యతిరేకంగా ఉండే నవ్రోకీ పాలనలో ఇక పోలెండ్ దేశం మరింత జాతీయవాద దృక్పథంతో ముందుకు వెళుతుందని అంచనావేస్తున్నారు. నవ్రోకీ పోలెండ్ దేశాధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టాలని తాను మొదటినుండీ కోరుకున్నానని ట్రంప్ అన్నారు. పోలెండ్‌లో 10వేల మంది అమెరికా సైనికులు ప్రస్తుతం తిష్టవేసుకుని ఉన్నారు. ఇక పోలెండ్‌తో అమెరికా సైనిక సంబంధాలు మరింత పటిష్టమవుతాయి. ఐతే ప్రస్తుతం ప్రధాన మంత్రి బాధ్యతల్లో ఉన్న డోనాల్డ్ టస్క్ కూటమి ప్రభుత్వం కలలు భగ్నమయ్యాయి. ఆయన అభ్యర్థి ఆంద్రెజ్ దుడా ఓటమిపాలయ్యారు. ఆయన స్థానంలో నవ్రోకీ అధ్యక్ష బాధ్యతలు తీసుకుంటారు. తమ అభ్యర్థి గెలిస్తే సంస్కరణలను, ఎన్నికల వాగ్దానాలను ముందుకు తీసుకువెళ్ళాలని డోనాల్డ్ టస్క్ భావించారు. కానీ ఇక మళ్ళీ 2027లో పార్లమెంటుఎన్నికల్లో గెలిచేవరకూ టస్క్ వాగ్దానాలు అమలయ్యే అవకాశాలు లేవు. 2015 నుండి 2023 వరకూ పోలెండ్‌ను పాలించిన జస్టిస్‌పార్టీ డోనాల్డ్ టస్క్ నాయకత్వానగల కూటమి ధాటికి తట్టుకోలేక 2023 ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు జస్టిస్ పార్టీ అభ్యర్థి నవ్రోకీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారు. పలు యూరప్ దేశాల నాయకులు నవ్రోకీకి అభినందనలు తెలియజేశారు. పోలెండ్‌లో యూరప్ అనుకూల అభ్యర్థి ట్రజాస్కోవ్‌స్కీ గెలుస్తారని అందరూ ఆశించారు. యూరప్ భద్రత పోలెండ్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. నవ్రోకీ విజయం సాధించడంతో పరిస్థితుల్లో గణనీయంగా మార్పులు వచ్చే అవకాశం ఉంది. రెండో విడత ఆదివారంనాడు జరిగిన రన్నాఫ్ పోలింగ్‌లో వార్సా మేయర్, యూరోపియన్ యూనియన్ అనుకూల లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థి రఫాల్ ట్రజాస్కోవ్‌స్కీ (53), లా అండ్ జస్టిస్‌పార్టీకి చెందిన అభ్యర్థి, చరిత్రకారుడు కరోల నవ్రోకీ ఇద్దరూ అధ్యక్ష పదవికోసం ప్రధానంగా పోరాడారు. నువ్వా–నేనా అనే రీతిలో జరిగిన హోరాహోరీ రన్నాఫ్ బ్యాలట్ పోరాటంలో నవ్రోకీకి 50.89 శాతం ఓట్లు లభించాయి. ట్రజాస్కోవ్‌స్కీకి 49.11 శాతం ఓట్లు లభించాయి. అమెరికాతోపాటు యూరప్ దేశాలలో ఉన్న సంప్రదాయవాదులు నవ్రోకీ విజయంపట్ల ఎంతో హర్షం ప్రకటించారు. మొదటి రౌండ్ ఎన్నికల నుండి చివరివరకూ అధ్యక్ష అభ్యర్థుల మధ్య పోటీ ఉత్కంఠతో సాగింది. రన్నాఫ్ పోలింగ్ ప్రారంభం కావడానికి ముందుగా వెల్లడైన ముందస్తు సర్వే నివేదికలలో ట్రజాస్కోవ్‌స్కీ విజయం సాధిస్తారని ఫలితాలు వెల్లడైనప్పటికీ నిజమైన ఫలితాల్లో మాత్రం పరిస్థితి తలక్రిందులైపోయింది. నవ్రోకీ విజయం సాధించారు. దీంతో ట్రజాస్కోవస్కీ ఓటమిని అంగీకరించి నవ్రోకీకి అభినందనలు తెలియజేశారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతోపాటు జర్మనీ, హంగేరీ దేశాల నాయకులు నవ్రోకీకి అభినందనలు తెలియజేశారు. యూరప్ దేశాల నుండి ఉక్రేన్‌కు ఆయుధాల సరఫరాలో పోలెండ్ దేశమే ఇప్పటివరకూ కీలకపాత్ర పోషిస్తూ వచ్చింది. ఇక ఇప్పుడు ట్రంప్ ప్రభావంతో పోలెండ్ ఎలాంటి పాత్ర నిర్వహిస్తుందనే విషయం ముందు ముందు వెల్లడికానున్నది. ఐతే ఎన్నిక ప్రచార సందర్భంగా నవ్రోకీ ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాను వ్యతిరేకించారు. జెలెన్స్కీ తన అభినందన సందేశంలో యూరప్ భద్రత విషయంలో పోలెండ్ దేశం కీలకపాత్ర వహిస్తోందని అన్నారు. పోలెండ్‌తో వ్యక్తిగతంగా నవ్రోకీతో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. హంగేరీ ప్రధానమంత్రి విక్టర్ ఓర్బన్ అభినందనలు తెలియజేస్తూ నవ్రోకీ అద్భుత విజయం సాధించారన్నారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోందర్‌లేయన్ అభినందనలు తెలియజేశారు.ప్రజాస్వామ్య విలువలను యూరోపియన్ యూనియన్–పోలెండ్ దీర్ఘకాలంగా పంచుకుంటున్న విషయాన్ని గుర్తుచేశారు. యూరప్ భద్రతకోసం కలిసి పనిచేద్దామని అన్నారు.

## నేడు దక్షిణ కొరియా అధ్యక్ష ఎన్నికలు




**సియోల్ :** దక్షిణకొరియాలో మంగళవారంనాడు అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. గడచిన మూడు రోజులుగా ముందస్తు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజే పలువురు అధ్యక్ష అభ్యర్థులు తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. మంగళవారం ఉదయం ఆరు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. మొత్తం ఐదుగురు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. దక్షిణ కొరియా ప్రతిపక్షం డెమోక్రటిక్‌పార్టీ అభ్యర్థి లీ జే మ్యుంగ్, అధికార పీపుల్స్ పవర్‌పార్టీ అభ్యర్థి కిమ్ మూన్ సూ మధ్య ప్రధానంగా పోటీ జరుగుతోంది. నాలుగున్నరకోట్లకుపైగా ఉన్న అర్హులైన ఓటర్లు పోలింగ్‌లో పాల్గొంటారు. ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని, ఉత్తర కొరియాతో చేతులు కలుపుతున్నాయని ఆరోపిస్తూ గత ఏడాది డిసెంబరు మూడో తేదీన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో మార్షల్ లా విధించారు. ఎదురైన ఒత్తిడిని భరించలేక ఆరు గంటల వ్యవధిలోనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని దేశద్రోహిగా ముద్రవేసుకున్నారు. పార్లమెంటు ఆయనపై మహాభియోగ తీర్మానం చేసి పదవీచ్యుతుణ్ణి చేసింది. తర్వాత ఆయన జైలుపాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయనకు బదులుగా అధికార పీపుల్స్ పవర్‌పార్టీ తరపున కిమ్ మూన్ పోటీలో ఉన్నారు.

# తిరుగుబాట్లు అణచివేస్తా : సూడాన్ భద్రతే లక్ష్యం

## కొత్త ప్రధానమంత్రి ఇద్రిస్ ప్రకటన

**కార్టూమ్:**ఆఫ్రికా ఈశాన్యప్రాంతదేశం సూడాన్ ప్రధానమంత్రి కామిల్ ఎల్టయెబ్ ఇద్రిస్ ఇప్పటివరకూ ఉన్న తాత్కాలిక ప్రభుత్వాన్ని ఆయన రద్దుచేశారు. మంత్రివర్గాన్ని రద్దుచేస్తున్నట్లు ఆయన ప్రకటిస్తూ, కొత్త మంత్రివర్గం ఏర్పడేవరకూ ప్రభుత్వ మంత్రిత్వశాఖలో ఉన్న కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు సంంధిత శాఖల వ్యవహారాలు ఆగిపోకుండా కొనసాగించాలని ఆదేశించారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి జాతిని ఉద్దేశించి సోమవారంనాడు ఆయన ప్రసంగిస్తూ, సూడాన్ జాతీయ భద్రతతే తన ప్రథమ కర్తవ్యమని చెప్పారు. దేశంలో సాయుధ తిరుగుబాటుదారులను, తిరుగుబాటు గ్రూపులను అణచివేస్తామని, వాటిని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) పారామిలిటరీ సాయుధ బలగాలు సూడాన్ ప్రభుత్వాధికారాన్ని స్వాధీనం చేసుకోవడంకోసం 2023 ఏప్రిల్ 15వ తేదీ నుండి ప్రభుత్వ సైనిక దళాలలతో పోరాటం కొనసాగిస్తున్నాయి. అప్పటినుండీ సూడాన్‌లో మానవతా సంక్షోభం నెలకున్నది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం దాదాపు 20,000 మంది ప్రజలు అంతర్యుద్ధంలో మరణించారు. మరో కోటీ 50 లక్షలమంది ప్రజలు ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. సూడాన్‌ను దీర్ఘకాలంగా పరిపాలించిన ఆ దేశాధ్యక్షుడు ఒమర్ అల్ బషర్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడ్డారు. తర్వాత సైనిక కుట్ర కారణంగా 2019లో ఆయన పదవీచ్యుతుడయ్యారు. అప్పటినుండి దేశంలో అంతర్గత కల్లోలం ప్రారంభమైంది. సూడాన్ 16వ ప్రధానమంత్రిగా మే 19వ తేదీన బాధ్యతలు చేపట్టారు.80 ఏళ్ళు వయసుగల ఇద్రిస్ రాజనీతిజ్ఞుడు, ఎంతో అనుభవజ్ఞుడు. అంతర్జాతీయ సివిల్ సర్వెంట్‌గా కూడా పనిచేశారు. వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రోపర్టీ ఆర్గనైజేషన్‌కు పదకొండు సంవత్సరాలపాటు (1997–2008) ఆయన డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. 2010లో ఆయన రాజకీయాల్లో చేరి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. ఆనాటి దేశాధ్యక్షుడు ఒమర్ అల్ బషర్‌ను ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి సవాలు చేసి పోలింగ్‌లో ఆరోస్థానంలో నిలిచారు. అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ బుర్హన్ సారథ్యంలోని ట్రాన్సిషనల్ సావరిన్ కౌన్సిల్ గతనెలలో పౌరయుద్ధ సమయంలో ఇద్రిస్‌ను ప్రధానమంత్రిగా నియమించింది.

# నైజీరియాలో భూమి కోసం ఘర్షణలు

## గన్‌మెన్ కాల్పుల్లో 25 మంది మృతి

**జోస్ :** సెంట్రల్ నైజీరియాలో వేరేవేరుచోట్ల సాయుధ దుండగులు జరిపిన కాల్పుల్లో 25 మంది మరణించారు. నార్త్–సెంట్రల్ బెన్యూ రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లోగన్‌మెన్ కాల్పులు జరిపారు. స్థానికంగా స్థిరపడిన వ్యవసాయదారులకు, ముస్లిం ఫలూనా తెగకు మధ్య భూసంబంధమైన ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఇందులోభాగంగానే ఈ కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు. భూములు సొంతం చేసుకుని స్థిరపడిన రైతులలో ఎక్కువమంది క్రైస్తవ మతానికి చెందినవారు. గడచిన రెండు సంవత్సరాలుగా బెన్యూ రాష్ట్రంలో రైతు భూములకోసం జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకూ 6,896 మంది మరణించినట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక తెలిపింది. బెన్యూరాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవులు అధికంగా ఉన్నారు. అంకపాలి కమ్యూనిటీకి చెందిన 14 మంది ఆదివారం జరిగిన కాల్పుల్లో మరణించారు. తాజా కాల్పుల్లో మరో 11 మంది మరణించారు.

# ఇజ్రాయెల్ అనుకూల ప్రదర్శనపై ‘ఉగ్ర’ దాడి

**బౌల్డర్:** గాజాలో ఉన్న బందీలను విడుదల చేయాలని కోరుతూ అమెరికా కొలరాడోలో సోమవారంనాడు జరిగిన ఇజ్రాయెల్ అనుకూల ప్రదర్శనపై కొంతమంది దాడి చేశారు. ఈ దాడిలో 50 నుండి 88 ఏళ్ళు వయసుగల ఎనిమిదిమంది ప్రదర్శకులు గాయపడ్డారు. ఈ ఘటనను ఎఫ్‌బిఐ తీవ్రంగా పరిగణించింది. దీనిని ఉగ్రవాద చర్యగా భావించి దర్యాప్తు ప్రారంభించింది. ఇజ్రాయెల్‌కు అనుకూలంగా జరుగుతున్న ప్రదర్శనపై చేసిన దాడిని బెంజిమన్ నేతన్యాహూ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. డెన్వర్‌కు 48 కి.మీ దూరంలో ఉన్న కొలరాడో పెరల్‌స్ట్రీట్‌లో ఉన్న ప్రజాదరణ పొందిన బౌల్డర్ బహిరంగ ప్రదేశంలో జరుగుతున్న ప్రదర్శనపై దాడి జరిగింది. చొక్కాలేకుండా వచ్చిన ఒక వ్యక్తి ప్రదర్శనలో జొరబడి ‘పాలస్తీనాకు విముక్తి ప్రసాదించాలి’’ అంటూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. అదే సమయంలో ప్రదర్శనపై దాడి జరిగింది. దాడి సమయంలో ఆ ప్రాంతంలో దట్టడంగా పొగ కమ్ముకుంది. ఎవరెక్కడున్నారో తెలియని పరిస్థితి రావడంతో ప్రదర్శకులు ఏమీ అర్థంకాక తలో దిక్కువైపూ పరుగులు తీశారు.

## రెండురోజులు తేలికపాటి వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాబోయే మూడురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, హమూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయా జిల్లాల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

# 5వ తేదీన రాలేను

(మొదటి పేజీ తరువాయి)

నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేస్తారని అధికారికంగా బిఆర్ఎస్ ప్రకటించింది. కానీ ఈ కార్యక్రమాన్ని అర్థంతరంగానే వాయిదా వేసుకున్నది. ఇందుకు సరైన కారణాలు కూడా స్పష్టం చేయక పోవడంపై రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాళేశ్వరం విచారణకు ఈనెల 6న బిఆర్ఎస్ ఎంపి, బిఆర్ఎస్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ఈటల రాజేందర్, 9న మాజీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విచారణకు హాజరు కావాల్సి ఉన్నది.

### చిక్కుల్లో పడకుండా జాగ్రత్తలు...

కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో వస్తున్న ఆరోపణలకు ధీటుగా సమాధానం చెబుతూనే చిక్కుల్లో పడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని కెసిఆర్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో ఇప్పటికే జస్టిస్ పి.సిఘోష్ కమిషన్’ తన విచారణ ప్రక్రియను దాదాపుగా ముగించింది. కాళేశ్వరం నిర్మాణం జరుగుతున్న సమయంలో బాధ్యులైన అప్పటి సిఎం, మంత్రులు మినహా అధికార యంత్రాంగం, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లు, పలువురు నీటి పారుదల నిపుణులు తదితరులను విచారించి, వారి వాంగ్మూలాన్ని కూడా రికార్డ్ చేసింది. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పలు పత్రాలను,రికార్డులను సేకరించింది. వాటి ఆధారంగానే ప్రస్తుతం కమిషన్ విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కమిషన్ విచారణ సమయంలో ఎటువంటి సమాధానాలు చెప్పాలనే విషయమై ఇదివరకే కెసిఆర్ ఒక అంచనాకు వచ్చినట్టు సమాచారం. పైగా విచారణ కమిషన్ అధికారాలు, ఒక వేళ కమిషన్ ముందు హాజరుకాకపోతే వచ్చే సమస్యలు, హాజరవుతే, విచారణ సమయంలో చెప్పాల్సిన సమాధానాలు ఇలా పలు అంశాలపైన కెసిఆర్ ఇప్పటికే పలువురు న్యాయ, నీటిపారుదల నిపుణుల సలహాలు, సూచనలు, అభిప్రాయాలను కూడా తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. కమిషన్ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా ఒక వేళ ప్రభుత్వం ఏదైనా చర్యలకు పాల్పడితే, వాటిని సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా ముందస్తుగానే

### 9న ‘హరీశ్ విచారణ’పై దృష్టి ...

‘కాళేశ్వరం విచారణ’కు ముందుగా హరీశ్‌రావును పంపిస్తే కమిషన్ విచారణ శైలి, సంధించిన ప్రశ్నలు, వారి వద్ద ఉన్న ఆధారాలు, తదితర అంశాలు తెలుస్తాయని, తద్వారా తగిన సమాధానాలు, ఆధారాలను కమిషన్ ముందు పెట్టేందుకు వీలవుతుందని కెసిఆర్ బావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కాగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో నిర్మించిన పలు ప్రాజెక్ట్‌లు, నిర్మాణ దశలో, ఆ తర్వాత అవి కూలిపోతే,లేదా ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలపైన కూడా బిఆర్ఎస్ ఆరా తీసినట్టు తెలిసింది. ప్రాజెక్ట్‌ల విపత్తుల గురైతే, ఆ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో ఉన్న బాధ్యులైన పాలకులపైన కేసులు నమోదయ్యాయా?, ఇంతకు వారి బాధ్యత ఉంటుందా?, లేదా కేవలం అధికారులు, నిర్మాణ సంస్థనే బాధ్యత వహిస్తుందా? అనే కోణంలో కూడా కెసిఆర్ ఆరా తీసినట్టు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నారు.

# ఆకాంక్షలు నెరవేరలే

(మొదటి పేజీ తరువాయి)

ఎం.నర్సింహా, కె.కాంతయ్య, సీనియర్ నాయకులు ఉజ్జని రత్నాకర్ రావు, బొమ్మగాని నాగభూషణం, సబ్బ రాజమౌళి, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పల్లె నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ పలు గీతాలను ఆలపించారు.

**మాజీ సిఎం కెసిఆర్ నియంత పాలనతో తన కీర్తిని తానే పొగొట్టుకున్నారు : డాక్టర్ నారాయణ**

తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత తెలంగాణ ప్రజలు ఏ ఉద్దేశంతో అయితే కెసిఆర్‌కు అధికారం అప్పగించారో దానిని పూర్తి చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారని డాక్టర్ నారాయణ విమర్శించారు. పదేళ్ల పాటు ఆయన ప్రభుత్వాన్ని, పార్టీని పూర్తిగా అప్రజాస్వామిక పద్దతుల్లో నియంతృత్వ పాలన కొనసాగించారని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఫామ్‌హౌజ్‌కే పరిమితమై ప్రభుత్వాన్ని, పార్టీని నడిపిన ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రమేనన్నారు. ఫలితంగా ఆయన సాధించుకున్న కీర్తిని ఆయనే పోగొట్టుకున్నారన్నారు. కెసిఆర్ నియంత ధోరణే చివరికి వారి కుటుంబంలో కల్లోలం లేపేందుకు కారణమైందన్నారు. కెసిఆర్‌ను గద్దె దించి కాంగ్రెస్‌కు ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని, ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మాజీ సిఎం కెసిఆర్ పాలనను ఓ గుణపాఠంగా తీసుకుని పరిపాలనకొనసాగించాలని సూచించారు. అధికారం చేపట్టే ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్‌రెడ్డి పూర్తి చేయాలని, ఇందుకు సిపిఐ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని నారాయణ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రీయాశీల పాత్ర పోషించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిందేనని ఒకే మాటపై నిలబడిన ఏకైక జాతీయ పార్టీ సిపిఐ అని డాక్టర్ నారాయణ అన్నారు. మిగిలిన పార్టీలు ఇక్కడో మాట అక్కడో మాట మాట్లాడాయన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పేటెంట్ రైట్ మాత్రం మాజీ సిఎం కె.చంద్రశేఖరరావుకే దక్కుతుందని, కానీ ఆయన దానిని ఈ పదేళ్ల కాలంలో నిలబెట్టుకోలేకపోయారన్నారు.

**రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేయాలి : అజీజ్ పాషా**

తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మరింత కృషి చేయాలని సయ్యద్ అజీజ్ పాషా సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సిపిఐది అసాధారణ పాత్ర అని, అప్పట్లో రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న డాక్టర్ కె.నారాయణ క్రీయాశీల పాత్ర పోషించారన్నారు. రాష్ట్ర సాధనలో సిపిఐ పాత్రను ఎవరైనా మరిచిపోతే దానిని వారి విజ్ఞతకే వదిలివేద్దామన్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ఉన్నప్పటికీ మరింత సమగ్రాభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. తాను కెసిఆర్, రేవంత్‌రెడ్డి పాలనను తను పోల్చడం లేదు కాని సంక్షేమ పథకాలు మరింత వేగవంతంగా అమలు కావాల్సి ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గనణ సర్వేతో ప్రధాని మోదీపై ఒత్తిడి పెరిగి కేంద్ర ప్రభుత్వం సైతం చేపట్టాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఓ మైలురాయేనన్నారు. నిత్యం పట్టణ ప్రాంతం విస్తరిస్తూ గ్రామీణ ప్రాంతం తగ్గుతుందని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కొంత మేరకు తీరినప్పటికి మరింత ప్రభుత్వం పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి మూసీ ప్రక్షాళన మంచి కార్యక్రమామేనన్నారు.

# చక్కదిద్దుతున్నాం...

(మొదటి పేజీ తరువాయి)

సమాజం సహించదని, అందుకే ప్రజల ఆలోచనలే ఆచరణగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు. రాష్ట్రం వచ్చి పదేళ్లయినా ఆకాంక్షలు నెరవేరలేదని సిఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి, ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ ఎజెండా అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిచి బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థలను ఒక్కొక్కటిగా చక్కదిద్దుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభాలు మహిళలు అని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. మహిళా సంఘాలకు బస్సులను ఆర్‌టిసికి అద్దెకు తీసుకుని వారికి ఆదాయం కల్పిస్తున్నామన్నారు. నిర్లక్ష్యానికి గురైన యూనివర్శిటీలకు విసిలను నియమించామని, టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేశామని, పోటీ పరీక్షలు నిర్వహించడంతోపాటు ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, అమలుచేస్తున్నామన్నారు. విద్యా కమిషన్, వ్యవసాయ, రైతు కమిషన్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. సమాచార కమిషనర్లను, లోకాయుక్త, హెచ్ఐఆర్‌సి సభ్యులను నియమించుకుని, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**న్యూయార్క్, టోక్యోలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీ**

న్యూయార్క్, టోక్యోలకు దీటుగా ఫ్యూచర్ సిటీ నిర్మించనున్నామని, ప్రపంచ దేశాలకు దీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును చేపడుతున్నామని, బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ సరోవర్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎఐ సిటీ, స్పోర్ట్స్ సిటీ, ఫార్మా సిటీలతో పాటు లైఫ్ సైన్సెస్, హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశామన్నారు. దాదాపు రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రీజనల్ రింగ్ రోడ్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు నిర్మించనున్నామని, రీజనల్ రైల్‌తో పాటు మెట్రో రైల్ విస్తరణ చేపడుతున్నామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూ.24వేల కోట్లతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు.

**భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణ:** భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం భూ భారతి 2025ను ప్రవేశ పెట్టామన్నారు. తమ ప్రభుత్వంలో రైతులకు ఉపయోగపడేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ధరణి కొందరికి చుట్టమైతే, భూభారతి ప్రజలకు రక్షణ చట్టమన్నారు. రైతులకు వివాదాలు లేని భూములు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరుస్తూ వారి విశ్వాసాన్ని పొందామన్నారు. సివిల్స్‌కు ఎంపికైన వారికి లక్ష రూపాయల ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. గురుకుల విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. రూ.200 కోట్లతో నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలు నిర్మిస్తున్నామన్నారు.

**కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయానికి తెలంగాణ కుల సర్వేనే కారణం**

దేశంలో దాదాపు వందేళ్ల క్రితం కులగణన జరిగిందని, వందేళ్లలో జరగని కులగణనను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక చర్యతో కేంద్రంలో కూడా కదలిక వచ్చిందని, వచ్చే జనగణనలో కులగణన కూడా చేర్చుతామని ఇటీవల కేంద్రం ప్రకటించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయానికి తెలంగాణ కులసర్వేనే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాన్ని ప్రక్షాళన చేపట్టామని సిఎం చెప్పారు. ప్రభుత్వ వసతిగృహం విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిన విషయం గుర్తు చేశారు. ఉస్మానియా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. పేదల ఆరోగ్యం కాపాడటమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు.


**శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు నెంబర్‌వన్:** శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశంలోనే ముందున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల తెలంగాణ పోలీసులు జాతీయ స్థాయిలో అవార్డులు కూడా అందుకున్నారని చెప్పారు. డ్రగ్స్, నేరాల నియంత్రణలో తెలంగాణ పోలీసులు ముందున్నారని, సైబర్ నేరాల నివారణ, సొమ్ము రికవరీలో తెలంగాణ పోలీసుల పనితీరు నెంబర్‌వన్ అని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన




భారత్ సమ్మిట్‌లో 100 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని పర్యాటక ప్రదేశాలు, గొప్ప కట్టడాలను ప్రపంచానికి చూపించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

**మహిళలకు ఉచిత వైద్యపరీక్షల పథకం**

క్యూఆర్ కోడ్ కార్డు ఇచ్చి మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించే పథకాన్ని తీసుకొస్తామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వారికి రూ.21 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామన్నారు. పాఠశాలల నిర్వహణ మహిళలకే అప్పగించామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేశామన్నారు. ఆ పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.26 వేల కోట్లు జమ చేశామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. బోనస్ పంపిణీ వల్ల రాష్ట్రంలో సన్న వడ్ల సాగు గణనీయంగా పెరిగిందని, నేడు రాష్ట్రంలో 2.75 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం వస్తోందన్నారు. సంక్షేమ పథకాల చరిత్రలోనే సన్నబియ్యం పంపిణీ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందన్నారు.



**9 మంది ప్రముఖులకు ఒక్కొక్కరికీ రూ.కోటి నగదు పురస్కారం..**

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన 9 మందికి రూ.కోటి చొప్పున నగదును సిఎం రేవంత్ రెడ్డి అందజేశారు. ఎక్కా యాదగిరిరావు, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరికి నగదు పురస్కారాన్ని అందించారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి తరపున వారి కుటుంబసభ్యులు అందుకున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరపున ఆయన కుమార్తె పురస్కారాన్ని స్వీకరించారు. బహుభాషా సాహితీ వేత్త నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారం అందించారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 19 మంది పోలీస్ అధికారులకు మెడల్ ఫర్ గ్యాలంట్రీ అందజేశారు. 11 మందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులను ముఖ్యమంత్రి అందచేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రెసిడెంట్ మెడల్ అందుకుంటున్న ఎసిబి డిజి విజయ్‌కుమార్, చిత్రంలో డిజిపి డాక్టర్ జితేందర్ కూడా ఉన్నారు.

## ప్రపంచ భాగస్వామ్యాలతో రాష్ట్ర పురోభివృద్ధి

### ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ భవిష్యత్తు కోసం కొత్తగా ప్రపంచ భాగస్వామ్యాలతో వివిధ ప్రాజెక్టులు చేపట్టి రాష్ట్ర పురోభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళుతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుక సందర్భంగా హైదరాబాద్‌కు వచ్చిన కిటాక్యూషు నగర మేయర్ కజుహిసా టెక్యూచి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ వంటి రంగాల్లో కిటాక్యుషు సహకారం కోసం ముఖ్యమంత్రి సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. గత ఏప్రిల్‌లో జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కిటాక్యూషు నగరాన్ని సందర్శించిన సందర్భంగా ఆ నగర మేయర్ కజుహిసా టెక్యూచితో సమావేశమైనప్పుడు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు సంస్థలతో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఒఐ) కుదుర్చుకున్నారు. తాజాగా జరిగిన భేటీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ జపాన్ పర్యటన సందర్భంగా కిటాక్యూషు నగర ఎకోటౌన్ మాడల్తో చాలా ప్రేరణ పొందానని, మీరిచ్చిన ప్రేరణతోనే తెలంగాణ ప్రభుత్వం అలాంటి నమూనాను హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం కోసం అనేక సంస్థలతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేశామన్నారు.

సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, సున్నా ఉద్గారాలు, పట్టణ ఆవిష్కరణలలో ఈ సహకారం పునాది కానుందన్నారు. మూసీ నది అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించిందని, తెలంగాణ యువతకు నైపుణ్యం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అన్నారు. జపాన్‌లో అవకాశాలను అన్వేషించాలనే అభిలాషతో ఇక్కడి విద్యార్థులు జపనీస్ భాషను నేర్చుకోవాలని అనుకుంటున్నారని, ఔత్సాహికులకు జపనీస్ నేర్పించాలని భావిస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా కిటాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీ కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు.

కిటాక్యూషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్‌కు సరిపోయే విధంగా ఉందని, రెండింటి మధ్య స్నేహం సుదీర్ఘ కాలం కొనసాగాలని కోరుకుంటున్నానన్నారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్ విజేతలకు రాజ్‌భవన్‌లో తేనేటి విందు

### విజేతలను సన్మానించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు
### ముఖ్య అతిథిగా హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిస్ వరల్డ్ 2025 పోటీలు తెలంగాణ గౌరవాన్ని ప్రపంచానికి చాటిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మహిళల సాధికారతను ప్రోత్సహించే ఈవెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. రాజ్‌భవన్‌లో మిస్ వరల్డ్ 2025 విజేతలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనేటి విందు ఇచ్చారు. అంతకుముందు వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎం.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ 2025 పోటీ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను వివరించారు. ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పనిచేశామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణను ప్రదర్శించేందుకు ఈవెంట్ మంచి అవకాశమని పేర్కొన్నారు. మే 31న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరిగిన 72వ మిస్ వరల్డ్ ఫైనల్స్‌లో భాగంగా, 108 దేశాల నుంచి పాల్గొన్న అభ్యర్థుల్లో ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ (థాయ్‌లాండ్) మిస్ వరల్డ్ 2025 కిరీటం గెలుచుకోగా, హస్సెట్ డెరెజె అడ్మాస్సు (ఇథియోపియా) మొదటి రన్నర్ అప్, మజా క్లాజ్డా (పోలాండ్) రెండో రన్నర్‌అప్, ఆరేలీ జోచిమ్ (మార్టినిక్) మూడో రన్నర్‌అప్గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో విజేతలతో పాటు మిస్ వరల్డ్ చైర్మెన్ జూలియా మోర్లీ కూడా పాల్గొన్నారు. అంతకుముందు మిస్‌వరల్డ్ ఒపల్ సుచాత శ్రీ, ఇతర కాంటినెంటల్ విజేతలకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి జితేందర్, పలువురు సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరులకు సిపిఐ ఘన నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ అమరవీరులకు సిపిఐ ఘన నివాళులు అర్పించింది. హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ నారాయణ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఆయన ప్రజాస్వామ్యాన్ని అంతం చేశారన్నారు. తెలంగాణలో ప్రజానీకంతో పాటు తన పార్టీలో కూడా ప్రజాస్వామ్యం లేకుండా చేశారన్నారు. అంతర్గతంగా, బహిరంగంగా ప్రజాస్వామ్యం లేకుండా ఫామ్‌హౌజ్ పాలన కొనసాగించారని, అదే ఇప్పుడు ఆయన కూతరు బిఆర్ఎస్ నుంచి బయటకు వచ్చేందుకు కారణమైందన్నారు. అమరులకు నివాళులు అర్పించిన వారిలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చందూ నాయక్, షైమిదా ఉన్నారు. అంతకుముందు గన్ పార్క్ వద్ద ప్రజానాట్యమండలి కళాకారులు తమ ఆట పాటలతో ఆకట్టుకున్నారు.

**డాక్టర్ నారాయణకు ప్రభుత్వం సముచిత గౌరవం**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ప్రాత పోషించిన సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించింది. సోమవారం గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమర వీరులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం నివాళులు అర్పించేందుకు డాక్టర్ నారాయణను సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో అందరి కంటే ముందుగా పోరాడింది, క్రియాశీల పాత్ర పోషించింది నారాయణే అని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు.

## ప్రజల ఆశలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ప్రాణ త్యాగాలతో, సబ్బండ వర్గాల పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి సాధించి, నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్ అమలైనప్పుడే తెలంగాణ ప్రజలు ఆశించిన తెలంగాణ సాకారం అవుతుందని, ఆ దిశగా పాలకులు తమ కార్యాచరణను అమలు చేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. 11వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, బస్టాండు సెంటర్లోని అమరవీరుల స్తూపం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి, తెలంగాణ ఉద్యమ అమరులకు నివాళులర్పించారు, సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తొలి, మలి దశ ఉద్యమానికి కొత్తగూడెం ప్రాంతమే నాంది పలికిందని, ఇక్కడ ప్రారంభమైన ఉద్యమం ప్రతిఒక్కరిలో స్ఫూర్తిని నింపి రాష్ట్ర సాధనకు బాటలు వేసిందన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి స్వరాష్ట్రం కోసం జరిగిన పోరులో అగ్రభాగాన నిలిచింది సిపిఐనేనని, ఉద్యమాన్ని తారాస్థాయికి చేర్చి ప్రజల్లో, కేంద్రంలో కదలిక తెచ్చింది సిపిఐనేనన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణా రాష్ట్రంలో ఆ ఉద్యమ ఫలాలను ప్రజల దరిచేర్చే విధంగా ఉద్యమాలతో ప్రభుత్వాలపై వత్తిడి చేసే భాద్యతను సిపిఐ స్వీకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిర్బంధాలు లేని స్వేచ్ఛాయుత పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, అలాంటి తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనూ స్వేచ్ఛలేని నిర్బంధాలతో కూడిన పదేళ్ల పాలన నుంచి విముక్తి లభించినప్పటికీ ఉద్యమ ఫలాలు ప్రజల దరిచేరాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో నీటిపారుదల, విద్యుత్, మౌలిక సదుపాయాల వంటి అంశాల్లో అభివృద్ధి జరుగుతున్నప్పటికీ అది మరింత వేగం పుంజుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగా కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి నిధులు వెచ్చిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా సాగిన ఉద్యమ సమయంలో తృణ ః ప్రాయం ప్రాణాలను అర్పించిన అమరవీరులను సర్మించుకుంటూ ఎక్కడికక్కడ నివాళ్లు అర్పించారు. తెలంగాణ ప్రజలు ఆనాటి ఉద్యమ సన్నివేశాలను గుర్తుచేసుకుని ఉద్వేగాన్నికి గురయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయా పార్టీల కార్యాలయాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన తదితర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో తెలంగాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాతో పాటు తమ తమ పతాకాలను ఆవిష్కరించి అమరులకు నివాళ్లు అర్పించారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మగ్ధూంభవన్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, సయ్యద్ అజీజ్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీభవన్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ యాదవ్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, అమీర్ అలీఖాన్, బలమురి వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ గీతారెడ్డి, మాజీ ఎంపిలు అంజన్ కుమార్ యాదవ్, వి.హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు నూతి శ్రీకాంత్, మెట్టు సాయికుమార్‌లు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణరాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు ఈటెల రాజేందర్, మాజీ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి అమరులకు నివాళ్లు అర్పించారు. తెలంగాణ సాధనలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను నిర్మించుకోవడమే వారి త్యాగాలకు నిజమైన గౌరవమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు భైరీ రమేష్, పల్లె వినయ్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఎంఎల్‌సి మధూసూధన్ చారి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు టి.హరీష్‌రావు, సబితాఇంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

**బిసి కమిషన్ కార్యాలయంలో..**

తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి.నిరంజన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలల, శ్రీనివాసరావు డిప్యూటీ డైరెక్టర్, సతీష్ కుమార్ స్పెషల్ ఆఫీసర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. బిసి కమిషన్ ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో బిసి కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కమిషన్‌లో జరిగే నిర్ణయాలు, పత్రిక ప్రకటనలు సులువుగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని చైర్మన్ నిరంజన్ ప్రజలకు తెలిపారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు**

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజనుద్దేశించి ప్రసంగించారు. శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు ప్రొఫెసర్ కోదండరామ్, విజయశాంతి, పలువురు ఎంఎల్ఎలు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి కార్యాలయంలో ఐజి శ్రీనివాస్‌లు జాతీయ పతాకాన్ని ఎగురువేయగా, మాసబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్‌లో తెలంగాణ ఫిలిం డెవలఫ్‌మెంట్ సంస్థ చైర్మన్ దిల్‌రాజు జాతీయ జెండాను ఎగురవేశారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా మింట్ కాంపౌండలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనఅమరవీరుల చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. జిహెచ్‌ఎంసిలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ అనదీప్ దురిశెట్టి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

**గన్‌పార్క్ వద్ద అమరులకు సిఎం ఘన నివాళి**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరు సూప్తం వద్ద ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, అధికారులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమరవీరుల సూప్తం వద్ద తెలంగాణ అమర వీరులకు పుష్పంజలి సమర్పించి శ్రద్ధాంజలి ఘంటించారు. అదే విధంగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, పిసిసి చైర్మన్ బి. మహేష్ కుమార్ గౌడ్, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాం పుష్పాంజలితో నివాళులు అర్పించారు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్‌లు అమర వీరులకు నివాళ్లు అర్పించారు.

**హైకోర్టు ప్రధాన భవనంపై ..**

తెలంగాణ స్టేట్ ఫార్మేషన్ డే సందర్భంగా సోమవారం హైకోర్టు ప్రధాన భవనంపై జాతీయ జెండాను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ ఎగురవేసిన చిత్రం. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఏసీజే ప్రసంగం చేయలేదు.











అనంతరం తేనీటి విందు జరిగింది.

## పొత్తులు ఉండవు : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోబోదని, రాబోయే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు చెల్లించినట్టు సిఎం రేవంత్ రెడ్డి ఆధారాలను చూపిస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను, బిఆర్ఎస్ గులాబీ జెండాను శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ఎంఎల్ఎలు వివేకానంద గౌడ్, ఎంఎల్‌సి సురభివాణిదేవి, బిఆర్ఎస్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య, డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లికి పూల మాల వేసి, అమరవీరులకు, ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళ్లు అర్పించారు. అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ బిజెపి ఎంపిలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

ఎవరు స్పందించినా, స్పందిచకపోయినా తాము సుప్రీం కోర్టుకు వెళ్లి బనకచర్ల ప్రాజెక్ట్ ను అడ్డుకుంటామని తెలిపారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని, ఎవరైనా బిఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే,వారి పేర్లను తమ రెడ్ బుక్‌లో రాసుకుంటామని హెచ్చరించారు.సిఎంకు సన్నిహితంగా ఉండే ఒక ఎంపి, ఒక కార్పొరేషన్ ఛైర్మన్ మిల్లీ మ్యాగీ తో అసభ్యకరంగా ప్రవర్తించారనే వార్తలు వస్తున్నాయని, వెంటనే సిసి ఫూటేజీ రిలీజ్ చేసి,బాధ్యులపైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడరని, ఈ ప్రాజెక్ట్ తెలంగాణకు ఒక శాపం కాబోతున్నదని ఆరోపించారు. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించడం ద్వారా గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంపైన రాష్ట్ర ప్రభుత్వం ప్రేమ ఉంటే బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మధుసూదనాచారి బిఆర్ఎస్ పట్ల దుష్ప్రచారం చేసి, గందరగోళానికి గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ జాతి ఉన్నంత వరకు బిఆర్ఎస్ ఉండేలా అందరూ అడుగులు వేద్దామన్నారు. బి వినోద్ కుమార్ మాట్లాడుతూ పరుగులు తీయాల్సిన వయసులో ఉన్న తెలంగాణ రాష్ట్రం దురదృష్టవశాత్తు దుర్మార్గుల చేతుల్లోకి వెళ్ళిందన్నారు.

## తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంపై తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం సీపీఐ జిల్లా నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. తొలుత హనుమకొండ అదాలత్ సెంటర్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదకొండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ కోసం పోరాడిన పార్టీలను, సంఘాలను ఉద్యమకారులను గుర్తించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి , ఎన్ఎ.స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎదునూరి వెంకటరాజం, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, ఏశబోయిన శ్రీనివాస్, ఎం. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## నష్టపరిహారం అందకపోవడంపై రైతు కమిషన్ ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ములుగువిత్తనోత్పత్తి బాధిత రైతులకు ఇప్పటీ వరకు నష్టపరిహారం చెల్లించకపోవడం పట్ల రైతుకమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ ములుగు జిల్లాలో విత్తనోత్పత్తి ఘటన పురోగతికి సంబంధించిన జూమ్ మీటింగ్ ద్వారా సమిక్షించారు నిర్వహించారు. ఈ సమావేశంలోఅగ్రికల్చర్ డైరెక్టర్ గోపి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్ర మిశ్రా, డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ కేశవులు, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, రైతు కమిషన్ సలహాదారులు రామాంజనేయులు, దొంతి నర్సింహా రెడ్డి, ఎం. శ్రీనివాస్ రెడ్డిలతోపాటు అడ్వకేట్ రామచంద్ర రెడ్డి, కమిషన్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
**నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయము, ఇరిగేషన్ సర్కిల్, కోదాడ, సూర్యాపేట జిల్లా.
No. 10/2025-26 టెండర్ నోటీసు తేది: 31.05.2025
**పని పేరు:** సూర్యాపేట జిల్లా, నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువపై కిమీ.76.808 నుండి కిమీ 132.809 వరకు గల మేజర్లు మెకానికల్ మరమ్మత్తుల పని చేయుట గురించి, **మొత్తం అంచనా విలువ:** రూ. 82.79 లక్షలు. **గమనిక:–** టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయము: 09.06.2025 మ. 3.00 వరకు మిగతా వివరములకు https://tender.telangana.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, కోదాడ.
DIPR R.O. No. : 2944-PP/CL/ADVT/1/2025-26, Date: 02-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, వెటర్నరీ సెక్షన్, ఎల్‌బి నగర్ జోన్, జిహెచ్‌ఎంసి.
మెయిల్: ade.ghmc@gmail.com సెల్ నం. 9989930397
NIT No. 03/DD/VET/LBNZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 03.06.2025
**క్ర.సం. 1, పని పేరు:** 2025 బక్రీద్ సమయంలో ఆవులు మరియు ఇతర ఉత్పాదక జంతువుల వధను నివారించడానికి కొన్ని ఏర్పాట్లు. **అంచనా విలువ :** రూ.5,65,030/-, **ప్రారంభ తేది & ఆఖరి తేది:** 03.06.2025న ఉ.10.00గం.ల నుండి సా.5.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు https://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- డిప్యూటీ డైరెక్టర్, వెటర్నరీ సెక్షన్, ఎల్‌బి నగర్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 2951-PP/CL/ADVT/1/2025-26, Date: 02-06-2025

ప్రజాపక్షం
మంగళవారం, 03 జూన్

# రాజకీయ రణగొణధ్వనులు

వడివడిదడకతో పురోగమిస్తున్న తెలంగాణ రాష్ట్రం 12వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకోసారి వయోజన ఓటింగ్ ప్రాతిపదికపై జరిగే ఎన్నికల్లో అధికారం పార్టీల చేతులుమారటం సహజం. ప్రజల తీర్పును శిరసావహించటం అనివార్యం అని తెలిసినా దాన్ని హుందాగా స్వీకరించే ప్రజాస్వామిక మనస్తత్వం కొరవడినపుడు రాజకీయ స్పర్థలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి.అందుకు తెలంగాణ రాష్ట్రమే ఉదాహరణ. సుదీర్ఘకాల ప్రజా ఉద్యమం పర్యవసానంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యాన్ని గుర్తుచేసుకోవాలి. ఆ ఉద్యమానికి పేటెంట్ తమదేనని బలంగా విశ్వసించే తెలంగాణ రాష్ట్ర సమితి, దాని అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 9 సంవత్సరాలకు పైగా ఏకవ్యక్తిత్వంగా ఏలుబడి సాగించారు. ఆయన పాలన విమర్శలపాలైంది, ఎక్కడ విఫలమైందీ అనే సవివరమైన విశ్లేషణ ఇక్కడ సాధ్యంకాదు. ఆ పార్టీయే విశ్లేషణ చేసుకోనప్పుడు మన కెందుకు? అయితే ఆ పార్టీని ప్రజలు ఓడించి కాంగ్రెస్‌కు పట్టంకట్టారంటే ఆయన పాలన పట్ల ఓటర్లలో అసంతృప్తి పాలు ఎక్కువ ఉన్నట్లేకదా! కాని తమ అధికారాన్ని ఎవరో గుంజుకున్నట్లు గత 16 మాసాలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిత్యం విమర్శలు, ఆరోపణలు, దూషణలతో ముప్పేట దాడిచేస్తున్న బిఆర్‌ఎస్‌గా మారిన టిఆర్‌ఎస్ తీరు వారి కార్యకర్తలకు కర్తవ్యబోధగా ఉండవచ్చు, కాని సామాన్య ప్రజలు చెవిఒగ్గటంలేదన్న వాస్తవాన్ని ఆ పార్టీ నాయకులు గ్రహించటం లేదు. ప్రభుత్వం తలపెట్టిన ప్రతి కార్యక్రమానికీ అడ్డుతగులుతూ అప్రతిష్ట తెచ్చుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకిరావాలని కలగనటం ఆక్షేపణీయం కాదు. అయితే తాము అధికారంలోకి వచ్చేవరకు అభివృద్ధికి అడ్డుపడటమే పనిగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో స్థిరపడితే అధికార అందలమెక్కడం పునరాగమనం పగటికలగానే మిగిలిపోతుంది. తాను పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఘంటాపథంగా చెబుతున్నారు. అది బిఆర్‌ఎస్ నాయకుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నట్లుంది. అందుకేనేమో రేవంత్‌రెడ్డి పదవి త్వరలో ఊడుతుంది, రాహుల్‌గాంధీ ఇంటర్వ్యూ కూడా ఇవటంలేదని పాటపాడుతున్నారు. రేవంత్‌రెడ్డిని అభ్యాస పాత్రేయకపోతే తాము ముందుకు రాలేమని ఆ నాయకుల్లో ఉన్న భయానికిది సంకేతం. వీరు ముందుగా తమ పార్టీ వ్యవహారాలు చక్కదిద్దుకుంటే మేలు. రోజూ మీడియా ముందుకొచ్చి నోరుపారేసుకునే బిఆర్‌ఎస్ నేతల్లో ఎందరు తాము నేరుగా కెసిఆర్ దగ్గరకు వెళ్లగలరో చెప్పగలరా?

ఆ పార్టీలో అప్పుడే వారసత్వ జగడం మొదలైందని కెసిఆర్ కుమార్తె ఆరోపణలు పోటీ రాజకీయాలు తేటతెల్లంచేస్తున్నాయి. అందరూ కెసిఆర్‌ను ముందుగా నమస్కారంచేసే ఎవరివర్గంలో వారు తమ సొంత రాజకీయాలు సాగిస్తున్నారు. దీని పర్యవసానం ఎలా ఉన్నప్పటికీ ఈ జగడంలోకి బిజెపి లాగబడింది. వచ్చే ఎన్నికల్లో అధికారం తమదేనని ఊదరగొడుతున్న బిజెపికి మేలో, కీడో కాలమే చెబుతుంది. బిఆర్‌ఎస్ బలహీనపడితే తాము బలపడేటమనే (లోక్‌సభ ఎన్నికల ఫలితాలే ఇందుకు సాక్ష్యం) వ్యూహంతో పనిచేస్తున్న బిజెపి – కాంగ్రెస్,బిఆర్‌ఎస్ ఒకటే, కలిసిపోతాయనే ప్రచారం చేస్తుండగా, కాంగ్రెస్, బిజెపి ఒకటేనని బిఆర్‌ఎస్ ఆరోపణలు చేస్తోంది. బిజెపి, బిఆర్‌ఎస్ కలవటం ఖాయమంటోంది కాంగ్రెస్. అయితే తాను (లిక్కర్ కేసులో) జైల్లో ఉండగానే బిఆర్‌ఎస్‌ను బిజెపిలో కలిపే ప్రయత్నాలు జరిగాయని, తాను వ్యతిరేకించానని శ్రీమతి కవిత బయటపెట్టి బిఆర్‌ఎస్‌లోని తన వ్యతిరేకులను ఇబ్బందుల్లో పడేశారు. బిఆర్‌ఎస్ మనుగడసాగించాలన్నా, బలపడాలన్నా అది తప్పుడు ఆరోపణ అని వారు ఖండించాల్సి వచ్చింది. బిజెపి అసలనాయకులు, అరువుచ్చిన నాయకుల మధ్య అధిపత్యపోరు వల్లనే రాష్ట్రపార్టీ అధ్యక్షుడి వరణం ఇంతవరకూ జరగలేదు. కేంద్రంలో మంత్రులుగా ఉన్న ఇద్దరూ –తెలంగాణకు కార్యస్థానంగా ఇటు కాంగ్రెస్ ప్రభుత్వంపై, అటు బిఆర్‌ఎస్‌పై ధ్వజమెత్తుతున్నారు. అయితే కేంద్రంనుండి ఒక్కప్రాజెక్టు రాష్ట్రానికి తేలేదన్న కాంగ్రెస్ ఆరోపణ వారికి ముందరికాళ్లకు బంధమవుతోంది. పైగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు బిఆర్‌ఎస్ సమస్యలయితే అడ్డుపడుతున్నారనే కాంగ్రెస్ ఆరోపణలను గుర్తుతున్నారు. అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణనను, దాని ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు, ఎస్‌సిల్లో ఉపవర్గీకరణ వంటి తీవ్రప్రభావంతమైన చర్యలతో బిజెపి, బిఆర్‌ఎస్ నోళ్లకు తాళం వేయగలిగింది. అందువల్ల వచ్చే ఎన్నికలదాకా ఈ రణగొణలు తప్పవు. అయితే ప్రజలు రాజకీయ నాయకులకన్నా విజ్ఞులు. సరళంగా, సూటిగా ఆలోచిస్తారు. ఈలోపు రాజకీయనాయకులు త్రిముఖంగా, బహుళంగా చేసేవన్నీ మనుగడకోసం సాగించే విన్యాసాలే!

# పేదలకు తరుగుతున్న రుణాలు, పెరుగుతున్న బకాయిలు

-జ్ఞాన్ పాఠక్

జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం వహిస్తున్న అధికార యంత్రాంగంలోని నాయకులు, ఉన్నతాధికారులు తమ ప్రగల్భాల ద్వారా మన ఆర్థిక వ్యవస్థ బాగా ఉందనే తప్పుడు భావనను కలిగిస్తున్నారు. కానీ, అంకెలు మరో విధంగా మాట్లాడుతున్నాయి. పేదలలో రుణగ్రస్తత పెరిగింది. పేద రుణగ్రహీతలు అప్పులను తిరిగి చెల్లించలేకపోవడం కూడా పెరిగిపోయింది. 2023–24లో మైక్రో ఫైనాన్స్ రుణ అపరాధాలు పెరిగిపోవడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరికల నేపథ్యంలో ఆర్థిక సంస్థలు వారికి రుణాలు ఇవ్వకుండా ఆపుతున్నాయి. ఫలితంగా పేద ప్రజలు భారీగా వడ్డీలు వసూలు చేసే, వారి జీవితాలను దారుణంగా మార్చే ప్రైవేటు వడ్డీ వ్యాపారులు బారిన పడుతున్నారు. ఇది ప్రభుత్వం అత్యవసరంగా దృష్టి సారించాల్సిన అంశం.






మోదీ ప్రభుత్వం ఇలాంటి నిరుపేద రుణ గ్రహీతల విషయంలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వారి జీవితాలను సులభతరం చేయాలి. ఎందుకంటే ఆర్‌బిఐ పర్యవేక్షణలో బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా ప్రభుత్వం భారీ మొత్తం నగదును పొందుతున్నది. డిసెంబర్ 2024లో మైక్రో ఫైనాన్స్ రంగంలో తీవ్రమవుతున్న ఒత్తిడి గురించి ఆర్‌బిఐ బ్యాంకులను హెచ్చరించి, జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. బ్యాంకులు తమ వంతుగా పేదలైన రుణగ్రహీతలకు ఇచ్చే రుణాలను గణనీయంగా తగ్గించాయి.మన బ్యాంకింగ్ వ్యవస్థలోని ప్రతి లాభాల వెంట పరుగెడుతుంటాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్‌బిఐ తమ ప్రధాన లక్ష్యమైన ప్రజా సంక్షేమానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తాయి. ఆర్‌బిఐ ప్రధాన విధి లాభాలను ఆర్జించటం కాదు. ఏమి చేసైనా ప్రజల బాగు కోసం ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచడం. కానీ ఆ సంస్థ భారీ లాభాలను ఆర్జిస్తూ, భారత ప్రభుత్వానికి భారీ మొత్తాన్ని అందజేస్తోంది.

ఆర్‌బిఐ మే 23న ప్రకటించిన దాని ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌గా ఎన్నడూ లేనంతగా మిగులు రూ. 2.69 లక్షల కోట్లు చెల్లిస్తుంది. ఆర్‌బిఐ 2023–24 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ. 2.1 లక్షల కోట్లు బదిలీ చేసింది. దీనిని బట్టి బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత భారీ లాభాలను ఆర్జిస్తుందో ఊహించుకోవచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా తమ నిరంతరం పెరుగుతున్న లాభాలు సంపాదించే విధానాలతో భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. అవి ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ సామాన్య ప్రజలు మాత్రం దెబ్బతింటున్నారు. దీని ద్వారా మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా రంగాన్ని ప్రైవేటీకరించడానికి ఎందుకు సిద్ధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రత్యేకించి పేద రుణగ్రహీతలు, సాధారణంగా పేద ప్రజలు బాధపడటం అనైతికం. తాజా డేటా ప్రకారం, 2024–25 సంవత్సరంలో 31 రోజులకు పైగా గడువు దాటిన సూక్ష్మ రుణ బకాయిలు 163 శాతం పెరిగి రూ. 43,075 కోట్లకు చేరుకున్నాయి. అంతకుముందు సంవత్సరం ఇది రూ. 16,379 కోట్లు. సాంకేతికంగా, వీటిని పోర్ట్‌ఫోలియో ఎట్ రిస్క్ (పిఎఆర్) అని అంటారు.

సూక్ష్మ రుణ రంగానికి స్థూల రుణ పోర్ట్‌ఫోలియో (జిఎల్‌పి) మార్చి 2024లో రూ. 4,42,700 కోట్లు ఉండగా, మార్చి 2025 నాటికి రూ. 3,81,200 కోట్లకు తగ్గింది. ఈ తగ్గుదల 13.9 శాతం. స్థూల రుణాలు మాత్రమే కాకుండా, క్రియాశీల రుణాలు కూడా ఈ కాలంలో రూ. 16.1 కోట్ల నుండి 14 కోట్లకు తగ్గాయి.

2023–24లో 0.7 శాతం ఉన్న 130 రోజుల పిఎఆర్ 2024–25లో 1.4 శాతానికి పెరిగింది. 2023–24లో 2.1 శాతం ఉన్న 31–180 రోజుల గడువు దాటిన పిఎఆర్ 2024–25లో 6.2 శాతానికి పెరిగింది. అంటే అది దాదాపు మూడు రెట్లు పెరిగింది అని సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ డేటా పేర్కొంది. అంతకంటే దారుణంగా ఈ కాలంలో 180 రోజులకు పైగా గడువు దాటిన పిఎఆర్1.6 శాతం నుండి 5.1 శాతానికి పెరిగింది.

రూ. 1 లక్షకు పైబడిన అధిక విలువ గల రుణాల విషయానికొస్తే, వాటి పాయింట్ ఆఫ్ సేల్స్ (పిఒఎస్) విస్తరిస్తున్నందున బకాయిలు పెరుగుతున్నాయని సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ చెబుతోంది. తక్కువ విలువ గల రుణాల విషయంలో బకాయిలు చాలా తక్కువగా ఉన్నాయి.

సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ డేటా ప్రకారం గత మూడు నెలల్లో రుణ వినియోగం మార్చి 2024లో రూ. 1,15,600 కోట్లు ఉండగా, మార్చి 2025లో రూ. 71,850 కోట్లకు తగ్గింది. గత మూడు నెలల్లో రుణాల సంఖ్య కూడా మార్చి 2024లో 240.5 లక్షల నుండి మార్చి 2025లో గణనీయంగా 133 లక్షలకు తగ్గింది.

సిఆర్‌ఐఎఫ్ హై మార్క్ రూ. 1 లక్షకు పైబడిన అధిక విలువ గల రుణాల వైపు పెరుగుతున్న మార్పును ఎత్తి చూపింది. ఇది ఏడాది ప్రాతిపదికన 38.5 శాతం పెరిగింది. దీనికి విరుద్ధంగా రూ. 30,000 లోపు రుణాల్లో (35.9) శాతం ప్రతికూలవృద్ధి ఉంది. ఇది చిన్న రుణగ్రహీతలకు రుణాలు దూరమవుతున్న మార్పును సూచిస్తున్నది.

ఇలా ఎందుకు జరిగింది? ఎందుకంటే, బ్యాంకులు పేదలైన రుణగ్రహీతలకు రుణాలు నిరాకరించడం ద్వారా మైక్రో ఫైనార్స్ రంగం ఒత్తిడిని తీసుకువస్తున్నాయి. ఇది ఉద్యోగ మార్కెట్‌లో ఉద్యోగాలు పొందలేక, బ్యాంకుల నుండి చిన్న రుణాలు తీసుకొని చిన్న వ్యాపారాలు చేయడానికి ప్రయత్నిస్తున్న పేద ప్రజలను ప్రభావితం చేస్తోంది. వారు ఇప్పుడు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులకు ఎర అవుతున్నారు.

క్షేత్ర స్థాయిలో ఆర్థిక పరిస్థితి జాతీయ స్థాయిలో, ముఖ్యంగా అధికార వర్గాల్లో గ్రహించిన దానికంటే చాలా దారుణంగా మారింది. ప్రజలు తమ మనుగడ కోసం బహుళ వనరుల నుండి రుణాలు తీసుకుంటున్నారు. ఇది వారిపై అధిక రుణ భారానికి దారి తీస్తుంది. ఇతర ఆర్థిక తాకిడిలు, ఆదాయ అనిశ్చితులు కూడా వారి రుణం తిరిగి చెల్లింపు సామర్థ్యంపై ప్రభావం చూపుతున్నాయి. అయినప్పటికీ, 5 లేదా అంతకంటే ఎక్కువ మంది నుండి రుణాలు తీసుకుంటున్న రుణగ్రహీతలు 202324లో 9.7 శాతం నుండి 2024–25లో 4.9 శాతానికి తగ్గారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది రుణదాతల నుండి రుణాలు పొందుతున్న రుణగ్రహీతల వాటా సెప్టెంబర్ 2021లో 3.6 శాతం నుండి సెప్టెంబర్ 2024 చివరి నాటికి 5.8 శాతానికి పెరిగింది. ఇది రుణగ్రహీతల రుణ భారం విపరీతంగా పెరిగిందనటానికి సూచిక అని ఆర్‌బిఐ 2024 డిసెంబర్‌లో తెలిపింది.

కోవిడ్19 సంక్షోభం తరువాత మైక్రో ఫైనాన్స్ రంగానికి రుణం పెరిగింది. కొన్ని నాన్‌బ్యాంకింగ్ రుణప్రదాత కంపెనీలు అధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నట్లు గుర్తించబడింది. ఇది అక్టోబర్ 2024లో ఆర్‌బిఐ పర్యవేక్షక చర్యలకు హేతువైంది. అధిక వడ్డీ రేట్లను, అసమంజసమైన అధిక ప్రాసెసింగ్ ఫీజులు, అసంబద్ధమైన జరిమానాలను వసూలు చేసే కొన్ని సంస్థల గురించి ఆర్‌బిఐ తన ఆందోళనలను ప్రముఖంగా వెల్లడించింది. ఈ సమస్య ఎంత సంక్లిష్టంగా ఉందనేది ఇది స్పష్టం చేస్తుంది. ఇది బ్యాంకింగ్ రంగం లాభదాయకతను దాటి పేద ప్రజల మనుగడకు సంబంధించి తీవ్రమైన పర్యవసానాలను కలిగి ఉంది. క్షేత్ర స్థాయిలో తలెత్తుతున్న పరిస్థితిని ఎదుర్కోవడానికి మోదీ ప్రభుత్వం తక్షణ బహుముఖ వ్యూహాన్ని పరిశీలించాలి.

# మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మెడికల్ టూరిజంకు గమ్యస్థానంగా మారుతున్నది. ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, అత్యాధునిక వైద్యపరికరాలు, నిపుణులైన వైద్యులు, నాణ్యమైన చికిత్స అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. ప్రతి సంవత్సరం వేలాది మంది విదేశీయులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వారు హైదరాబాద్ వచ్చి నాణ్యమైన చికిత్సలు పొందుతున్నారు. విదేశాల్లో సాధ్యం కానీ ఎన్నో కష్టమైన సర్జరీలు హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో విజయవంతంగా చేసి చూపిస్తున్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే హైదరాబాద్‌లో చికిత్స ఖర్చులు అరవై శాతం తక్కువ. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, క్యాన్సర్ చికిత్స, కాస్మోటిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఫెర్టిలిటీ చికిత్సలు, అవయవ మార్పిడి లాంటి ఎన్నో సంక్లిష్టమైన సర్జరీలను నిపుణులైన వైద్యులు, హెల్త్ కేర్ సిబ్బంది హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా చేస్తున్నారు. హైదరాబాద్ లోని ఆసుపత్రుల్లో నైపుణ్యం గల డాక్టర్లతో పాటు విదేశీయులతో ఇబ్బంది లేకుండా ఇంగ్లీష్ మాట్లాడే డాక్టర్లు, హెల్త్ కేర్ సిబ్బంది, అనువాదకులు ఉండడం, కాస్మోపాలిటన్ సంస్కృతి, సురక్షితమైన భద్రత, అనువైన వసతి ప్రయాణ సౌకర్యాలు వంటివి అనుకూలంగా ఉండటంతో అనేక దేశాల నుంచి రోగులు నాణ్యమైన, విలువలతో కూడిన వైద్యం అందుతుందనే నమ్మకంతో హైదరాబాద్‌లో ఆసుపత్రులకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. వైద్య సదుపాయాల నాణ్యత, నైపుణ్యాలు మొదలగు అన్ని అంశాలు మెడికల్ టూరిజం అభివృద్ధికి దోహదపడుచున్నవి. కార్పొరేట్ ఆసుపత్రులు విదేశీయుల కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి సిబ్బందిని, అనువాదకులను అందుబాటులో ఉంచి విదేశీయులను ఆకర్షిస్తున్నాయి. హైదరాబాదులో నాణ్యమైన చికిత్సలు అతి చౌకగా లభించడంతో విదేశీయులే గాక ఇతర రాష్ట్రాల వారు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రతి సంవత్సరం లక్షకుపైగా విదేశీయులు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని అంచనా! 2024లో వైద్య సేవల కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులు 4.64 లక్షలు అయితే అందులో 1.51 లక్షల మంది హైదరాబాదులోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. దేశంలోని మెడికల్ టూరిజంలో హైదరాబాద్ వాటా 30% పైనే అని చెప్పవచ్చు. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్ మెడికల్ టూరిజంను ప్రమోట్ చేయడం జరుగుచున్నది.హైదరాబాదులో తక్కువ ఖర్చుతో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను మెడికల్ టూరిజంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన పోటీదారులందరితో గచ్చిబౌలిలోని ఎఐజి ఆసుపత్రిలో వైద్య పర్యాటకంపై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. మెడికల్ టూరిజం అభివృద్ధికి హైదరాబాదులో విస్తృతమైన అవకాశాలు ఉండడంతో దీని ఆలంబనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. మెడికల్ టూరిజం అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ విదేశీ పేషెంట్లకు అవసరమైన అనువాదకులను ప్రోత్సహించడం, వారు ఏ విధంగాను దోపిడీకి గురికాకుండా చూడడం, వారి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, వారి సంస్కృతికి తగ్గట్టుగా ఆహారం అందేలా చూడడం, వారు ఖర్చు పెట్టే ప్రతి పైసకు తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తూ ఆచరణలో పెడుతున్నది. మెడికల్ టూరిజంలో అగ్రస్థానంలో ఉండడానికి కావలసిన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్న హైదరాబాద్ మెడికల్ టూరిజం రంగంలో ప్రపంచంలోనే అందరూ కోరుకునే సురక్షితమైన ఆదర్శవంతమైన వనరులతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. మెడికల్ టూరిజం వలన మన ఆరోగ్య ఆర్థిక రంగాలు బలోపేతం అవుతున్నవి. హైదరాబాద్ మెడికల్ టూరిజం హబ్ గా రూపుదిద్దుకోవడం ఆహ్వానించదగిన పరిణామం.




పుల్లూరు వేణుగోపాల్
9701047002

# ప్రైవేట్ విద్యాసంస్థలకు చట్టాలు, జీవోలు వర్తించవా?



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యను వ్యాపారం చేస్తున్నాయి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల, కళాశాలలు అంతా మా ఇష్టం, ఫీజుల జీవోలు మాకు వర్తించవన్నట్టు, వ్యాపార కేంద్రాలు అన్నట్లుగా మార్చేస్తున్నారు. అధికారికంగా తెలంగాణలో జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలల ప్రారంభం, జూన్ ఒకటవ తేదీ నుంచి ఇంటర్ కళాశాలల ప్రారంభం. కానీ ఎప్పటి నుండో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల ప్రారంభం. అనేక పాఠశాలలు, కళాశాలలు ఈ అడ్మిషన్ల పేరుతో దందా మొదలెట్టాయి.

తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనలను గాలికి వదిలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు, కొత్తగా అడ్మిషన్ల కోసం విద్యార్థులకు అడ్మిషన్ టెస్టులను నిర్వహిస్తూ టెస్ట్ పాస్ అయితేనే సీటు, లేకుంటే లేదు అంటున్నారు. ఏకంగా ఒకటి, రెండు, మూడు తరగతి విద్యార్థులకు కూడా అడ్మిషన్ టెస్టులు నిర్వహించి అడ్మిషన్లు ఇస్తున్నారు. అడ్మిషన్ టెస్ట్ కోసం ఫీజు కట్టి, పరీక్ష రాసి పరీక్ష పాస్ అయితేనే సీటు ఇట్లా ఒక్కో తరగతిలో 100మంది విద్యార్థులకు పరీక్ష పెట్టి పదుల సంఖ్య విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చి విద్యా వ్యాపారం చేస్తున్న పరిస్థితి. ఆ తరగతిలో విద్యార్థులు సరిపడా ఉన్న అడ్మిషన్ టెస్ట్ పెట్టీ ఫీజు వసూలు చేసి మార్కులు తక్కువ వచ్చాయి, సీటు ఇవ్వలేము అని వెనక్కి పంపించే పాఠశాలల యాజమాన్యాలు అనేకం ఉన్నాయి. మళ్లీ అడ్మిషన్ ఫీజు లేదా రిజిస్ట్రేషన్ ఫీజు అంటూ ఒక్కో పాఠశాలలో రూ.10 నుంచి రూ.25 వేల వసూలు, కళాశాలల్లో రూ.5 వేల నుంచి రూ.8వేలు వసూలు ఇలా ఇష్టారాజ్యంగా లేని ఫీజులను సృష్టించి వసూలు చేస్తున్నారు. ఈ ప్రతి పాఠశాల వారు ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయడం లేదు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ప్రతి పాఠశాల కళాశాలలో వారికి వారే నిర్ణయించుకొని 15 నుండి 20% ఫీజులు పెంచుకున్న పరిస్థితి. ఫీజుల నియంత్రణ చట్టం ప్రకారం ఏ పాఠశాలలో ఎంత ఫీజుల వసూలు చేస్తున్నారో ఆ పాఠశాల, కళాశాల ఆవరణ నోటీస్ బోర్డుపై పెట్టడం లేదు, పేరెంట్స్ కమిటీలు వేయడం లేదు. టీచింగ్ సిబ్బంది వివరాలు ప్రకటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం మూలంగానే ఈ అడ్మిషన్ ఫీజులు రిజిస్ట్రేషన్ ఫీజుల వసూళ్లు చేస్తున్నారు. అనేక పాఠశాలలు పుస్తకాలు ,యూనిఫామ్‌లు అన్ని రకాల స్టేషనరీ వస్తువులను పాఠశాలల ఆవరణలోనే అమ్ముతూ పాఠశాలలను సూపర్ మార్కెట్లుగా మార్చుతున్నారు. ఇదంతా బహిరంగంగా చేస్తూ ఉన్న విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఇలాంటి విద్యా వ్యాపారాన్నీ అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. విద్యాశాఖ కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల, కళాశాలల అదనపు ఫీజు వసూళ్ల దోపిడిని అరికట్టాలి. విద్యాశాఖ తీసుకువచ్చిన ప్రతి జీవో ప్రతి విద్యాసంస్థలో అమలుచేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్ ఫీజుల వసూళ్లు, పుస్తకాలు అమ్ముడు,అధిక ఫీజుల దోపిడీ, నిబంధనలు పాటించని పాఠశాలలు, జూనియర్ కళాశాలల పై కఠిన చర్యలు తీసుకోవాలి.

# మంచి ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్నుకోవడం ఎలా...?

భారతదేశంలో ఇంజనీరింగ్ విద్య అనేది సంవత్సరాలుగా విద్యార్థులు, తల్లిదండ్రులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన విద్యగా నిలిచింది. ప్రతి ఏడాది లక్షల మంది విద్యార్థులు ఐఐటిలను, ఎన్‌ఐటిలను, ఇతర రాష్ట్ర స్థాయి, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలను లక్ష్యంగా పెట్టుకుని పోటీ పరీక్షలు రాస్తున్నారు. అయితే ప్రస్తుతం ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో, ప్రతి విద్యార్థి మౌలికంగా ఒక ముఖ్యమైన ప్రశ్నకు సమాధానమిచ్చుకోవాలి— నేను ఎలాంటి ఇంజనీరింగ్ కోర్సును ఎంచుకోవాలి? మరియు ఏ కాలేజీ నాకు సరైనదీ? ఇంజనీరింగ్ అంటే కేవలం సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అనే పాత తరహా కోర్సులు మాత్రమే అన్న దశ గడిచిపోయింది. నేటి యుగంలో ఎన్నో కొత్త కోర్సులు తెర పైకి వచ్చాయి. డిజిటల్ రంగం విస్తరిస్తున్నప్పుడల్లా ఆ రంగానికి అనుగుణంగా కొత్త కొత్త డొమెన్లు తెరపైకి వస్తున్నాయి. కొన్ని ప్రస్తుతానికి మరియు భవిష్యత్తుకు అత్యంత అవసరమైన కోర్సులు:

**ఏ కోర్సులకు డిమాండ్:** కంప్యూటర్ సైన్స్ యాక్సిలరేటడ్ మాస్టర్స్ ప్రోగామ్ (ఎఎంపి) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సంబంధించిన కోర్సులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రపంచం నేడు డేటా ఆధారిత నిర్ణయాల దిశగా దూసుకుపోతుంది. ఈ కోర్సులో విద్యార్థులు డేటా సైన్స్, మిషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి అంశాలను నేర్చుకుంటారు. Google, Amazon, Microsoft వంటి దిగ్గజ కంపెనీలు AI నిపుణులను భారీగా నియమిస్తున్నాయి. డేటా సైన్స్ (ఎఎంపి) బిగ్ డేటా అనలిటిక్స్ వంటి కోర్సులు డేటా అనలిసిస్‌లో నైపుణ్యం కలిగిన ఇంజినీర్లను తయారుచేసి కంపెనీలకు 'బిజినెస్ ఇన్సైట్' అందించగలుగుతాయి. కావున ఈ రంగానికి ప్రాధాన్యం విపరీతంగా పెరిగింది. సైబర్ సెక్యూరిటీ కోర్సులు సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్స్‌ను తరచేస్తాయి నేడు ఇంటర్నెట్ ఆధారిత సేవలు పెరిగాయి కావున హ్యాకింగ్ ముప్పు కూడా పెరుగుతోంది. అందుకే సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్లకు భారీ డిమాండ్ ఉంది. మెషిన్ లెర్నింగ్ (ఎఎంపి)రోబోటిక్స్ కోర్సులు వంటి కోర్సులు నేడు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. దీన్ని చదవడం ద్వారా రోబోట్స్‌ను రూపొందించటం, మెషిన్ లెర్నింగ్ నైపుణ్యాభివృద్ధి సాధించడం ద్వారా భవిష్యత్తును సుస్థిరం చేసుకోవచ్చు. బయోటెక్నాలజీ (ఎఎంపి) బయోఇంజనీరింగ్ కోర్సులు మంచి ఉద్యోగాలను కల్పిస్తుంది. కరోనా తర్వాత హెల్త్ టెక్నాలజీకి గణనీయమైన ప్రాముఖ్యత వచ్చింది. ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ కోర్సు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ఉన్న ముప్పుల నేపథ్యంలో ఈ రంగానికి భవిష్యత్‌లో ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్‌చెయిన్ వంటి కొత్త డొమెన్లు టెక్నాలజీ రంగంలో భారీ మార్పులకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా స్టార్టప్ సంస్కృతి పెరుగుతున్నందున ఈ నైపుణ్యాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయి.

**కాలేజీ ఎంపిక:** విద్యార్థులు ఏ కోర్సు చదవాలన్న నిర్ణయం తీసుకోవడమే కాదు, దానిని నేర్చుకునే స్థలాన్ని ఎంచుకోవడమూ అంతే ముఖ్యమైనది. మంచి కాలేజీ అనేది కేవలం భవనాల వల్ల కాదు–అది ఫ్యాకల్టీ, పరిశోధన వాతావరణం, ప్లేస్‌మెంట్స్, ఇండస్ట్రీ లింకేజ్ లాంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. భారత ప్రభుత్వ హై ఎడ్యుకేషన్ మినిస్ట్రీ విడుదల చేసే National Institutional Ranking Framework (NIRF) ర్యాంకింగ్స్ ఆధారంగా టాప్ కాలేజీలను పరిశీలించవచ్చు. ఈ ర్యాంకింగ్స్ ఫ్యాకల్టీ క్వాలిటీ, పరిశోధన, ప్లేస్‌మెంట్లు, విద్యార్థి నిష్పత్తి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. ఒక కాలేజీకి ఎంతమంది పిహెచ్.డి ప్రొఫెసర్లు ఉన్నారు? వారు పరిశోధనల్లో ఎంతగా పాల్గొంటున్నారు? వారిచే నిర్వహించే సదస్సులు, వర్క్‌షాపులు వంటి అంశాలు ఎంతో ముఖ్యమైనవి. ఇంజనీరింగ్ అంటే కేవలం పాఠ్యపుస్తకాలు కాదు. పరిశోధన చేయగలగటం కూడా ముఖ్యమే. ఆ కాలేజీలో (ఎఎంపి)లాబ్స్ ఉన్నాయా? ప్రాజెక్ట్స్ నిర్వహించబడుతున్నాయా? పరిశీలించాలి.

**ప్లేస్‌మెంట్లు (ఎఎంపి)ఇంటర్న్‌షిప్ అవకాశాలు:** మంచి కంపెనీలతో కాలేజీ సంబంధాలు ఉన్నాయా? గత సంవత్సరాల్లో ఎంత మంది విద్యార్థులు ప్లేస్ అయ్యారు? వారి ప్యాకేజీలు ఎంత? ఇలా అడగాలి. అలాగే స్టార్టప్‌లు, MNC కంపెనీలతో టైఅప్స్ ఉన్నాయా? . ఇండస్ట్రీ అవసరాల మేరకు విద్యార్థులు సిద్ధమవ్వాలంటే, విద్యాసంస్థలు ఆ పరిశ్రమలతో అనుసంధానంగా ఉండాలి. గెస్ట్ లెక్చర్స్, ప్రాజెక్ట్ మెంటరింగ్, ఆఫ్–క్యాంపస్ ఇంటర్న్‌షిప్స్ వంటివి ఈ లక్షణాలే. అంతర్జాతీయ విద్యా సంస్థలతో మౌలిక ఒప్పందాలు ఉన్న కాలేజీల్లో చదివిన విద్యార్థులకు విదేశీ విశ్వవిద్యాలయాలలో MS, Joint Research Programmes చేయడానికి మంచి అవకాశాలు ఉంటాయి.

మహేశ్వరం భాగ్యలక్ష్మి
9505618252

# అప్రమత్తతే కరోనాకు నిరోధం

కరోనా మహమ్మారిని వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే కంటే రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండడం అవసరం. కరోనా వ్యాధి లక్షణాలు మన దేశంలో తిరిగి చెదురుమదురుగా బయటపడుతూ కేసులు రిజిస్టర్ అవుతున్నందున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తగా గాంధీ ఆసుపత్రిలో అరవై బెడ్‌ల ఒక గదిని ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయం. హైద్రాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో వైద్యుల సమావేశం ఏర్పాటు చేసి కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కరోనా లక్షణాలు కన్పిస్తే చికిత్స చేయడానికి ఏర్పాట్ల గురించి సుదీర్ఘంగా చర్చించారు. మన దేశంలో చాపకింద నీరులా కరోనా వ్యాధి వ్యాపిస్తుంది. వేరు వేరు రాష్ట్రాలలో కరోనా లక్షణాలు బయటపడుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు కొద్దిగా నమోదైనా ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి.

**కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. రద్దీగా ఉండే ప్రాంతాలకు నిత్యావసర వస్తువులు, పెళ్ళిళ్ళు, ప్రయాణాల కోసం బస్సు డిపోలకు, రైల్వే స్టేషన్ లకు వెళ్ళాల్సి వస్తే మూతికి మాస్క్ ధరించాలి. చేతులను మాటిమాటికీ శుభ్రపరుచుకోవడం చేయాలి.

**కరోనా లక్షణాలు :**

దగ్గు, జ్వరం, తలనొప్పి, చలి, కీళ్ల నొప్పులు, కాళ్ళు చేతులు గుంజడం, వాంతులు లాంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం వహించకుండా ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకోవాలి.కరోనా టెస్ట్ చేపించి ఒక వేళ కరోనా లక్షణాలు ఏ మాత్రం ఉన్నా మిగతా వారికి సోకకుండా క్వారంటైన్ ( ఇంట్లో లేదా ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకోవడం) అవసరం.బయటి దేశాల నుండి ఎవరైనా మన దేశానికి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి వస్తే విమానాశ్రయంలో కరోనా చికిత్సలు నిర్వహించాలి. కరోనా నెగిటివ్ ఉన్నట్లు తేలిన తర్వాతనే మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళడానికి అనుమతించాలి. కరోనా రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అంటూ ప్రజలు భావించకుండా ప్రభుత్వానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటు అందించాలి. మన ప్రాంతాల్లో ముఖ్యంగా అపార్ట్మెంట్‌లలో కరోనా లక్షణాలు కన్పిస్తే వెంటనే చికిత్స తీసుకునే విధంగా వారిని అప్రమత్తం చేయాలి. వేసవి సెలవులు ముగిసి పది, పదిహేను రోజులలో పాఠశాలలు, కళాశాలలు, అన్ని విద్యా సంస్థలు ప్రారంభమవుతున్న సమయంలో కరోనా వైరస్ గురించి కేసులు బయట పడుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరోనా వలన పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలు అన్నీ మూత పడటం విద్యార్థులు ఆన్ లైన్‌లో విద్యను అభ్యసించి విద్యలో వెనుకబడిన విషయాలను తలచుకొని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్
9290826988



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎన్‌డిఎ 3.0 తొలి వార్షికోత్సవ వేళ
## రేపు కేంద్రమంత్రివర్గంలో కీలక నిర్ణయాలు!

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ తర్వాత కేంద్రమంత్రివర్గం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం మొదటిసారి సమావేశం కానున్నది. జూన్ తొమ్మిదో తేదీనాటికి నరేంద్రమోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల పరిపాలనా కాలాన్ని పూర్తిచేసుకోబోతున్నది. మూడోవిడత గెలిచిన తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్న విషయాలను జూన్ 4న మంత్రివర్గంలో ప్రధానంగా చర్చిస్తారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన కార్యకలాపాలపై కేంద్ర మంత్రివర్గానికి ఈ సమావేశంలో పూర్తి వివరాలు అందజేస్తారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి మోదీ ఆపరేషన్ సిందూర్‌తోపాటు ఇప్పటివరకూ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమం గురించి మంత్రివర్గ సహచరులతో చర్చిస్తారని భావిస్తున్నారు. గుజరాత్ సహా నాలుగు రాష్ట్రాలలో ఉప ఎన్నికల సందర్భంగా స్వరాష్ట్రంలో ఇటీవల పర్యటన సందర్భంగా మోదీ పాకిస్థాన్‌పై సాధించిన విజయాల గురించి ప్రధానంగా ప్రస్తావించారు.

# ఆరువేల మృతదేహాల స్వాధీనానికి రష్యా అంగీకారం

మృతదేహాల సేకరణకు మూడు రోజులు కాల్పుల విరమణ

ప్రతిపాదిత ఒప్పంద పత్రాల పరస్పర మార్పిడి

వారం తర్వాతే తదుపర చర్యలు ఉక్రేన్ ప్రకటన

నెలాఖరులోపు పుతిన్, జెలెన్‌స్కీ, ట్రంప్ సమావేశం?





**మాస్కో :** అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్న రష్యా–ఉక్రేన్ రెండో విడత ముఖాముఖీ చర్చలు ఇస్తాంబుల్‌లో సోమవారం సాయంత్రానికి ముగిశాయి. సరిహద్దుల్లో ఉన్న కొన్ని యుద్ధరంగ ప్రాంతాల్లో మరణించిన సైనికుల మృతదేహాలు సేకరించేందుకు రెండు లేదా మూడు రోజులు కాల్పుల విరమణకు ప్రతిపాదించినట్లు రష్యా బృందానికి నాయకత్వం వహించిన వ్లాదిమీర్ మెడిన్‌స్కీ చెప్పారు. చర్చల అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరువేలమంది సైనికుల మృతదేహాలు, వారి శరీర భాగాలను ఉక్రేన్‌కు స్వాధీనం చేసేందుకు అంగీకరించినట్లు చెప్పారు. రెండు దేశాలూ ఈ చర్చలకు సంబంధించి ప్రతిపాదిత ఒప్పంద పత్రాలను తుర్కియే విదేశాంగమంత్రి ద్వారా పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నాయని చెప్పా రు. చర్చలకు సంబంధించిన ప్రతిపాదిత ఒప్పం ద, డిమాండ్ల పత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆ తర్వాత బృందాలు స్పందిస్తాయి. పుతిన్–జెలెన్‌స్కీ మధ్య సమావేశ అవకాశాల గురించి కూడా ఈ బృందాలు చర్చించాయి. రెండో విడత చర్చల్లో గొప్ప పురోగతి లేకపోయినప్పటికీ అమెరికాతో సంబంధాలను సమస్యలు లేకుండా కొనసాగించాలని ప్రతినిధులు నిర్ణయించారు. కాగా పుతిన్–జెలెన్‌స్కీ మధ్య చర్చలు ఏర్పాటు చేసేందుకు తాము ఒక వంతెనలా కృషి చేస్తామని తుర్కియే దేశాధ్యక్షుడు రెసిప్ తయ్యప్ ఎర్డొగాన్ వ్యాఖ్యానించారని వార్తలు వెలువడ్డాయి. రెండు దేశాలవద్దా బందీలుగా ఉన్న సైనికులను మరోసారి ఇచ్చి పుచ్చుకోవాలని చర్చల్లో నిర్ణయించాయి. చాలా తీవ్రంగా గాయపడిన సైనికులు,18–25 ఏళ్ళ లోపు వయసుగల యువకులైన సైనికులు, మరణించిన సైనికుల మృతదేహాలను పరస్పరం మార్పిడి చేసుకోవాలని నిర్ణయించారు. మే 16న జరిగిన తొలి విడత చర్చల్లో కూడా ఇదే నిర్ణయం తీసుకుని మూడురోజులపాటు ఆ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ చర్చలపై ఉక్రేన్ రక్షణమంత్రి రస్టెమ్ ఉమెరోవ్ మొదట స్పందిస్తూ, రష్యా ఇచ్చిన డిమాండ్ పత్రాలను అధ్యయనం చేసి వారం రోజుల తర్వాత తదుపరి చర్యలు ప్రకటిస్తామని చెప్పారు. ఈనెలాఖరులోపు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలమధ్య సమావేశం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఐతే ఈ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను కూడా భాగస్వామిగా చేసే అవకాశాలు ఉన్నట్లు ఉక్రేన్ రక్షణమంత్రి ఉమెరోవ్ చెప్పారు. రెండు దేశాలమధ్యా జరిగే ముఖాముఖీ చర్చలను పర్యవేక్షించడానికి ఎవరో ఒకరుండాలని, ఆ ఒక్కరూ అమెరికా నాయకుడైతే బాగుంటుందన్నారు. ''యుద్ధాన్ని ముగించేందుకు నిజమైన కృషి చేయాలని, మానవతా చర్యలు తీసుకోవడానికి, నాయకులమధ్య సమావేశానికి మేం పిలుపు ఇచ్చాం, రష్యా గనుక చిత్తశుద్ధితో ఉంటే అంగీకరిస్తుంది, లేకపోతే ఇక రష్యాపై తదుపరి ఆంక్షలు అమలు జరుగుతాయి'' అని ఆయన సమావేశానంతరం చెప్పారు. ఇదిలా ఉండగా రష్యా చర్చలపట్ల చిత్తశుద్ధితో లేదని, యుద్ధాన్ని ముగించేందుకు యూరప్ ద్వారా మరిన్ని ఆంక్షలు రష్యాపై విధించేందుకు ఒత్తిడి తీసుకురావాలని ఉక్రేన్ భావిస్తున్నట్టుగా ఉందని పాశ్చాత్య మీడియా పేర్కొంది. ఒకవైపు పరస్పర కాల్పుల యుద్ధం జరుగుతుంటే మరొకవైపు రెండో విడత సంప్రదింపులు జరిగాయి. భారత కాలమానం ప్రకారం సోమవారం 3.30గంటలకు ముఖాముఖీ చర్చలు మొ దలయ్యాయి. ఉక్రేన్ తరపున రస్టెమ్ ఉమెరోవ్, రష్యా తరపున వ్లాదిమీర్ పుతిన్ సహాయకుడు మెడిన్‌స్కీ బృందాలకు నాయకత్వం వహించారు. తుర్కియే విదేశాంగమంత్రి హకన్ ఫిదాన్ చర్చలకు అధ్యక్షత వహించారు. తుర్కియే ఇంటిలిజన్స్ ఉన్నతాధికారులు కూడా చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చల్లో తుర్కియే ప్రభుత్వం మధ్యవర్తిగా ఉండబోదని రష్యా ముందుగా ప్రకటించింది. ఉక్రేన్‌లో యుద్ధం రావడానికి మూల కారణాలను పరిష్కరించాలని రష్యా దృఢ నిశ్చయంతో ఉంది. దీనినికే కేంద్రబిందువుగా చేసుకుని ఒక సుదీర్ఘమైన ఒప్పంద పత్రాన్ని చర్చల నిమిత్తం రష్యా దౌత్యాధికారులు సిద్ధం చేశారు. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధం ముగుస్తుందన్న ఆశాభావం అందరిలోని ఉంది. ఈ చర్చల ఫలితాలకోసం ప్రపంచదేశాలు ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి. మే 16వ తేదీన మొదటిసారి ఈ రెండు దేశాలమధ్య ముఖాముఖీ చర్చలు జరిగాయి. కానీ శాంతి సాధన, యుద్ధ ముగింపులో విఫలమయ్యాయి. పరస్పరం తమ వద్ద బందీలుగా ఉన్న సైనికులను మార్పిడి చేసుకోవాలని మాత్రం నిర్ణయించి ఆ మేరకు శాంతియుతంగా సైనికులను ఇచ్చిపుచ్చుకున్నారు.

### ఉక్రేన్ దాడుల్లో రష్యాకు భారీ నష్టం

ఈ సంప్రదింపులకు కొద్ది గంటలు ముందుగా రెండు దేశాలమధ్య పరస్పర సైనిక దాడులు జరిగాయి. ఒకవైపు చర్చలు కొనసాగుతున్నప్పటికీ రెండు దేశాలమధ్యా ఉన్న 1000 కి.మీ సరిహద్దు ప్రాంతం వెంట యుద్ధం జరుగుతూనే ఉంది. ఉక్రేన్ చేసిన దాడుల్లో ఆదివాకంరాడె రష్యాకు 7 బిలియన్ డాలర్లమేరకు భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా రష్యా వ్యూహాత్మక యుద్ధ విమానాలపైనే గురిపెట్టి వాటిని ధ్వంసం చేసింది. క్రూయిజ్ క్షిపణులను మోసుకెళ్ళే వ్యూహాత్మకమైన రష్యా బాంబర్లను ధ్వంసం చేసినట్లు ఉక్రేన్ సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు చెప్పారు. కాగా సోమవారంనాడు ఉక్రేన్‌కు చెందిన 162 డ్రోన్లను ఎనిమిది రష్యన్ ప్రాంతాలలో కూల్చివేసినట్లు సోమవారంనాడు రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రటించింది. అదేవిధంగా ఉక్రేన్ వైమానికదళం ఒక ప్రకటన చేస్తూ, రష్యా తమపై ప్రయోగించిన 80 డ్రోన్లలో 52 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. దాదాపు 40 రష్యా విమానాలను ధ్వంసం చేశామని ఉక్రేన్ భద్రతాదళాలు ఆదివారంనాడు ప్రకటించాయి. అదేవిధంగా రష్యా దాడుల్లో 12 మంది ఉక్రేన్ సైనికులు మరణించారు.

# ఈశాన్య రాష్ట్రాలకు వరద నిధులివ్వండి

ప్రధాని మోదీకి కాంగ్రెస్ విజ్ఞప్తి

అసోంను వరదరహితంగా మారుస్తామని ద్రోహం చేశారని విమర్శ



**న్యూఢిల్లీ :** ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు అతలాకుతలం సృష్టిస్తున్నాయి. ఈ రాష్ట్రాల్లో వరద పరిస్థితులకు సంబంధించి మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. ఆయన తన పిఎం కేర్ నిధులు గేట్లు తెరుస్తారని ఆశిస్తున్నానన్నారు. అసోంలో వరదల పరిస్థితులను ప్రస్తావిస్తూ 2016లో ప్రధాని మోదీ అసోంను వరదరహిత రాష్ట్రంలో మారుస్తానని హామీనిచ్చారని కానీ, బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసినట్లుగా కనిపిస్తోందని ఖర్గే పేర్కొన్నారు. ఈశాన్య భారతం వరదలు, కొండచరియలు, భారీ వర్షాల విధ్వంసంలో చిక్కుకుపోయాయని ఖర్గే ఎక్స్‌లో సోమవారం పోస్టు చేశారు. అసోం, అరుణాచల్, మణిపూర్, సిక్కిం, మేఘాలయ రాష్ట్రాలు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయాయని, ఇక్కడ అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షలాది మంది ప్రజలు ప్రభావితమైనట్లు తాను గమనించానన్నారు. ప్రజలకు సాయం అందించడానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 2016లో బిజెపి అసోంను వరద రహితంగా మారుస్తామని హామీ ఇచ్చిందని, 2022లో కూడా హోంమంత్రి అమిత్ షా ఈ హామీని పునరావృతం చేశారని ఖర్గే గుర్తు చేశారు. స్మార్ట్ సిటీ అని పిలవబడే గువహటి దృశ్యాలను చూస్తుంటే మోడీ జీ, అతని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అసోంను ఎలా మోసం చేశాయో గుర్తుకు వస్తుందని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజల దృష్టిని ప్రాథమిక అభివృద్ధి సమస్యల నుండి భావోద్వేగం, ధ్రువణ అంశాలకు మళ్లించారని, పరధ్యానం, మళ్లింపు బిజెపి రాజకీయాల ముఖ్య లక్షణమని కాంగ్రెస్ చీఫ్ విమర్శించారు. వరదల సంసిద్ధత కోసం మోదీ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలన్నింటికీ, ముఖ్యంగా అసోంకు మరిన్ని నిధులు విడుదల చేయాలన్నారు. బహుశా మోడీ జీ పిఎం కేర్స్ నిధి వరద ద్వారాలను తెరవవచ్చని, వాటిలో కోట్లాది రూపాయలు ఉన్నాయని, ప్రజా ఆడిట్ చేయడం లేదని ఖర్గే ప్రధానమంత్రిపై విమర్శలు గుప్పించారు. ఆశాన్య రాష్ట్రాల్లో, ముఖ్యంగా అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం సంభవించిన వార్త చాలా విచారకరమని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషాదం కారణంగా గువహటిలో పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని, జనజీవనం అస్తవ్యస్తమైందన్నారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ, సహాయ చర్యలను వేగవంతం చేయాలని, అవసరమైన వారందరికీ తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఆయన అన్నారు. సహాయక చర్యలలో సాధ్యమైనంత సహాయం అందించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరినీ గాంధీ కోరారు. ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మేఘాలయ, మణిపూర్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షపాతం తర్వాత వరద పరిస్థితి భయంకరంగా ఉంది. అసోంలో వరదల కారణంగా ఇప్పటివరకు పది మంది మరణించారు. 20కి పైగా జిల్లాల్లో నాలుగు లక్షలకు పైగా ప్రజలు ప్రభావితమయ్యారు. ఏడు ప్రధాన నదులు పొంగిపొర్లుతున్నాయి. రాష్ట్రం, పొరుగు ప్రాంతాలలో కొనసాగుతున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు, నదీ తీర ప్రాంతాలలో నివసించే ప్రజలకు పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

# జెఇఇ అడ్వాన్స్‌డ్ టాప్ ర్యాంకర్‌గా రజిత్ గుప్తా

బాలికల విభాగంలో ప్రథమ ర్యాంక్ సాధించిన దేవ్ దత్తా

54,378 మంది అర్హత సాధించిన విద్యార్థులు

ఫలితాలు విడుదల చేసిన కాన్పూర్ ఐఐటి





**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రతిష్ఠాత్మకంగా ఉన్న ఐఐటిల్లో బిటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బిఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఢిల్లీ జోన్‌కు చెందిన రజిత్ గుప్తా టాప్ ర్యాంక్ సాధించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) కాన్పూర్ మే 18వ తేదీన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహించింది. పేపర్–1, పేపర్ –2కు కలిపి మొత్తం 1,80,422 మంది పరీక్ష రాశారు. ఫలితాలను సోమవారం వెల్లడించగా, 54,378 మంది అర్హత సాధించారు. అందులో 9,404 మంది బాలికలు ఉన్నారు. కాగా కోటా నివాసి అయిన రజిత్ గుప్తా 360 మార్కులకు గానూ 332 మార్కులు సాధించి కామన్ ర్యాంక్ జాబితాలో (సిఆర్ఎల్) టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. బాలికల విభాగంలో ఐఐటి కాన్పూర్ జోన్‌కు చెందిన దేవ్‌దత్తా మాఝీ 312 మార్కులు సాధించి సిఆర్ఎల్‌లో టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. దేశ వ్యాప్తంగా ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి జెఇఇ మెయిన్ ప్రవేశ పరీక్ష, ఇది జెఇఇ అడ్వాన్స్‌డ్ అర్హత సాధించే పరీక్ష. ఈ పరీక్ష మొత్తం 116 మంది విదేశీ విద్యార్థులు కూడా హాజరయ్యారు. అందులో 13 మంది మాత్రమే అర్హత సాధించారు. టాప్ ర్యాంక్‌లు సాధించిన వంద మంది విద్యార్థుల్లో బాంబే, ఢిల్లీ జోన్‌కు చెందిన వారు 31 మంది చొప్పున ఉండగా, 23 మంది ఐఐటి హైదరాబాద్‌కు చెందిన వారు. కాన్పూర్ జోన్ నుంచి నలుగురు టాప్ 100 ర్యాంకులు సాధించి వారిలో ఉన్నారు. ఖరగ్‌పూర్ నుంచి ఐదుగురు, రూర్కీ నుంచి ఐరుగురు ఉన్నారు. సీట్ల భర్తీకి ఈసారి ఆరు విడతల జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా)2025 కౌన్సెలింగ్ జరగనుంది. ఐఐటి కాన్పుర్ ఇటీవల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జోసా–2025 వెబ్‌సైట్‌లో పెట్టింది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. జూన్ 9, 11 తేదీల్లో మాక్ సీట్ అలాట్‌మెంట్ 1, 2; జూన్ 12న ఫైనల్ ఛాయిస్ లాకింగ్ జరగనున్నాయి. అనంతరం జూన్ 14న ఒకటో విడత, 21న రెండో విడత, 28న మూడో విడత జోసా కౌన్సిలింగ్ జరగనున్నాయి. ఇక నాలుగు, ఐదు ఆరో విడద కౌన్సిలింగ్‌లు వరుసగా జులై 4, జులై 10, జులై 16 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇక ఈ ఏడాది స్వల్పంగా సీట్ల పెరిగే అవకాశం ఉంది. గత విద్యాసంవత్సరం(2024–25) 23 ఐఐటిల్లో 17,760 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈసారి మద్రాస్ ఐఐటి సహా పలు ఐఐటీల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టాయి.

# మిలిటరీ క్యాంప్‌పై విరిగిపడిన కొండచరియలు

ముగ్గురు ఆర్మీ సిబ్బంది మృతి

మరో ఆరుగురు సైనికులు గల్లంతు



**గ్యాంగ్‌టాక్ :** ఈశాన్య రాష్ట్రాల్లో వర్ష బీభత్సం ఏమాత్రం తగ్గలేదు. తాజాగా సిక్కింలోని ఛటేన్ అనే ప్రదేశంలో మిలిటరీ క్యాంప్‌పై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ముగ్గురు భద్రతా సిబ్బంది మరణించగా.. మరో ఆరుగురి ఆచూకీ గల్లంతైంది. ఈ విషయాన్ని రక్షణశాఖ అధికారులు సోమవారం ధ్రువీకరించారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో భారీ వర్షం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. ముగ్గురి మృతదేహాలను దళాలు గుర్తించాయి. మరో నలుగురు ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఇక ఆచూకీ గల్లంతైన వారిని కాపాడేందుకు సహాయక బృందాలు నిర్విరామంగా శ్రమిస్తున్నాయని అధికారులు తెలిపారు.

### ఈశాన్య భారత్‌లో రెడ్ అలర్ట్

ఈశాన్య భారత్‌లోని రాష్ట్రాల్లో నేడు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని పేర్కొంది. దీంతోపాటు ఉరుములు, పిడుగులు పడొచ్చని హెచ్చరించింది. అస్సాం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాల్యాండ్, మేఘాలయలో అతి భారీ వర్షాలు పడొచ్చని వెల్లడించింది. పశ్చిమబెంగాల్, సిక్కిం, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఇక జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు తొందరగా రావడం, బంగ్లాదేశ్, మేఘాలయాపై అల్పపీడనం ఏర్పడటం వంటి కారణాలతో ఈశాన్య రాష్ట్రాల్లో అతిభారీ వర్షాలు పడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అసోంలో ఆదివారం 7 ప్రధాన నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 20కి పైగా జిల్లాల్లో వరద జలాలతో సుమారు 4 లక్షల మంది ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గువాహటిలో శనివారం 24 గంటల్లోనే 11 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. గత 67 ఏళ్లలో మే నెలలో ఒక్క రోజులో నమోదైన అత్యధిక వర్షపాతం ఇదే కావడం గమనార్హం. ఇక త్రిపుర రాజధాని అగర్తలలో ఎడతెగని వర్షంతో ఓ వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడి చనిపోయాడు. మూడు గంటల వ్యవధిలోనే 20 సెం.మీ.ల రికార్డు వర్షపాతం నమోదైనట్లు అధికారులు ఆదివారం తెలిపారు.

# విమానాశ్రయంలో అరుదైన పాములు సీజ్

థాయ్ నుంచి సరీసృపాలు స్మగ్లింగ్



**ముంబయి :** సరీసృపాల జాతికి చెందిన అరుదైన పాములను ముంబయి ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయంలో పట్టుకున్నారు. థాయిలాండ్ నుంచి వస్తున్న ప్రయాణికుడి నుంచి వాటిని సీజ్ చేశారు. కొన్ని రోజుల క్రితమే ఇలాంటి సర్పాలను భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులోనూ సీజ్ చేశారు. కస్టమ్స్ శాఖ అధికారులు తన ఎక్స్ పోస్టులో ఆ సర్పాలకు చెందిన ఫోటోలను రిలీజ్ చేశారు. బ్యాంకాక్ నుంచి మే 31వ తేదీన వచ్చిన ప్రయాణికుడి నుంచి సరీసృపాలను సీజ్ చేశారు. అతని బ్యాగులో ఆ అరుదైన జాతికి చెందిన పాములను గుర్తించినట్లు చెప్పారు. థాయిలాండ్ నుంచి వస్తున్న ప్రయాణికుల్లో .. వారంరోజుల్లోనే ఇద్దరు వ్యక్తుల నుంచి అరుదైన పాములు స్వాధీనం చేసుకున్నారు. ఆగ్నేయాసియా, భారత విమానాశ్రయాల మధ్య స్మగ్లింగ్ నెట్వర్క్ ఉన్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ముంబయి కస్టమ్స్ అధికారులు ఆపరేషన్ చేపట్టారు. దాని ద్వారానే అరుదైన జాతులకు చెందిన ప్రాణులను పట్టుకున్నారు. వీటిల్లో స్పైడర్ టెయిల్ హార్న్‌వైపర్స్, ఏసియన్ లీఫ్‌టర్టల్స్, పిట్ వైపర్స్ ఉన్నాయి

# గాజాపై ఖతార్, ఈజిప్టు మధ్యవర్తిత్వం ఇక ఉధృతం

**గాజా :** పాలస్తీనాలో యుద్ధాన్ని నివారించేందుకు ఖతార్, ఈజిప్టు దేశాలు ఇప్పటివరకూ చేస్తున్న మధ్యవర్తిత్వ చర్యలను మరింత ఉధృతం చేయనున్నాయి. గాజాలో పరిస్థితులు విషమించడం, భీకర దాడులకు అంతూదరీ లేకపోవడంతోపాటు పాలస్తీనా ప్రజలు దాదాపు మరణం అంచులకు చేరుతూ ఉండటంతో మధ్యవర్తిత్వ చర్యలు వేగం పుంజుకుంటున్నాయి. అమెరికా చేపృసాయిదా ఒప్పందంపై హమాస్ కొత్త షరతులు విధించింది. ముందుగానే పూర్తిగా కాల్పుల విరమణ జరగాలని, అందకు ప్రతిగా 10 మంది సజీవులైన ఇజ్రాయెలీ బందీలను, మరో 18 మంది మృతదేహాను స్వాధీనం చేస్తామని హమాస్ స్పష్టం చేసింది. అందుకు అమెరికా మధ్యప్రాత్యదౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్, నేతన్యాహూ తిరస్కరించారు. ఇదిలా ఉండగా గడచిన 24 గంటల్లో గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 51 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 503 మంది గాయపడ్డారు.

# భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయ్

పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ :** ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై భారత్‌కు, అమెరికాకు మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. ఈ ఒప్పందం విషయమై ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ చర్చల్లో పాల్గొన్న సమయంలోనూ మాట్లాడుకున్నారని తెలిపారు. వాణిజ్యం విషయంలో రెండు దేశాలు కలిసి పని చేయాలనే భావనతో ఉన్నాయని గోయల్ చెప్పారు. ఈ సమస్యను ఇరుదేశాలు ద్వైపాక్షికంగా పరిష్కరించుకుంటాయన్నారు. ఇరుదేశాల మధ్య ప్రతిపాదిత, మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం ఈ వారం భారత్‌ను సందర్శించనుందని తెలిపారు. జూన్ చివరికి ఇరుదేశాల మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై అంగీకారం కుదిరే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గత నెలలో వాషింగ్టన్‌లో అధికారులతో చర్చలు జరిపారని గోయల్ తెలిపారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో అధికారిక పర్యటనలో ఉన్న గోయల్ ఆ దేశంతో వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను పెంచుకోవడానికి అక్కడి నాయకులు, వ్యాపార ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియంపై ఉన్న 25 శాతం సుంకాలను జూన్ 4 నుంచి రెట్టింపు చేస్తామని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. అయితే దీనివల్ల భారతీయ ఆటో మొబైల్‌భాగాల ఉత్పత్తుల ఎగుమతిదారులపై, ఉక్కు పరిశ్రమల రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరించారు. దాంతో అగ్రరాజ్యానికి చెందిన కొన్ని రకాల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించనున్నామన్న విషయాన్ని భారత్ ప్రపంచ వ్యాణిజ్య సంస్థ దృష్టికి తీసుకెళ్లింది. భారత స్టీల్, అల్యూమినియంపై విధించిన సుంకాలకు ప్రతిస్పందనగా అమెరికా వస్తువులకు ఇస్తున్న రాయితీలను నిలిపివేసి, దిగుమతి సుంకాలను పెంచనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ప్రపంచ వ్యాణిజ్య సంస్థ యూఎస్‌కు నోటీసులు పంపగా వాటిని అగ్రరాజ్యం తిరస్కరించింది.

# ఇంకా ప్రజల వద్ద రూ.6,181 కోట్ల రూ.2వేల నోట్లు : రిజర్వ్ బ్యాంక్



**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రూ.2000 నోట్లపై కీలక ప్రకటన చేసింది. రూ.2 వేల నోట్లు పూర్తిస్థాయిలో మాకు చేరలేదని చెప్పింది. ప్రజల వద్ద ఇంకా రూ.6,181 కోట్ల వి లువైన రూ.2000 నోట్లు ఉన్నాయని పేర్కొంది. 2023 మే 19 నాటికి చలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 98.26 శాతం తిరిగి వచ్చాయని ప్రకటించింది. రూ. 2000 నోట్లను ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో మార్చకోవచ్చని ఆర్‌బిఐ అవకాశం కల్పించింది. రూ.2 వేల నోట్లను 2023 మే 19న ఆర్‌బిఐ రద్దు చేసింది. 2023 అక్టోబర్ 7వ తేదీ వరకు బ్యాంకులో మార్చుకోడానికి, డిపాజిట్ చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2023 అక్టోబర్ 9నుంచి ఆర్‌బిఐ ఇష్యూ కార్యాలయాల్లో రూ. 2000 వేల నోట్లను మార్చుకోడానికి అవకాశం కల్పించింది. వీటిని వ్యక్తుల, సంస్థల పేరుతో నేరుగా ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత ఇండియాలో ఉన్న పోస్టాఫీసుల నుంచి నోట్లను ఆర్‌బీఐకి పంపించే వారి ఖాతాల్లో నగదు క్రెడిట్ అయ్యే అవకాశం కల్పించింది.

# ఓఖ్లాలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై జులైలో సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ:** దేశరాజధాని న్యూఢిల్లీలోని ఓఖ్లా గ్రామంలో అనధికారికంగా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేత ప్రతిపాదనకు సంబంధించిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు వచ్చేనెలలో విచారణ జరుపుతుంది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేస్తుంది. ఓఖ్లా గ్రామంలో చట్ట నిబంధనలకు అనుగుణంగా అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని ఢిల్లీడవలప్‌మెంట్ అథారిటీకి సుప్రీంకోర్టు గతనెల ఏడో తేదీన ఆదేశించింది. ఈ ఆదేశాలపై పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే సుప్రీంకోర్టుకు హాజరై విజ్ఞప్తి చేశారు. ''మేం ఇచ్చిన ఉత్తర్వుల గురించి మాకు తెలుసు, మేం ఇక ఏమీ చెప్పదలచుకోలేదు, మేం తగిన ఉత్తర్వులు జారీ చేయమంటారా?లేక జులైలో జారీ చేయమంటారా? ఈ విషయం మీకే వదిలేశాం అని ధర్మాసనం ప్రశ్నించింది. జులైలో ఇచ్చిన ఉత్తర్వులు ఇప్పుడు ఇచ్చినా పెద్ద తేడా ఏమీ ఉండదని హెగ్డే పేర్కొన్నారు. ఈ కేసు మరోసారి విచారణకు వచ్చిన తర్వాత కోర్టు ఈ కేసును జులైకి వాయిదా వేసినట్లు హెగ్డే చెప్పారు. ఢిల్లీలో ప్రభుత్వ ప్రాంతాలలో, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు జరగడంపై 2018లో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారన్న పిటిషన్‌పై ధర్మాసనం తర్వాత విచారణ జరిపింది. అక్రమనిర్మాణాలలో ఉన్నవారంతా ఖాళీ చేయాలని డిడిఎ ఇటీవల నోటీసులు జారీ చేసింది.

# దోషికి 30 ఏళ్ల జైలు శిక్ష

అన్నా యూనివర్సిటీ లైంగిక దాడి కేసులో సంచలన తీర్పు

**చెన్నై :** గతేడాది తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన దేశ వ్యాప్తంగా సంచలన రేపిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దోషిగా తేలిన జ్ఞానశేఖరన్‌కు శిక్ష ఖరారు చేసింది. దోషికి 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జస్టిస్ రాజలక్ష్మి తీర్పు వెలువరించారు. శిక్షతోపాటు రూ.90,000 జరిమానా కూడా విధించారు. కాగా, గత వారం ఈ కేసును విచారించిన చెన్నైలోని మహిళా కోర్టు జ్ఞానశేఖరన్‌ను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. చార్జిషీట్‌లో పేర్కొన్న మొత్తం 11 అభియోగాల్లో అతడు దోషిగా తేలాడు.ఈ కేసు విచారణ సందర్భంగా మహిళా కోర్టు జడ్జి రాజలక్ష్మి మాట్లాడుతూ.. అన్ని అభియోగాల్లో దోషిగా తేలినందున జ్ఞానశేఖరన్‌కు కచ్చితంగా తీవ్రమైన శిక్షపడాలని అన్నారు. అయితే జ్ఞానశేఖరన్ మాత్రం తనకు తక్కువ శిక్ష విధించాలని కోర్టును కోరాడు. తాను వృద్ధురాలైన తన తల్లితోపాటు, ఎనిమిదేళ్ల కుమార్తె బాగోగులు చూసుకోవాల్సి ఉందని, కాబట్టి తనకు తక్కువ శిక్ష విధించాలని అభ్యర్థించాడు. అన్నా యూనివర్సిటీ పరిసరాల్లో బిర్యానీ పాయింట్ నడుపుతున్న జ్ఞానశేఖరన్ గత ఏడాది డిసెంబర్‌లో 19 ఏళ్ల విద్యార్థినిపై క్యాంపస్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. వర్సిటీలో సెకండియర్ చదువుతున్న విద్యార్థినిపై గతేడాది డిసెంబర్ 23న ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి క్యాంపస్ వెనుకవైపు ఏకాంతంగా ఉన్న సమయంలో నిందితుడు అక్కడికి వెళ్లి వారిని వీడియో తీశాడు. బాధితురాలి స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ఆ ఘటనను తన మొబైల్‌లో రికార్డు చేశాడు. విషయం బయటకుచెబితే వీడియో బయటపెడుతానని బ్లాక్‌మెయిల్ చేశాడు. అయినా బాధితురాలు భయపడకుండా తన స్నేహితుడితో కలిసి ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు అప్పట్లో సంచలనంగా మారింది. రాజకీయంగా కూడా తీవ్ర దుమారం రేపింది. ప్రభుత్వం మహిళల రక్షణలో విఫలమైందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే పోలీసులు ఘటనపై విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేశారు. జ్ఞానశేఖరన్‌పై మొత్తం 11 అభియోగాలు మోపారు. అన్ని అభియోగాల్లోనూ అతడిని దోషిగా తేల్చిన మహిళా కోర్టు.. ఇవాళ శిక్ష ఖరారు చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పోలీసులకు ఎంపి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తెగులు స్క్రైబ్ అనే ట్విట్టర్ పేజీ తనపై తప్పుడు ప్రచారం చేస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మిస్ వరల్డ్ పోటీలపై ఆరో పణలు చేస్తూ ఓ కంటెస్టెంట్ తప్పుకున్న సంగతి తెలిసిందే. ఆ కంటెస్టెంట్ తప్పుకోవడానికి ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మరో కాంగ్రెస్ నేత కారణం అంటూ తెలుగు స్క్రైబ్ ట్విట్టర్ పేజీలో ప్రచారం చేశారు. ఆ తరవాత చాలా యూట్యూబ్ ఛానల్స్ ఇద్దరి పేర్లను ప్రచారం చేశాయి. ఇప్పటికే తెలుగు స్క్రైబ్ అడ్మిన్ను అదుపులోకి తీసుకోగా అది బీఆర్ఎస్ వాళ్లది అని తనకు సంబంధం లేదని చెప్పారు.

## జలమండలిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలిలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు ఎం.డి. అశోక్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జలమండలి అధికారులు, ఉద్యోగులు, వినియోగదారులకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈ.డి. మయాంక్ మిట్టల్, ఆపరేషన్స్ డైరెక్టర్లు వి.ఎల్. ప్రవీణ్ కుమార్, అమరేందర్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్లు సుదర్శన్ శ్రీధర్, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సిజిఎంలు, జిఎంలు పాల్గొన్నారు.

### మెట్రో రైల్ భవన్‌లో ..



హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్), హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్ రెడ్డి బేగంపేట్‌లోని మెట్రో రైల్ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, వారి కృషికి ఆయన నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తోందని, దేశంలో నెంబర్ వన్ నగరంగా హైదరాబాద్ నిలిచిందని ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి, రాష్ట్ర పురోగతిలో మెట్రో రైల్ పాత్రను కీలకమైనదన్నారు. రాష్ట్రాన్ని గొప్ప ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో మెట్రో రైల్ కూడా కీలకభాగస్వామ్యమన్నారు.

### జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో..



జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్, కార్యదర్శి సత్యనారాయణ, అదనపు కమిషనర్లు స్నేహ శబరిష్, రఘు ప్రసాద్, వేణుగోపాల్, సుభద్ర దేవి, నళిని పద్మావతి, గీతా రాధిక, యాదగిరి రావు, అశోక్ సామ్రాట్, చీఫ్ సిటీప్లానర్ కె. శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, గంగాధర్, వెంకన్న, ఈవిడిఎం అదనపు ఎస్.పి శ్రీనివాస్, ఏసిపి సుదర్శన్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, జాయింట్ కమిషనర్(రెవెన్యూ) మహేష్ కులకర్ణి, చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఓఎస్‌డి అనురాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య, ఎంటమలాజి కార్మికులకు పిపి కిట్‌లు అందచేశారు.

### టిడిపి కార్యాలయంలో



వందల మంది విద్యార్థుల బలిదానంతో, ఆత్మార్పణతో తెలంగాణ ఏర్పడి, దశాబ్దకాలం దాటుతున్నా పదేళ్లు పాలించిన బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలు ఘోరంగా మోసం చేశాయని టిడిపి సికింద్రాబాద్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల ముఖ్య ఉద్దేశంగా ఏర్పడిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు అమలు కాలేదన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజు గౌడ్ పాల్గొన్నారు.

### హెచ్ఎండిఏ కార్యాలయంలో



అమీర్‌పేట్‌లోని హెచ్ఎండిఏ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. నూతన మాస్టర్‌ప్లాన్‌తో ఓఆర్ఆర్ పరిధిలో దిశదశ మారిపోతుందని సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. సమిష్టి కృషితోనే ప్రపంచ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, డైరెక్టర్ ప్లానింగ్ విద్యాధర్, చీఫ్ ఇంజనీర్లు పరంజ్యోతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### భవిష్యత్తు తరాలకు పర్యావరణాన్ని కాపాడడం



కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిజిపిసిబి ప్రధాన కార్యాలయం సనత్‌నగర్‌లో సభ్య కార్యదర్శి జి. రవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది యువకులు చేసిన పోరాటంలో త్యాగం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఎనలేని ప్రాముఖ్యత ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బోర్డులోని ఉద్యోగులందరూ పర్యావరణ పరిరక్షణకు గణనీయమైన సహకారాన్ని అందించారని కొనియాడారు.

## రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, లక్ష్యాలకు అనుగుణంగా అందరం కలసి పని చేయాలని హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ అన్నారు. హైడ్రా కార్యాలయం ముందు జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో రంగనాథ్ మాట్లాడారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను పరిరక్షించడంతో పాటు, ప్రకృతి వైపరీత్యాలలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలకు అండగా ఉండేలా పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందన్నారు. ఆ దిశగా అందరూ కలసి పనిచేయాలని రంగనాథ్ అన్నారు.

# ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన పార్టీ సిపిఐ ఒక్కటే

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు గడిచినా పేదల బతుకుల్లో చీకట్లే

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్.కె.నారాయణ



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రాష్ట్రాన్ని కొల్లగొట్టి అప్పుల ఊబిలోకి నెట్టింది మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎంపి, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యిద్ అజీజ్ పాషాలు అన్నారు.
రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్, ఎస్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో 1వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి డా. కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యిద్ అజీజ్ పాషాలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ బహిరంగ సభకు భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.గోపాల్ అధ్యక్షత వహించగా ఇస్కఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రభాకర్ రావు,ప్రముఖ సంఘ సేవకులు ఎం.బిక్షపతిగౌడ్, మురళి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ఫైమీద, యువజన నాయకులూ ఎండి.మహబూబ్, ప్రముఖ న్యాయవాదులు కె.శ్రీనివాస్, కె.విజయలక్ష్మి, ఇస్కఫ్ నేతలు రజిత, చందు, శ్వేతా, స్వాతి, రఫియా తదితరులు వేదికపై ఆసీనులైనారు. డా.కె.నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఒక్కటే అని చెప్పారు.
తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు గడిచిన పేదల బతుకుల్లో చీకట్లే మిగిలాయని, కెసిఆర్ తన స్వార్థ ప్రయోజనాల కోసమే తెలంగాణను వాడుకున్నాడు తెలిపారు. ఆంధ్రావాడిగా ఉండి తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసి ఆంధ్రకు ద్రోహం చేస్తావా అని తిరుపతిలో ఆ నాడు అక్కడి వారు నా దిష్టి బొమ్మను కూడా దగ్ధం చేశారని, నన్ను తగలపెట్టిన సిపిఐ ఒకే మాటమీద ఉంటుందని చెప్పానని నారాయణ గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ వెంట కలసి నడిచిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐని, జెఎసి చైర్మన్ కోదండరాంలను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే వారిని పక్కన పెట్టిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన స్వార్థం కోసం తెలంగాణకు బద్ధ వ్యతరేకులైన 12 మందికి మంత్రి పదవులు కట్టబెట్టారన్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్రంగా ధ్వజమెత్తారు. సనాతన ధర్మాన్ని విమర్శించే వారిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జైల్లో పెట్టాలంటున్నాడని, సనాతన ధర్మాన్ని సమర్ధించే పవన్ కళ్యాణ్‌ను కూడా జైల్లో పెట్టాలని నారాయణ డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ వాక్యాలు గురిగింజ కింద ఉన్న నలుపు ఎరగని తరహాలో ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఎద్దేవా చేశారు. ముందు పవన్ కళ్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై శ్రద్ధపెట్టాలని డా.కె.నారాయణ హితవు పలికారు. అనంతరం మాజీ ఎంపి సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో సాగిన తెలంగాణ ఉద్యమం, రాష్ట్రాన్ని సాధించుకున్న తరువాత వీటిని ఆసరాగా తీసుకొని కెసిఆర్ ధనిక రాష్ట్రాన్ని కొల్లగొట్టి అప్పుల ఊబిలోకి నెట్టివేసాడని విమర్శించారు. దీంతో కెసిఆర్‌కు తగిన బుద్ధి చెప్పి ప్రజలు కాంగ్రెస్ అధికారాన్ని అప్పగించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం అప్పుల్లో ఉందంటూ ఇచ్చిన హామీలని దాటవేయాలని చూస్తుందని. ఇది సరికాదని తెలిపారు. ఇచ్చిన సంక్షేమ హామీలను అమలు చేయడంతోపాటు,రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి చెర్యలు తీసుకోవాలని సూచించారు.ఆపరేషన్ సిందూరను భారత సాయుధ దళాలు విజయవంతంగా నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఆ సమయంలో దేశంలోని అన్నివర్గాలు, మతాల ప్రజలు ఏకతాటిపై నిలబడడంతో సైన్యానికి కొండంత బలాన్నిచ్చిందన్నారు.ఇప్పుడు మళ్ళీ హిందూ, ముస్లిం అని దేశప్రజలను విడదీయడం దురదృష్టకరం అని సయ్యిద్ అజీజ్ పాషా పేర్కొన్నారు.

# రాష్ట్రంలో 80ఎకరాల్లో 'ఎకో టౌన్'

జపాన్ 'కితాక్యూషూ సిటీ' స్ఫూర్తితో అభివృద్ధి

ఏడాదిన్నరలో తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా జపాన్‌లోని 'కితాక్యూషూ సిటీ' స్ఫూర్తితో రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్ ను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. తెలంగాణ, కితాక్యూషూ నగరం మధ్య కుదిరిన పరస్పర సహకార ఒప్పందం ఇందుకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సోమవారం టీహబ్ లో 'ఫ్రం కితాక్యూషూ టూ తెలంగాణ కేటలైసింగ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ గ్రోత్' అనే అంశంపై సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'తెలంగాణ రైజింగ్ 2047' అనే లక్ష్యంతో అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా మార్చాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి సుమారు రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు మా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్ లాంటి అనేక అంతర్జాతీయ స్థాయి కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జపాన్ కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టేలా ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటికే తెలంగాణకు చెందిన 50 మంది యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు లభించాయని, మరింత మందికి దక్కేలా టాంకాం లాంటి ప్రభుత్వ సంస్థల ద్వారా జపనీస్ భాషను నేర్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో నెట్ జీరో లక్ష్యాలు, రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్, సర్క్యులర్ ఎకానమీ, క్లీన్ టెక్నాలజీస్, డిజిటల్ ఇన్నోవేషన్ తదితర అంశాల్లో కితాక్యూషూ నగరంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా తీర్చి దిద్దేందుకు ఇండస్ట్రియల్ జోన్స్ ఏర్పాటు, జీరో వేస్ట్ డిజైన్, అత్యాధునిక వాటర్ అండ్ వేస్ట్ మేనేజ్మెంట్ పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. తెలంగాణ, కితాక్యూషూ నగరం మధ్య సత్సంబంధాలు మరింత పెరిగేలా హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సర్వీసులను నడిపేందుకు గల సాధ్య సాధ్యాలపై అధ్యయనం చేయిస్తామన్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా జపాన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ అద్లూరి లక్ష్మణ్, కితాక్యూషూ నగర మేయర్ కజహిసా టకేచీ, టిజిఐఐసి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, టిజిఐఐసి సిఇఇ మధుసూదన్, రాష్ట్ర ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ సెల్ డైరెక్టర్ అవినాష్, సిఐఐ తెలంగాణ ఛైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిఘా వర్గాలు ఏం చేశాయి?

ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి ..26 మందిని కాల్చేంత వరకు

కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి పహల్గాంలో 26 మంది భారతీయ టూరిస్టులను కాల్చి చంపే వరకు నిఘా వర్గాలు పనిగట్టకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి పేర్కొన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని మోదీ...రాహుల్ గాంధీ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత లేదన్నాని జగ్గారెడ్డి అన్నారు. కాశ్మీర్ లోకి ఉగ్రవాదులు వచ్చి 26 మందిని కాల్చేంత వరకు కేంద్ర ఇంటలిజెన్స్ ఏం చేసిందో ప్రధాని, కేంద్ర మంత్రులు ముందుగా ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మోది దేశానికి ఇప్పటి వరకు ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు. మీరు నిద్రావస్థలో ఉండి...రాహుల్ గాంధీ పై విమర్శలు చేస్తూ...డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. పహల్గాం ఘటన వైఫల్యాలపై సమాధానం చెప్పకుండా మాట్లాడితే ప్రతిఘటిస్తాం అని తీవ్రంగా హెచ్చరించారు.యుద్ధం జరుగుతుంటే... పాకిస్తాన్ ను మోది ఓడిస్తారని దేశ ప్రజలు ఆశగా చూశారని, అయితే అర్ధాంతరంగా యుద్ధాన్నికి బ్రేక్‌లు వేయడం విడ్డూరంగా ఉందన్నారు.యుద్ధంపై మోది బదులుగా ట్రంప్‌తో ప్రకటన ఇప్పించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. దేశ ప్రజలకు యుద్ధం ఆగినట్టు మోడీ చెప్పాల్సింది ...ట్రంప్ చెప్పినందుకు మీకు సిగ్గు అనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. కాంప్రమైజ్ మీరు అయ్యి...మా నాయకుడిని నిందిస్తారా..? అని నిలదీశారు. ఇందిరా గాంధీ హయంలో అమెరికా జోక్యం చేసుకునే ప్రయత్నం చేసినా.. ఎవరి జోక్యం అవసరం లేదు అని చెప్పింది అని గుర్తు చేశారు.ప్రధాని మోడీ.. వాజ్‌పాయ్ బర్త్ డే రోజు దేశంలో లేకుండా పాకిస్తాన్ వెళ్లలేదా..? అని అడిగారు. అదే రోజు పాకిస్థాన్ ప్రధాని నవాజ్‌షరీఫ్ ఇంటికి వెళ్ళి..నవాజ్‌షరీఫ్ తల్లి కాళ్ళు మొక్కలేదా..? అని నిలదీశారు.వీటిపై దేశ ప్రజలకు మోది వీటికి సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. 26 మందిని చంపిన ఉగ్రవాదులు ఎక్కడో తెలుసుకోలేదు.. సిగ్గు అనిపించడం లేదా కిషన్ రెడ్డి అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. బిజెపి వాళ్లు చేసే ర్యాలీ లు ఎందుకో ట్రంప్ కే తెలియాలి అని అన్నారు.

## బిజెపి వదిలిన బాణం కవిత... బతుకమ్మ పేరుతో బతుక నేర్చింది

కెసిఆర్ తెలంగాణ పిత కాదు పిశాచి

కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఎంఎల్‌సి కవిత బిజెపి వదిలిన బాణమని, బతుకమ్మ పేరుతో బతుకు నేర్చారని మాజీ ఎంపి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బిజెపి డైరెక్షన్ మేరకే కవిత పనిచేస్తున్నారని, ఇక్కడ బిఆర్ఎస్ వీక్ అయితే బిజెపి బలపడుతుందని అన్నారు. అదే కోణంలో లేఖ అంశం తెరమీదకు తెచ్చారని చెప్పారు. కవిత ఎంపిగా ఉన్నప్పుడు మోదీతో సెల్ఫీలు దిగారని గుర్తు చేశారు. బిజెపి వ్యూహ రచనలో భాగంగానే కవిత ఇలా మాట్లా డుతున్నారని అన్నారు. జాగృతి పేరుతో దోచుకున్న సొమ్మును దాచుకోవడానికే జాగృతి బలోపేతం చేస్తానని అంటున్నారన్నారు. కెసిఆర్ జాతి పిత కాదని, తెలంగాణకు పట్టిన పిశాచి అని మధుయాష్కీగౌడ్ విమర్శించారు. కవితను చేర్చుకునేంత దరిద్రం కాంగ్రెస్ పార్టీకి పట్టలేదని అన్నారు. ఆమె నిజామాబాద్ జిల్లాల్లో జిఎస్‌టి స్కామ్‌లకు పాల్పడ్డారని, రూ. 800 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే డ్రామా ఆడుతున్నారని అన్నారు. జాగృతి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ట్రైనింగ్ ఇవ్వకుండానే నిధులు దోచేశారని, జాగృతి ఓ అవినీతి సంస్థ అని అన్నారు. కవిత చిన్న లేడీ మాఫియా డాన్ అని ఆరోపించారు. ఆమె చేయని వ్యాపారాలు లేవని, చేయని స్కామ్‌లు లేవని అన్నారు. బ్యూటీ పార్లర్ నడుపుతున్న కవితకు బంజారా హిల్స్‌లో రూ.2 వేల కోట్ల విలువ చేసే ఆస్తులున్నాయని, అవి ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకపోతే కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు మొజాంజాహీ మార్కెట్‌లో పూలు అమ్ముకునేవారన్నారు. కవిత తెలంగాణతో పాటు ఎపిలో బ్యూటీ పార్లర్ పెట్టుకునే వారనిఅన్నారు.

## నిజాన్ని నిర్భయంగా చెప్పేవాడే నిజమైన కవి : కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కవులు ఏ పాలకుల ముందు కూడా తలవంచకూడదని, పాలనలో లోపాలను ఎత్తి చూపాల్సిందేనని, నిజాన్ని నిర్భయంగా చెప్పేవాడే నిజమైన కవి అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోమవారం నిర్వహించిన 'యువ కెరటాలు' కవి సమ్మేళన కార్యక్రమంలో కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ చిన్న పిల్లలు బతుకమ్మ పాటలు నేర్చుకుంటే బతుకమ్మ వందేళ్లు బతికి ఉంటదని, యువ కవులు కవితలు రాస్తే తెలంగాణ సాహిత్యం వందేళ్లు బతికి ఉంటుందని తెలిపారు. సాహిత్యం, సంస్కృతి వర్ధిల్లినరోజే నేల బాగుంటుందన్నారు. తెలంగాణ బిడ్డలకు ధిక్కారం ఎలా ఉంటుందో, మమకారం అంతే ఉంటుందని చెప్పారు. తెలంగాణ ఉద్యమ కాలంలో యువత ఆత్మ బలిదానాలను కవులు తమ కవితల ద్వారాచెప్పేవారని, భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం మన నీళ్లు, వనరుల రక్షణ కోసం కూడా కవిత్వం రావాలని సూచించారు.

**చిన్న కాంట్రాక్టర్లకు అన్యాయం జరిగితే సహించం**

జిహెచ్ఎంసిలో మాన్సూన్ ఎమర్జెన్సీ వాహనాల టెండర్‌లలో ఎప్పుడు పాల్గొనే చిన్న స్థాయి కాంట్రాక్టర్లకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఎంఎల్‌సి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. టెండర్‌లలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఆదివారం కవిత సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన విషయం తెల్సిందే. టెండర్‌లను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు కాంట్రాక్టర్లు సోమవారం కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో చిన్న స్థాయి కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన మద్ధతు ఇస్తామని కవిత చెప్పినట్లు కాంట్రాక్టర్ సాయి కిరణ్ తెలిపారు.

# అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

ప్రజల సమస్యలపై చర్చించేందుకు సభ్యులకు అవకాశం కల్పించాలి

బిజెపి కార్పొరేటర్లు శ్రవణ్, మహేందర్, ఆకుల శ్రీవాణి, బండారు శ్రీవాణి, దర్శన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా సమస్యల పరిష్కారం చొరవ చూపకుండా నగర మేయర్ విజయలక్ష్మి అప్రజాస్వామికంగా వ్యహరిస్తున్నారని బిజెపి కార్పొరేటర్లు శ్రవణ్, మహేందర్, ఆకుల శ్రీవాణి, బండారు శ్రీవాణి, దర్శన్‌లు విమర్శించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ మేయర్ నిర్లక్ష్యం, వివక్ష, అప్రజాస్వామిక వైఖరిని ఖండిస్తున్నమన్నారు. నగరం ఒక వైపు సమస్యల ఊబిలో కొట్టుమిట్టాడుతుంటే మరో వైపు ఏమి పట్టనట్లు నగర మేయర్ వ్యవహారిస్తున్నారని అన్నారు. కుమ్మకు రాజకీయాలతో వ్యవహారాన్ని నడిపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో పట్టుమని పది గంటలు కూడా పాలకమండలి సమావేశం నిర్వహించలేదని, ప్రజా సమస్యలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోవడంలో మేయర్ పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. అన్ని పార్టీలలోని ఒక సామజిక వర్గాన్ని తన చెప్పు చేతల్లో ఉంచుకొని, ప్రతిసారి ఏదో ఒక గొడవ వారితో సృష్టించి, సభను అర్ధాంతారంగా వాయిదా వేస్తున్నారని తెలిపారు.
లక్షలాది రూపాయాల ప్రజా ధనంలో నిర్వహిస్తున్న పాలకమండలి సమావేశాలు వృధగా సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాట వినని అధికారులపై ప్రశ్నలకు అనుమతిస్తూ, తన చెప్పు చేతుల్లో ఉండే అధికారులను వెనుకేసుకోస్తున్నారని ఆరోపించారు. సి.ఎన్. రెడ్డి అనే కార్పొరేటర్ తనతో పార్టీలు మారుతున్నందుకు ప్రతిగా అతనికి ప్రతి సమావేశంలో మాట్లాడే అవకాశం కల్పిస్తున్నారని, స్థాయిసంఘం సభ్యునిగా కూడా అవకాశం కల్పించారన్నారు. తమ పార్టీకి చెందిన బిసి సమాజిక వర్గానికి చెందిన శంకర్ యాదవ్‌కు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. తాము ప్రజల సమస్యలపై ఎన్ని ప్రశ్నలు అడిగిన వాటిని పాలకమండలి సమావేశానికి ఎంపిక చేయడం లేదన్నారు.
తమకు సభలో మాట్లాడే అవకాశం రాకుండా మేయర్ అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన మేయర్ వివక్షను పక్కను పక్కన పెట్టి, బుధవారం జరిగే సమావేశాన్ని ప్రజాస్వామ్య యుతంగా నడిపించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో మేయర్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామని, ప్రజలకు మేయర్ నిర్లక్ష్య వైఖరిని వివరిస్తామని తెలిపారు.

## నీట్ పిజి పరీక్ష వాయిదా

**న్యూఢిల్లీ :** నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ (నీట్ పిజి)ని వాయిదా వేస్తున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15న పరీక్ష నిర్వహించనుండగా.. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పరీక్షను రద్దు చేసింది. త్వరలోనే మళ్లీ నీట్ పరీక్ష తేదీని ప్రకటించనునట్లు వెల్లడించింది. ఇటీవల సుప్రీంకోర్టు విద్యార్థులకు సమాన అవకాశాలను కల్పించడంతో పాటు, పరీక్ష ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ఒకే షిఫ్ట్‌లో పరీక్షలను నిర్వహించాలని ఆదేశించింది. పరీక్ష నిర్వహణ కోసం కేంద్రాలు, సమయం సరిపోదంటూ ఎన్‌బిఇ చేసిన వాదనలు సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎన్‌బిఇ నీట్‌ని రద్దు చేసింది. పరీక్ష కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉన్నందున పరీక్షలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. నీట్ పిజి వైద్య విద్యలో ఎండి, ఎంఎస్, పిజి డిప్లొమా కోర్సుల్లో చేరడానికి నిర్వహించే పరీక్ష. నీట్ ద్వారానే దేశవ్యాప్తంగా అనేక వైద్య కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను భర్తీ చేయనున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షను ఎన్‌బిఇ నిర్వహిస్తూ వస్తున్నది.
2024లో నీట్ పిజి రెండు షిఫ్టుల్లో నిర్వహించారు. ఈ రెండు షిఫ్ట్‌లలో వేర్వేరు ప్రశ్నపత్రాలు ఉండడంతో ఒక షిఫ్ట్‌లోని ప్రశ్నలు సులభంగా, మరొక షిఫ్ట్‌లోని ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాలని ఆదేశించింది.

## నాలాల కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలాల కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదులు రావడం ప్రారంభమయ్యాయి. సోమవారం హైడ్రా ప్రజావాణికి 23 ఫిర్యాదులందాయి. ఇందులో 70 శాతం నాలాల సమస్యలపైన ఫిర్యాదులు వచ్చాయి. మిగతావి ఎప్పటిలాగే రహదారులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల పైన ఉన్నాయి. సికింద్రాబాద్, తిరుమలగిరి, భూదేవినగర్‌లోని సాయిదత్తా గార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉద్దేశించిన 225 గజాల స్థలం కబ్జా అయ్యిందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2004లోనే జిహెచ్‌ఎంసికి ఆ స్థలాన్ని ఇచ్చి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరినా, ఫలితం లేకపోయిందని వాపోయారు. శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్ విలేజ్‌లో 11/20, 11/21 సర్వే నెంబర్లలో 1983లో గురుకుల ట్రస్ట్ లేఔట్ ఏర్పాటు చేశారు. అందులోని ప్లాట్లతో పాటు రహదారులు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఫిర్యాదుచేశారు. వర్షాకాలం కావడంతో నాలాల కబ్జాల ఫిర్యాదులపై ఎక్కువ దృష్టి పెట్టినా, ఎప్పటిలాగే కొన్ని సాధారణ ఫిర్యాదులను హైడ్రా అదనపు సంచాలకులు వి. పాపయ్య స్వీకరించారు.

## ప్రజాసేవలో నిరంతరం..

ప్రజాపక్షం/నారాయణపేట్ : జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ జాతీయ జండాను ఆవిష్కరించారు.పోలీస్ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ. తెలంగాణ ఎన్నో పోరాటాల ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాడడం జరిగింది. అడిషనల్ ఎస్పీలు యం.డి. రియాజ్ హూల్ హక్,సిఐ లు శివ శంకర్, సీఐ రమ్ లాల్, రాజేందర్ రెడ్డి, ఆర్.ఐ నరసింహ, ఎస్‌లు వెంకటేశ్వర్లు, శివ శంకర్, రమేష్,సునీత, డిపిఓ, ఎస్,బి, ఐటీ కోర్, డిసిఆర్‌బి స్టాఫ్, పోలీసు సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.



## బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి

ప్రజాపక్షం/ నారాయణపేట్ : రానున్న విద్యా సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట లో సోమారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. భీష్మరాజ్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్II కె. రాజ్ కుమార్ రెడ్డి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. శాసనపల్లి రోడ్డు, నారాయణపేట్ పురవీధుల్లో తిరుగుతూ బడిడు పిల్లలను బడుల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకోకుండా వ్యాపారస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని బడుల్లో చేర్పించాలని కోరారు. ఈ అవగాహన ర్యాలీకి ప్రజల నుండి విశేషస్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, బాలాజీ, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహనాయుడు, రుద్రారెడ్డి, ఎం. సంతోష్, శివరాజ్, వై. సంతోష్, మన్నె గోపాల్, నందుకుమార్, నాగురావు, అశోక్, శ్రీనివాస్, వెంకటరావు, నర్సింహులు, హరికృష్ణ ప్రభూజీ, కరాటే మాస్టర్లు తిమ్మప్ప, అశోక్, అధిక సంఖ్యలో కరాటే విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం అవరణలో ముఖ్యనాయకుల తో కలిసి బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు గొడుగు నర్సిములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లో అధిక భాగం అనర్హులకే అవకాశం కల్పించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కమిటీ పర్యవేక్షణలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తించేలా చూడాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలో అగ్ర భాగం అనర్హులే ఉన్నారని, అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హులకే పథకాలు అందేలా చూడాలన్నారు. నిరుపేదలకు సహకరించాలన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్, గోపాల్, మండల కార్యదర్శి రఘు, మండల సహాయ కార్యదర్శి, చెన్నయ్య, మండల ప్రచార కార్యదర్శి రాములు, టౌన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాగనూరులో ఇళ్లకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ మాగనూర్ : మాగనూరు మండలం కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన నూతన ఇందిరమ్మ నిర్మాణ పనులకు భూమి పూజ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నిర్వహించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వద్ద సింగల్ టీ తాగకుండా స్వచ్ఛందంగా మేము మా అనుచర కాంగ్రెస్ వర్గం పనిచేస్తుందని అన్నారు. గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం ఏ ఒక్క డబుల్ బెడ్ రూమ్ కానీ మక్తల్ నియోజకవర్గంలో నిర్మించలేదని ఈ 18 నెలల్లో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని అందులో భాగంగానే నేడు మాగనూరు మంవడల కేంద్రంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజను నిర్వహించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశామన్నారు. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, శివరాం రెడ్డి, ముష్టి లక్ష్మన్న, వాకిటి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు అభిమానులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రవీందర్‌గౌడ్‌కు ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/నారాయణపేట్: బ్రెయిన్ స్ట్రోక్ కు గురై అనారోగ్యంతో బాధపడుతున్న కోయిలకొవడ మండలం పారుపల్లి గ్రామానికి చెందిన రాంపూర్ రవీందర్ గౌడ్ వైద్యానికి గాను,రూ.25 వేల చెక్కును సోమవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి. ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ కు గురై అనారోగ్యంతో బాధపడుతున్న రాంపూర్ రవీందర్ గౌడ్ తన వైద్యానికి సహాయం చేయాలని గతంలో కోరారని, రవీందర్ గౌడ్ వైద్యానికి రూ.25 వేలను అందజేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేస్తునే ఉన్నామని పేర్కొన్నారు. రాజ్ కుమార్ రెడ్డి వెంట ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, రవీందర్ గౌడ్ కుటుంబ సభ్యులు, గీత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్ విజన్‌తో ప్రభుత్వం మున్ముందుకు..

### రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధిఃతెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతొందనిరాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, సమగ్రపాలసీల రూపకల్పన, ప్రపంచస్థాయి ఇన్ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జిపాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను ప్రభుత్వం సిద్ధం చేశారు. ఈ విజన్ డాక్యుమెంట్ భవిష్యత్తు తెలంగాణకు ఒక భగవద్గీత, ఇది తెలంగాణ రూపురేఖలనే మార్చేస్తుంది.మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది. 3 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి, ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు సృష్టిస్తున్నాం. రాష్ట్రంలో నిరుపేదలకు నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం. రాష్ట్రంలో 4 లక్షల 50వేలఇందిరమ్మ ఇల్లు నిర్మాణ లక్ష్యం. రాష్ట్రంలో ఇప్పటికే గృహనిర్మాణాల ప్రారంభించారు. నిర్మాణ దశలను బట్టి లబ్దిదారుల ఖాతాలలో నగదుజమ చేశారు. జిల్లాలో జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలం పెద్దాయిపల్లిలో దేవరకద్ర నియోజకవర్గం సిసికుంట మండలం, దమగ్నపూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగింది. ప్రభుత్వం ఇటీవల మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ మంజూరు చేయడం జరిగింది. ఆర్జీయూకేటీ క్రింద ఐఐఐటి మన మహబూబ్‌నగర్‌జిల్లాకు మంజూరు అయింది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పి డి.జానకి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితారెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, ఎల్‌డిఎం వైద్యం భాస్కర్ తదితరులు ఉన్నారు.



### చెక్కులు పంపిణీ

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు 130 మహిళా సంఘాలకు బ్యాంకు లికేజీ కింద 10 కోట్ల రుణ మంజూరు చెక్కును పంపిణీ చేశారు. స్త్రీనిధిద్వారా 212మంది మహి ళా సంఘాల సభ్యులైన లబ్దిదారులకు 5 కోట్ల రుణం మంజూరు చెక్కును మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పి డి.జానకి ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, డిఆర్‌డిఓ నర్సింహులు, ఎల్‌డిఎం వైద్యం భాస్కర్ తదితరులు ఉన్నారు.

### ఇండ్లు మంజూరు పత్రాలు అందజేత

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం 5 లక్షలు రూ. లు ఆర్థిక సహాయం అందించబడనుంది. జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గం, పరిగి నియోజకవర్గంలోని గండేడ్ మండలం లోని లబ్ధిదారులకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు సోమవారం రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం లో 14 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు అందచేశారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరై పునాది వరకు నిర్మాణం చేసుకున్న 4 గురు లబ్ధిదారులకు ఒక్కొకరికి లక్ష రూ. ల చెక్కులను మంత్రి మంజూరు చేశారు. శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి. మధుసూధన్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ. డి. జానకి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా రెడ్డి, గృహ నిర్మాణ పి.డి వైద్యం భాస్కర్ లు పాల్గొన్నారు.



## రైతులకు విత్తనాలు అందజేత

ప్రజాపక్షం/ మక్తల్ : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే కార్యక్రమంలో భాగంగా నేడు మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక అగ్రికల్చర్ కార్యాలయంలో రైతులకు వరి (ఆర్‌ఎస్‌ఆర్ 15048) , కంది (ఐసిపిఎల్ 87119 ఆశారకం) విత్తనాలను రైతులకు పంపిణీ చేసిన మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా॥ వాకిటి శ్రీహరి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందేలా నా వంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి అండ



ప్రజాపక్షం/బిజినేపల్లి : పార్టీకోసం పనిచేసే వారికి బిఆర్‌ఎస్‌పార్టీ అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త శ్రీనివాసులు గతకొన్ని రోజులక్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. బిఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం పొందడంతో పార్టీ ప్రమాద బీమా పథకం కింద రూ.2లక్షల రూపాయల చెక్కును మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## అచ్చంపేట సిపిఐ కార్యదర్శిగా పెరుమాళ్ల గోపాల్

ప్రజాపక్షం/అచ్చంపేట : అచ్చంపేట నియోజకవర్గం సిపిఐ ప్రధాన కార్యదర్శిగా పెరుమాళ్ల గోపాల్‌ను ఎన్నుకోవడం జరిగిందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ్మా, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కేశవులుగౌడ్ సంయుక్తంగా ప్రకటించారు. ఈనెల 18న అచ్చంపేటలో సిపిఐ 18వ నియోజకవర్గ మహాసభలు టిఎన్‌జివో భవనంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 19మంది కమిటితో కార్యవర్గం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కమిటి సభ్యులుగా మల్లేష్, తిరుపతమ్మ, పార్వతమ్మ, విష్ణు, బషీర్, నరేష్, సాయిబాబు,ప్రేమ్ ఎన్నికయ్యారు. ఎన్నిక పట్ల అందరూ హర్షం వ్యక్తం చేశారు.

# త్యాగాల తెలంగాణను అభివృద్ధిలో ముందుంచుదాం..



ప్రజాపక్షం / వనపర్తి : రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు సామాజిక న్యాయంలో సైతం తెలంగాణ దేశానికి దిశా నిర్దేశం చేస్తుందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ది సంస్థ చైర్మన్ ఎన్. ప్రీతం అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా ఐడిఓసి ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ది సంస్థ చైర్మన్ ప్రీతం , వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్, ఎమ్మెల్యేలతో కలిసి తెలంగాణ అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్చంతో నివాళులర్పించారు. అనంతరం వారు జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలను తెలిపారు. ఐడిఓసి ఆవరణలో పోలీస్ శాఖ, ఎస్సీ కార్పొరేషన్ , జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా వైద్యశాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, పురపాలక, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్య అతిథితో పాటు, కలెక్టర్ , ఎమ్మెల్యే సందర్శించి తిలకించారు.



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి డిసిసి అధ్యక్షుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతమైన మీడియాతో మాట్లాడారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, సీనియర్ నేత ఎన్‌పి వెంకటేష్, మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు సిరాజ్ ఖాద్రి, నయుం, అజ్మత్ అలీ, ఫయాజ్ , అవేజ్, పీర్ సాదిక్, నాగరాజు, గులాం జహీర్, ఫైసల్, జగదీష్, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/నర్వః మండల మహిళా సమైక్య కార్యాలయంలో మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏపిఎం వనిత కుమారి, ఎంపీడీవో శ్రీనివాసులు, అకౌంటెంట్ అమృత ప్రధాన కార్యదర్శి సంతోషమ్మ కార్యాలయ సిబ్బంది సీసీలు అంజప్ప, దేవప్ప తదితరులు పాల్గొన్నారు.



### రాష్ట్ర అవతరణ వేడుకల్లో పలువురు వక్తలు



జడ్చర్ల : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జడ్చల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి , మాజీ మంత్రి డాక్టర్॥ లక్ష్మారెడ్డిలు వేర్వేరు ప్రాంతాలలో జెండాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఆవరణలో. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తన నివాసంలో ఇతర ప్రాంతాలలో వారు ఆయా పార్టీల జెండాలను ఆవిష్కరించి తెలంగాణ ఆ విర్భావం గురించి మాట్లాడారు.

అడ్డాకుల: అడ్డాకుల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు దేవరకద్ర శాసనసభ్యులు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం ఆర్టీసీ బస్టాండు కూడలిలో గల బాబా సాహెబ్ డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా అడ్డాకుల మండల బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. అడ్డాకుల మండల టీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు టి.శ్రీనివాస్‌రెడ్డి, మండల సింగిల్ విండో చైర్మన్ మద్దూరి జితేందర్‌రెడ్డి, మండల మాజీ రైతు బంధు అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి, జడ్పీ మాజీ కోఆప్షన్ పొన్నకల్ మహిమూద్, మండల మాజీ కోఆప్షన్ ఖాజాగోరి, మాజీ ఎంపిటిసి రంగన్న గౌడ్, మాజీ సర్పంచు గోద జయన్న గౌడ్, సీనియర్ నాయకులు బి.దేవేందర్‌రెడ్డి, రమేష్ గౌడ్, విజయ్‌కుమార్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, రాజు నాయక్, కొండన్న, పొన్నకల్ కృష్ణయ్య ఉన్నారు.



మహబూబ్‌నగర్ ప్రతినిధిః స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో 11 వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్ తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు నివాళులర్పిం చారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, అమీనా ముంతాజ్ జహన్, కళాశాల కోఆర్డినేటర్ మధుసూదన్ శర్మ, పొలిటికల్ సైన్స్ విభాగధిపతి మద్దిలేటి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాపక్షం/ నారాయణపేట్ : నారాయణపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ అవరణలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర చైర్పర్సన్, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ గుర్నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల వందనం స్వీకరించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్, అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్॥ చిట్టెం పర్నికా రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ కుమార్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్డీవో రామచందర్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నారాయణపేట్: మాజీ శాసనసభ్యులు, బి ఆర్ యస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యస్ రాజేందర్ రెడ్డి సోమవారం నారాయణపేట్ జిల్లా కేంద్రంలో సింగారం చౌరస్తాలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను. ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేసిన వారిని, ఆత్మ బలిదానాల చేసిన వారికి సంతాపం తెలిపి ఉద్యమకారులకు గుర్తుచేసుకొని జెండా ఆవిష్కరణలో పాల్గొని తదుపరి నారాయణపేట జిల్లా కేంద్రం 14 వార్డుకు చెందిన బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కె.శే.యం.కృష్ణ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించినందున వారికి పార్టీ తరపున రూపాయలు 2 లక్షల భీమా చెక్కును వారి భార్య మంజులకు అందజేశారు. మాజీ శాసనసభ్యులు, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యస్.రాజేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ప్రతినిధిః భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులు లక్ష్మారెడ్డి జాతీయ పతాకం ఎగురవేశారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, జడ్పీ మాజీ చైర్మన్ యాదయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ మహబూబ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, సీనియర్ నాయకులు మోహన్ బాబు, ఇక్బాల్, పాల సతీష్, అన్వార్, సుధాకర్, గోపాల్ యాదవ్, తదితరులు ఉన్నారు.



ధన్వాడ : ధన్వాడ మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయం దగ్గర నీరటి నర్సిములు నాయుడు ముదిరాజ్ జిల్లా ఉపాధ్యక్షులు నారాయణపేట జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నీరటి వెంకటయ్య ముదిరాజ్, నీరటి నారాయణ ముదిరాజ్, వల్కే ఆనంద ముదిరాజ్, సంద చిన్న నరసింహులు ముదిరాజ్, నీరటి అశోక్ ముదిరాజ్, టప్పు భాస్కర్ ముదిరాజ్, నీరటి మన్నెమ్మ ముదిరాజ్, వై. రాములమ్మ ముదిరాజ్, నీరటి శ్రీశైలం ముదిరాజ్, నీరటి బాలా ముదిరాజ్, టప్పు కృష్ణయ్య ముదిరాజ్, గువ్వల పల్లి వెంకట రాముడు ముదిరాజ్, గుండ్లకుంట వెంకటన్న ముదిరాజ్, నీరటి నరేష్ కుమార్ ముదిరాజ్, నీరటి దయ్యాల శ్రీను ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం/బిజినేపల్లి : తెలంగాణరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండలప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటం అలుపెరుగని ఆరాటం కొందరి బలిదానం వీటన్నింటి వల్లే ఏర్పడిందన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు.





కల్వకుర్తి : అమరుల త్యాగఫలితమేనని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ తెలంగాణ తల్లి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలువేసి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులస్థూపం వద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డుమెంబర్ ఠాకూర్‌బాలాజీసింగ్, నాయకులు ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అమరులత్యాగాలు వెలకట్టలేనివని, అభివృద్ధిలో ప్రపంచానికి పోటీపడుతున్న ఏకైకరాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ప్రణాళికసంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని పోలీస్‌పరేడ్‌మైదానంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాయంత్రాంగం తరపున జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్‌లు పూలమొక్కలతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్‌పి రామేశ్వర్, అన్నిశాఖల జిల్లా అధికారులు, ఎల్రక్టానిక్, ప్రింట్‌మీడియా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, అభివృద్ధి చెందడంలో రాష్ట్రం కోసం జీవితాల్ని త్యాగం చేసిన అమరవీరుల పాత్ర ఎంతో ఉందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ఉదయం 8.45 నిమిషాలకు జాతీయ జెండాను ఆవిష్కరించి , పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేసి జిల్లా ప్రజలకు , పోలీసు అధికారులకు, సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2014 జూన్ 2న అధికారికంగా ఏర్పడిందని తెలంగాణ రాష్ట్రం నేటితో పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా సాధించుకున్నదే తెలంగాణ రాష్ట్రమని, రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రజా రక్షణే ధ్యేయంగా శాంతి భద్రతల పరిరక్షణకు ఆహర్నిశలు కృషి చేయాలని సమాజం ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్ర అభివృద్ధిలో పోలీసులు కృషి చేస్తున్నారని తెలియజేశారు.వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పీ , ఉమామహేశ్వరరావు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ, సునందన, నరేష్ , స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్ , వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సిఐ, రాంబాబు, ఆత్మకూర్ సిఐ శివకుమార్ , సిసిఎస్ సిఐ రవి పాల్ , రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అప్పల నాయుడు, శ్రీనివాస్ , జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### సిపిఐ ఆధ్వర్యంలో .....

నీళ్లు, నిధులు, నియామకాలు, విభజన హామీల సాధనకు మళ్లీ పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు పిలుపునిచ్చారు. సోమవారం వనపర్తి సిపిఐ జిల్లా ఆఫీసులో తెలంగాణ రాష్ట్ర ఆవతరణ వేడుకలను జరుపుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ , ఏఐటియూసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రకుర్మయ్య, భారతీయ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షులు జయమ్మ, నేతలు శిరీష, జ్యోతి, సాధ్విని తదితరులు పాల్గొన్నారు.

### వీపనగండ్లలో .....

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారులు, నాయకులు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల జాతీయ జెండాలను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

### కొత్తకోటలో .....

బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపు మేరకు కొత్తకోట మున్సిపాల్టీకేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద గులాబీ శ్రేణులు పాల్గొని గులాబీ జెండాను ఎగురవేసి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సోమవారం కేవలం 15 మంది ఫిర్యాదుదారులు మాత్రమే ఫిర్యాదులను సమర్పించగా, ఆ ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఫిర్యాదును పంపిస్తూ సాధ్యమైనంత త్వరగా ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఫిర్యాదుదారుకు పరిష్కారాన్ని తెలియజేయాలని, ఒకవేళ ఫిర్యాదు పరిష్కారం కాకపోతే ఎందుకోసం కాలేదో ఆ వివరాలను సైతం తెలియజేయాలని, అలాగే కలెక్టర్ కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగానికి సైతం వెంటనే ఫిర్యాదు పరిష్కారం పై తెలియజేయాలని చెప్పారు మండల, గ్రామస్థాయిలో సైతం ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఆమె ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, తదితరులు ఫిర్యాదులను స్వీకరించారు.

## చేనేత హస్త కళాకారులను ప్రోత్సహించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పరిధిలోని రాయిరిలో మినీ శిల్పారామంను భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు కలసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పచ్చదనంగా శిల్పారామంను చూసి ముఖ్య అతిథులు సంతోషం వ్యక్తం చేశారు. చేనేత హస్త కళాకారులకి యాదగిరిగుట్టలో ఒక వేదిక దొరకడం చాలా ఆనందంగా ఉందని కొనియాడారు. గుట్టకు వచ్చే సందర్శకులు శిల్పారామంకు కూడా విచ్చేసి చేనేత హస్తకలకారులను ప్రోత్సహించవలసిందిగా వారు కోరారు. అనంతరం బోటింగ్‌ను తిలకించారు.



## ప్రజలకు, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలి

### రూ. 7.61కోట్ల రూపాయలతో నిర్మించిన సమీకృత జిల్లా విద్యుత్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజలకు, రైతులకు మెరుగైన విద్యుత్ సేవలందించాలని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రూ.7.61 కోట్ల రూపాయలతో నిర్మించిన సమీకృత జిల్లా విద్యుత్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్, టిజిఎస్‌ఎస్‌డిసిఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు లతో కలిసి ప్రారంభించారు. జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా సాగు చేస్తున్నందున రైతులకు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా చేయాలని, వర్షాలు, పకృతి విపత్తులు సంభవించినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఎస్‌ఈ ఫ్రాంక్లిన్ని తన కుర్చీలో మంత్రి కూర్చోబెట్టి రైతుల పట్ల మంచిగా ఉండాలని సూచించారు. వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్నయాదవ్, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్డీవో వేణుమాదవ్, ఈఈ కృష్ణారెడ్డి, డిఈ శ్రీనివాసులు, తహసిల్దార్ కృష్ణయ్య, ఎఇ శేఖర్ పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి



**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఎగరవేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్రం సిద్దించాక పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని కాంగ్రెస్ ప్రజా పాలనలో పేరుతో అధికారంలోకి రావడం జరిగిందని ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచేలా ప్రజా పాలన సాగాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి వెంకట్రాములు, నీలా వెంకటయ్య, మైనోద్దీన్, పట్టణ సహాయ కార్యదర్శులు నగేష్, జ్యోతిబస్, శాఖ కార్యదర్శులు శ్రీను, మల్లేష్ పాల్గొన్నారు.

## ఐఐటి, జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025లో జయ విద్యార్థుల విజయభేరి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ప్రతిష్టాత్మకమైన ఐఐటి, జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్షల్లో సూర్యాపేట పట్టణంలోని జయ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో విజయభేరి మ్రోగించారు. 13 మంది విద్యార్థులు ఐఐటితో పాటు జాతీయ స్థాయి కాలేజీ సీట్లను సాధించారు. కళాశాలకు చెందిన శ్రీతేజశ్రీ 1505 ర్యాంకు, సిహెచ్ అన్వూతశ్రీ 2040, జి.మేనక 2146, టి.అమూల్య 4877, డి.లాస్య 5766, డి.జగదీష్ రాజు 8076 ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జయ కళాశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు జ్యోతి, జల్లా పద్మ అభినందించారు. విజయానికి కారకులైన అధ్యాపక బృందానికి, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఆర్ విద్యార్థులు ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన సపావత్ పవన్‌కు ఆలిండియా స్థాయిలో 204 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. అదే విధంగా బర్మావత్ సుమన్‌కు ఆలిండియా స్థాయిలో 1049 ర్యాంకు వరించింది. ఈ సందర్భంగా కళాశాల జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ అధ్యాపక బృందం కలిగి ఉండి క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన వల్లే ఈ ర్యాంకులు సాధ్యం అయ్యాయన్నారు. ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదా రెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సిఈఓ సురేందర్ రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, డీన్ కిషోర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు,ఏఓ సరితా రెడ్డి అధ్యాపకులు,వర్ధన్,శ్రీను,ప్రసన్న విద్యార్థులను అభినందించారు.

## ఐఐటి అడ్వాన్స్‌లో కెఎస్ఎస్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వెలువడిన ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పట్టణంలోని కేవీఎస్ విద్యార్థులు బి.మోహిత్‌రాజానాయక్ 19వ ర్యాంకు, డి.ఆనంద్ 1840వ ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ ఫలితాలతో నల్లగొండ జిల్లాలోనే ఐఐటీలో కేవీఎస్ మేటి అని రుజువైందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థిని మోహిత్‌రాజానాయక్‌ను, ఆనంద్‌ను కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌తోపాటు, డైరెక్టర్స్ నరేందర్‌రెడ్డి, పీఎల్ఎన్.రెడ్డి, హనుమంతరెడ్డిలు అభినందించారు.

# సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ దిక్సూచి

### యువతే ప్రజాప్రభుత్వ నిర్మాతలు
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధికి దిక్సూచిలాగా ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి నర్సింహా, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి, తెలంగాణ తల్లికి, జాతీయ నాయకులకు పుష్పాంజలి ఘటించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి పదకొండు సంవత్సరాలు నిండాయని, ఈ రోజు రాష్ట్రమంతటా తెలంగాణ అవతరణ వేడుకలను వైభవంగా జరుపుకుంటున్నారని, సూర్యాపేట జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లాలో 22వేల యూనిట్ల ఇందిరమహిళ శక్తి పథకానికి పనులు పురోగతిలో ఉన్నవన్నారు. 6408 సభ్యులతో 181 కొత్త స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమీకృత జిల్లా కార్యాలయంలో క్యాంటిన్‌ను మహిళ స్వయం సహాయక సంఘానికి ఇవ్వడం జరిగిందన్నారు. 726 మహిళ సంఘాలకు కుట్టుకేంద్రాలు ద్వారా స్కూల్ యూనిఫాం కుట్టించి 82 లక్షల ఉపాధిని కల్పించడం జరిగిందన్నారు. స్త్రీ నిధి పథకం ద్వారా 2024/25 ఆర్థిక సంవత్సరానికిగానూ 77కోట్ల రుణం అందించి జీవనోపాదుల లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పెంపుకు దృష్టిసారించి 64 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. 5116 స్వయం సహాయక సంఘాలకు రూ.544 కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజీ మంజూరు చేసిందన్నారు. పేదరిక నిర్మూలన ద్వారా 2025/26 సంవత్సరానికి 883 ఎస్సీ, ఎస్టీలకు రూ.105 కోట్ల టార్గెట్‌గా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. జిల్లాలోని గరిడేపల్లి, చిలుకూరు, తిరుమలగిరిలో నూతనంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒక్కో స్కూల్‌కు 200 కోట్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసిందన్నారు. హుజూర్‌నగర్‌లో సీతరామగుట్ట వద్ద యువత ఉపాధికోసం శిక్షణ ఇప్పించేందుకు ఏడాది బడ్జెట్‌లో 1435 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతు బరోసా కింద ప్రతి ఎకరానికి ఏడాదికి 12వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 2,29,965 ఎకరాలకు, మూసి ప్రాజెక్టు కింద 15,234 ఎకరాలు, శ్రీరాంసాగర్ రెండోదశ ప్రాజెక్టు ద్వారా 2,13,175 ఎకరాలకు, 1036 చెరువులు, కుంటల పరిధిలో 69385 ఎకరాలు, 54 ఐడిసి ఎత్తిపోతల పథకం కింద 54713 ఎకరాలు సాగు చేయడం జరుగుతుందన్నారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌడ సభ్యులకు 10 మందికి కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. మహిళ స్వయం సహాయక గ్రూపులకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ద్వారా 169 స్వయం సహాయక సంఘాలకు రూ.23కోట్ల 73 లక్షల బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. దీనికి ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీవో వేణుమాదవ్, డిఆర్‌డివో వివి అప్పారావు, డిఎఫ్‌వో సతీష్‌కుమార్, పశుసంవర్థక అధికారి శ్రీనివాస్, కల్చరల్ టీమ్ శంకర్, అశోక్, రమేష్‌కుమార్, సిపివో శంకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి ఆపినా ఆగదు

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ అభివృద్ధి ఎవరూ ఆపినా ఆగదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆయన పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కళాభారతి వరకు జాతీయ జెండాలు, బతుకమ్మలు, బోనాలతో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి భారీ ర్యాలి నిర్వహించారు. అనంతరం కలాభారతి వద్ద అధికారులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా మల్టీ పర్పస్ సిబ్బందికి హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ చెక్కులను అందచేశారు. పట్టనంలో చెత్త సేకరణకు మంజూరైన 12 టాటా ఏస్, ఆరు ట్రాక్టర్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, అధికారులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# పోరాటాల పొద్దుపొడుపు నల్లగొండ

### జిల్లా సర్వోతోముఖాభివృద్ధికి కలిసి పని చేద్దాం : మంత్రి కోమటిరెడ్డి
### రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్





**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** నల్లగొండ అంటే నమ్మకానికి ప్రతిరూపం..పోరాటాల పొద్దుపొడుపు..అలాంటి నల్లగొండ జిల్లాలో పుట్టడం సంతోషకరం..జిల్లాను సర్వోతోముఖాభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు,అధికారులందరూ కలిసి పని చేద్దామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం ఆయన నల్లగొండ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్ లతో కలసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.అనంతరం జిల్లా ప్రజలకిచ్చిన సందేశంలో తెలంగాణ రాష్ట్రం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతో మంది పోరాటాల వల్ల తెలంగాణ సాధించుకోగలిగామని,తాను సైతం తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేయడం జరిగిందని, ప్రజల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఇందులో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 పేరున పేదల సంక్షేమం కోసం సమగ్ర పాలసీలను రూపొందించిందని, ప్రపంచ స్థాయిలో తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. ఆడబిడ్డల సంక్షేమంలో భాగంగా ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు నాలుగు కోట్ల అరవై నాలుగు లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయగా ,203 కోట్ల 78 లక్షల రూపాయలు లబ్ధి చేకూర్చడం జరిగిందని రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ముందు మంత్రి క్లాక్ టవర్ సెంటర్లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాల నుంచి అమరులకు నివాళులర్పించారు.ఆదేవిదంగా బాల భవన్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.అభివృద్ధిని తెలిపే విధంగా శకటాల ప్రదర్శన ,స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన ఆరుగురికి జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు.ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వర్గాలకు కొమ్ముకాస్తున్న బిజెపి

### సిపిఐ జిల్లా కార్యదర్శి , ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పారిశ్రామిక వర్గాలకు కొమ్ముకాస్తూ శ్రామిక వర్గాలను అణగదొక్కే కుట్ర చేస్తుందని అందులో భాగంగానే ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను తుదముట్టిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం సిపిఐ గట్టుప్పల 2వ మండల మహాసభ మండల పరిధిలో గల వెల్మకన్నె గ్రామంలోని మాదగోని యాదయ్య ప్రాంగణంలో నిర్వహించారు.ఈ మహాసభ కారింగు శ్రీను అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిధిగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడుతూ 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలతో ప్రజాధనం దోచుకుతిన్నారని ఆరోపించారు. కాలేశ్వరం ప్రజెక్టులో కెసిఆర్ దోషిగా నిలబడడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలను పక్కదోవ పట్టించే ప్రకటనలతో కేసిఆర్, కవిత ఇద్దరు కలిసి డ్రామాలాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను నిష్పక్షపాతంగా అమలు పర్చాలని కోరారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ,రేషన్ కార్డులు రాజీవ్ యువ వికాస్ తదితర పథకాల అమలులో నిష్పక్షపాతంగా పేదలకు అందే విధంగా చూడాలన్నారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తిర్పారి వెంకటేశ్వర్లు , నల్పరాజు రామలింగయ్య , జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మరబోయిన లాలయ్య ,చాపల శ్రీను , గట్టుప్పల మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్ , ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షకార్యదర్శులు చలం పాండురంగారావు , జగన్ ,ఏఐవైఎఫ్ నాయకులు గడ్డం నవీన్ , కట్ట దశరథ , రాపోలు సత్తయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగితే ఊరుకోను

### ఇండ్ల భూమిపూజలో ఎమ్మెల్యే రాజ్ గోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగితే ఊరుకునేది లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నా రు. సోమవారం మండలంలోని చీకటిమామిడి,కొంపెల్లి గ్రామాలలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లనిర్మాణంకు భూమి పూజ చేశారు. చీకటిమామిడి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల 21 మంది లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పేద ప్రజలకు ఉపయోగపడే విధం గా నిర్మాణాలు జరగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేదిరి విజయేందర్ రెడ్డి,నారబోయిన రవి,భీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, జాల వెంకన్న పాల్గొన్నారు.

## రైజింగ్ -2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు

### రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుఖేందర్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డిసిపి అక్షాంష్ యాదవ్‌తో కలసి పోలీసు వందనం స్వీకరించారు. తెలంగాణ తల్లి, మహనీయుల చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ గావించారు. తదుపరి జిల్లా ప్రగతి నివేదికను ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరుగుచున్న వేడుకలకు విచ్చేసిన జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా న్యాయమూర్తులకు, స్వాతంత్ర్య సమర యోధులకు, అధికారులకు, అనధికారులకు, పాత్రికేయులకు, విద్యార్థినీ, విద్యార్థులకు ,జిల్లా ప్రజలందరికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల కల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం, ఆరు దశాబ్దాల పోరాటం, అమరవీరుల త్యాగాల ఫలంగా 2014 జూన్ 2న 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచస్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాణ్యమైన విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లాలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 67 మంది విద్యార్థిని, విద్యార్థులకు నిర్మాణ సంస్థ (CSR) రాజేష్ అనూష, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుండి కైలాసల వారి సహకారంతో 67 మందికి సైకిళ్లను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి , అడిషనల్ డిసిపి లక్ష్మి నారాయణ, జెడ్పీ సిఈఓ శోభా రాణి, ఏసిపి రాహుల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు, ఆర్డీవో కృష్ణా రెడ్డి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.








## ఐఐటి, జెఇఇ అడ్వాన్స్ ఫలితాలలో ప్రగతి ప్రతిభ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికబద్ధమైన విద్యాబోధన తో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని ప్రగతి కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ప్రకటించిన ఐఐటి, జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వివిధ క్యాటగిరిలలో ర్యాంకులు సాధించిన తమ కళాశాల విద్యార్థి ఆర్. క్రిష్ణ 480 వ ర్యాంకు సాధించి కళాశాల టాపర్గా నిలిచినాడనీ తెలిపారు .అదే విధంగా కళాశాలకు చెందిన డి. చరణ్ 1569, డి. చరణ్ 2960, కె. సమీరా 4122 ర్యాంకులు సాధించి ప్రగతి జూనియర్ కళాశాల ది బెస్ట్ కళాశాల అని నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎ. నరేందర్ బాబు, ఎన్. శశిధర్రావు, చందా శ్రీనివాస్, పైళ్ళ రమేష్ రెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# యువతరంగం

## పెన్ను విడిచిపెట్టి.. గన్ను చేతబట్టి..



ఆధిపత్య పోరాటాలు... ఉన్మాదపు యుద్ధాలు చరిత్రకు ఎర్ర రంగులు అద్దాయి. మనిషి ఎదుగుతున్న కొద్దీ... నాగరికత పెరుగుతున్న కొద్దీ పరస్పర అవగాహన, సోదరభావం, సౌభ్రాతృత్వం వర్ధిల్లాల్సింది పోయి... ఘర్షణలు మరింతగా పెరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక మూల తుపాకులు పేలుతునే ఉన్నాయి. మనుషులు శవాలుగా మారుతునే ఉన్నాయి. ఒకరు మరణిస్తే, ఆ కుటుంబం మొత్తం చిందరవందరవుతున్న వైనం మనం కళ్లెదుట కనిపిస్తునే ఉంది. అందుకే..
'రణరంగం కానిచోటు భూస్థలమంతా వెదికిన దొరకదు గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళ్ళతో' అంటాడు మహాకవి శ్రీశ్రీ. గతమేకాదు.. వర్తమానం కూడా రక్తమయమవుతున్నది. భవిష్యత్తులో శాంతి చిగురించి, ప్రపంచం పచ్చదనాన్ని సంతరించుకునే అవకాశాలు కనిపించడమే లేదు. ఈ పోరాటాల్లో చల్లారిన సంసారాలెన్నో... మరణించిన జన సందోహం లెక్కలెక్కడో? భూమిపై ఒక దేశాన్ని... ఒక ప్రాంతాన్ని లేదా ఒక జాతిని లేకుండా చేయాలన్న దుష్ట పన్నాగాలు కొనసాగుతున్నంత కాలం అసహాయుల హాహాకారాలే.. పాలస్తీనా లేదా లెబనాన్... సిరియా లేదా ఇరాక్... నిత్యంత ఏదో ఒక యుద్ధం వెంటాడుతున్న నేపథ్యంలో, యువత చదువుకు దూరంకాక తప్పడం లేదు. ఈ ప్రాంతాల్లో యువకులు గత్యంతరం లేని పరిస్థితుల్లో విద్యను విడిచిపెట్టి, తుపాకీ చేతబడుతున్నారు. ప్రాణాలు ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రక్తరంజిత రణక్షేత్రాలు అరాచక కేంద్రాలే తప్ప, శాంతి కారకాలు ఎప్పటికీ కావు. భయంకర తుపాకీ గర్జనలకు తగిన సమాధానం చెప్పడానికి పాలస్తీనియన్ యువత దశాబ్దాల క్రితమే యుద్ధ భూమిలోకి పరుగులు తీశారు. యుద్ధం ఆగలేదు. యువతీయువకుల సమస్యలు తీరలేదు. ప్రపంచం యావత్తు అధునా తన సాంకేతికను అందిపుచ్చుకొని, అన్ని రంగాల్లోనూ దూసుకెళుతుంటే, యుద్ధంలో మునిగితేలుతున్న దేశాల్లో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రాణ భయంతో, కుటుంబాన్ని రక్షించుకోవాలన్న తపనతో, భవిష్యత్తును పణంగా పెట్టి, ఆయుధాలు పడుతున్నారు. ఆ ధైర్యం కూడా చేయలేనివారు, జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటూ, దినదినగండంగా రోజులు గడుపుతున్నారు. కొంత మంది వ్యక్తుల దాహం తీరని యుద్ధ పిపాస, ఎన్నో దేశాల్లో ఆకలి కేకలకు కారణమవుతున్నాయి. అక్కడ అభివృద్ధి లేదు. ఉద్యోగావకాశాలు లేవు. ఆదాయం లేదు. పేదరికంతో సహవాసం... కష్టాలతో కలిసి ప్రస్థానం... మానవత్వాన్ని మసకబార్చే బాంబుల భీకర హోరులో, యువత ఆక్రందనలు కలిసిపోతున్నాయి. ధ్వంసం మిగిల్చిన ధూళి మేఘాలు అలముకున్న స్థితిలో, వారి బతుకులు దుర్భరమవుతున్నాయి. గాజాలో నెలకొన్న పరిస్థితులు... అక్కడి పాలస్తీనా ప్రజలు, ప్రత్యేకించి యువతీయువకులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. శాంతి చర్చలంటూ హడావుడి చేసిన అమెరికా ఇప్పుడు మౌనవ్రతం పట్టింది. యుద్ధం నీడలో బతుకుతున్న పాలస్తీనా పిల్లలు, యువతీయువకులు చదువుకు దూరమవుతున్నారు. యుద్ధాలకు తెరపడనిదే, ఆ సమస్యను ఎదుర్కొంటున్న దేశాల్లో యువత బతుకులు బాగుపడవు. వారి అభ్యున్నతికి బాటలు ఏర్పడవు.

## యాజమాన్యాల ఇష్టారాజ్యం




కార్పొరేట్ ప్రపంచంలో యాజమాన్యాల ఇష్టారాజ్యం ఏ విధంగా కొనసాగుతున్నదో చెప్పడానికి హిమాచల్ ప్రదేశ్‌లోని బద్ది ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ. ఇటీవల హఠాత్తుగా ఫ్యాక్టరీలోని తయారీ యూనిట్లలో ఒకదానిని మూసివేసినట్టు విప్రో ప్రకటించింది. అయితే, ఈ విషయాన్ని సైట్ఇన్ఫ్లస్ మీడియా సంస్థ వెల్లడించే వరకూ కార్మికులకు వివరాలు ఏవీ తెలియ లేదు. విప్రో యాజమాన్యం తీసుకున్న నిర్ణయంతో కనీసం 80 మంది ఉద్యోగాలు సందిగ్ధంలో పడ్డాయి. రెగ్యులర్ షిఫ్ట్‌ల కోసం వచ్చే ఉద్యోగులను భద్రతా సిబ్బంది ఫ్యాక్టరీ గేట్ల వద్ద ఆపి, మూసివేత గురించి తెలియచేయడం దారుణమని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. డిసెంబర్‌లో తాము పని ప్రారంభించామని, కంపెనీ నిర్ణయం గురించి తమకు తెలియదని చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యామని కార్మికులు అంటున్నారు. కార్యాచరణ అంతరాయాలు, ఆర్థిక నష్టాల కారణంగా షట్‌డౌన్ జరిగిందని విప్రో ప్రకటనలో ఉన్నట్టు మీడియా నివేదిక పేర్కొంది. దీనిపై ఫ్యాక్టరీ కార్మిక సంఘం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి, కార్మిక శాఖకు ఫిర్యాదులు చేసింది. కార్మికుల హక్కులను కాపాడటానికి జోక్యం చేసుకోవాలని కోరింది. కాగా, విప్రో తీసుకున్న ఈ మూసివేత నిర్ణయం కార్మికులపై మాత్రమేగాక, సరఫరాదారులపై కూడా ప్రభావం చూపుతున్నది. బద్దీలోని విప్రో ఫ్యాక్టరీ పనిచేస్తున్నప్పటికీ, ఈ యూనిట్ మూసివేయడం చాలా మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ముందస్తు నోటీసు లేకుండా విప్రో ఎంటర్‌ప్రైజెస్ కార్మికులను వెనక్కి పంపడం ప్రైవేటు యాజమాన్యాలు అనుసరిస్తున్న అనైతిక, అరాచక విధానాలకు దర్పణం. మెరుగైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత కోసం ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న తరుణంలో, భారీ నష్టాల కారణంగా ఒక యూనిట్‌ను మూసివేయాల్సి వచ్చిందని విప్రో యాజమాన్యం ప్రకటించడం అనుమానాలకు తావిస్తున్నది. ఇది కార్మికులను ఇబ్బంది పెట్టడానికి తీసుకున్న నిర్ణయంగా భావించాల్సి వస్తున్నది. విప్రో తయారీ కార్యకలాపాలలో బద్దీ యూనిట్ కీలకమైన భాగంగా ఉండేది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడింది. దీని మూసివేత శ్రామిక శక్తికి పెద్ద దెబ్బ. ఇది ప్రత్యక్ష ఉద్యోగులను మాత్రమే కాకుండా ఫ్యాక్టరీ కార్యకలాపాలపై ఆధారపడిన కాంట్రాక్ట్ కార్మికులు, సరఫరాదారులను కూడా ప్రభావితం చేస్తుంది. బద్దీలోని ఒక విప్రో కర్మాగారం పనిచేస్తుండగా, ఈ యూనిట్ మూసివేత భారతదేశ పారిశ్రామిక ప్రాంతాలలో యజమానులు, కార్మికుల మధ్య పెరుగుతున్న ఒత్తిడిని ప్రతిబింబిస్తుంది. కార్మిక వివాదాలు, ఆర్థిక సవాళ్లు కొనసాగితే ఇలాంటి మూసివేతలు కూడా వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## చిన్న వయసులోనే గొప్ప సేవ..

అమెరికాలోని రోడ్ ఐలాండ్ రాష్ట్రానికి చెందిన నికోలస్ లోవింగర్ చాలా చిన్న వయసులోనే చాలా పెద్ద సేవా కార్యక్రమాన్ని చేపట్టాడు. యువ సామాజిక సేవకుడిగా పేరు గడించాడు. నికోలస్ ఐదు సంవత్సరాల వయసులో తన తల్లితో కలిసి ఒక అనాథ శరణాలయాన్ని సందర్శించాడు. అక్కడ కొంత మంది పిల్లలు తెగిపోయిన పాత చెప్పులు వేసుకోడం, చాలా మంది అసలు చెప్పులే లేకుండా ఉండడం చూసి బాధపడ్డాడు. ఈ అనుభవం అతనికి ప్రేరణగా మారి, అనాథ పిల్లలకు కొత్త చెప్పులు అందించాలనే లక్ష్యంతో 'గొటా హావ్ సోల ఫౌండేషన్ (Gotta Have Sole Foundation)ను ప్రారంభించాడు. ఈ ఫౌండేషన్ ద్వారా అమెరికా అంతటా ఉన్న అనాథ శరణాలయాల్లోని పిల్లలకు కొత్త చెప్పులు పంపిణీ చేస్తున్నాడు. పిల్లల పాదాల పరిమాణానికి సరిపోయే చెప్పు, బూట్లతోపాటు సాక్స్‌లు అందిస్తున్నాడు. వ్యక్తిగత సందేశాలతో కూడిన కార్డులు పంపిస్తూ, వారికి చాలా చేరువగా ఉన్న ఆనందాన్ని కలిగిస్తున్నాడు. సర్వింగ్ లవ్ అనే కార్యక్రమం ద్వారా క్రీడల్లో రాణించాలనుకుంటున్న పిల్లలకు బూట్లు పంచుతున్నాడు. అదే విధంగా వృద్ధులైన సైనికులు, వారి కుటుంబ సభ్యులకు 'సోల్‌డియర్స్' కార్యక్రమం ద్వారా చెప్పులు, బూట్లు ఇస్తున్నాడు. ఇప్పటి వరకూ నికోలస్ 125,000కు పైగా పిల్లలకు చెప్పులు అందజేయడం అతని సేవాతత్పరతకు నిదర్శనం. అతని సేవలకు గుర్తుగా 2014లో నిక్లడియన్ హాలో అవార్డు లభించింది. మరుసటి సంవత్సరం వరల్డ్ ఆఫ్ చిల్డ్రెన్ యూత్ అవార్డును అతను అందుకున్నాడు. ప్రతిష్ఠాత్మకమైన 'త్రీడాట్‌డాష్ గ్లోబల్ టీన్ లీడర్' అవార్డు కూడా నికోలస్ అవార్డుల జాబితాలో చేరింది. అతను చేపట్టిన సేవా కార్యక్రమం, పిల్లల జీవితాలలో సానుకూల మార్పు తీసుకువచ్చింది. పిల్లలకు కొత్త చెప్పులు అందించడం ద్వారా, వారు స్కూల్‌కు వెళ్లడం, క్రీడలలో పాల్గొనడం వంటి అవకాశాలను పొందుతున్నారు. ఇది ఒక చిన్న చర్యగా కనిపించవచ్చు, కానీ దీని ప్రభావం పిల్లల ఆత్మవిశ్వాసం మరియు భవిష్యత్తుపై గొప్పగా ఉంటుంది.



### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## ఆత్మవిశ్వాసానికి 'డాన్'




మీదపడుతున్న వయసును తలచుకుంటూ, శారీరక బాధలను పదేపదే గుర్తుచేసుకుంటూ నిరంతరం మానసికంగా కుంగిపోయే వారు అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' శాస్త్రవేత్త డాన్ పెటిట్‌ను చూసి స్ఫూర్తి పొందాలి. నాసా చేపట్టిన 'ఎక్స్‌పెడిషన్ 71/72'కు ఎంపికైనప్పుడు ఆయన వయసు 69 సంవత్సరాలు. 2024 సెప్టెంబర్ 11న సూయజ్ ఎంఎస్ వ్యోమనౌకలో ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) చేరుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 20న సురక్షితంగా భూమికి తిరిగి వచ్చాడు. అదే రోజు ఆయన 70వ జన్మదినం కావడం విశేషం. ఐఎస్ఎస్‌లో మొత్తం 220 రోజులు గడిపాడు. శారీరకంగా, మానసికంగా దృఢత్వం ఉన్న వారికే ఇలాంటి యాత్రలు సాధ్యమవుతాయి. ఏడు పదుల వయసులో డాన్ అంతరిక్షంలోకి వెళ్లడాన్ని అద్భుతంగా కొందరు పేర్కొంటుంటే, అతని ఆత్మస్థైర్యానికి నిదర్శనమని ఎంతో మంది జేజేలు పలుకుతున్నారు. అతను ప్రయాణించిన దూరం 93.3 మిలియన్ మైళ్ళు, భూమి చుట్టూ చేసిన ప్రదక్షిణలు 3,520. రష్యా ఖగోళ శాస్త్రవేత్తలు అలెక్సీ ఓవ్చినిన్, ఇవాన్ వాగ్నర్ ఆయన సహచరులు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో, పెటిట్ పలు ముఖ్యమైన పరిశోధనలు నిర్వహించాడు. అంతరిక్షంలో మెటల్ 3డి ప్రింటింగ్ సామర్థ్యాలను మెరుగుపరచడం, నీటి శుద్ధి సాంకేతికతల అభివృద్ధి, విభిన్న నీటి పరిస్థితుల్లో మొక్కల పెరుగుదలపై అధ్యయనం, శూన్యతలో అగ్ని ప్రవర్తనపై పరిశోధనలు వంటి అనేక ప్రయోగాల్లో పాల్గొన్నాడు. సూయజ క్యాప్సూల్ ద్వారా కజకిస్తాన్‌లో భూమికి చేరుకున్న అతనికి ఎంతో మంది సాదరంగా స్వాగతం పలికారు. భూమికి చేరిన వెంటనే, గురుత్వాకర్షణకు మళ్లీ అలవాటు పడే సమయంలో ఆయన కొంత అస్వస్థతకు గురయ్యాడు. అయితే, ఇది సాధారణమేనని, తన ఆరోగ్యం బాగానే ఉందని నాసా ప్రకటించింది. 70 సంవత్సరాల వయసులోనూ డాన్ పెటిట్ అంతరిక్ష పరిశోధనలపై తన ఆసక్తిని ప్రదర్శిస్తున్నాడు. తన అనుభవం, శక్తిని వినియోగించి, భవిష్యత్తులో మరిన్ని మిషన్లలో పాల్గొనాలని ఆశిస్తున్నాడు. శాస్త్రవేత్తగా నాసా కేంద్రంలో అనేక ప్రయోగాలు చేసిన అతను గతంలోనూ అంతరిక్షంలోకి వెళ్లాడు. తాజా ప్రయాణం ద్వారా అంతరిక్షంలో తాను గడిపిన సమయాన్ని 590 రోజులకు పెంచుకున్నాడు. నాసా శాస్త్రవేత్తల్లో అత్యధిక కాలం అంతరిక్షంలో గడిపిన వారి జాబితాలో డాన్‌ది మూడో స్థానం.



# విలువలు గల నేత పోటు ప్రసాద్

### ప్రజా ఉద్యమ నిర్మాణమే సరైన నివాళి
### స్మారక స్తూపాన్ని ఆవిష్కరించిన పువ్వాడ

**ప్రజాపక్షం/ఖమ్మం :** సమకాలిన రాజకీయాల్లో విలువలు కలిగిన నేతగా పోటు ప్రసాద్ పేరొందారని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన త్యాగాల కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ పోరాట వారసత్వాన్ని కొనసాగించారని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని పర్ణశాల సమీపంలో సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ ఏర్పాటు చేసిన పోటు ప్రసాద్ స్మారక స్తూపాన్ని సోమవారం పువ్వాడ ఆవిష్కరించారు. స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా రంగాపురంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుల కుటుంబంలో జన్మించిన ప్రసాద్ విద్యార్థిగా ఖమ్మం వచ్చారని, పార్టీ ప్రజాసంఘాలలో సుదీర్ఘ కాలం సేవలు అందించారన్నారు. ప్రజా ఉద్యమ నిర్మాణమే ప్రసాద్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని పువ్వాడ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, ఏపూరిలతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వరదా నర్సింహారావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, పోటు ప్రసాద్ సతీమణి నిర్మల, కుమారుడు రాజా సాత్విక్, మాతృమూర్తి సక్కుబాయి, హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, పోటు పూర్ణచందర్‌రావు, ఉయానాలి సాంబశివరెడ్డి, డాక్టర్ బాగం కిషన్‌రావు, బిఆర్ఎస్ నాయకులు వల్లభనేని రామారావు, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, జాకీర్, ఉపేందర్ పాల్గొన్నారు.




# ఆర్థిక వనరుల దోపిడీకే మావోయిస్టుల అంతం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** సహజ వనరులు, అటవీ సంపద, ఆర్థిక దోపిడీకి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేసే పంతం పట్టారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి సమావేశం భాగి కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా బాలనరసింహ హాజరై మాట్లాడుతూ మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్‌తో బూటకపు ఎన్‌కౌంటర్లు జరుపుతున్నారని, కనీసం వారి మృతదేహాలను కూడా అప్పగించకుండా పైశాచికానందం పొందుతున్నారన్నారు ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీగా ఉన్న పాకిస్తాన్‌తో శాంతిచర్చలు జరుపుతున్న కేంద్రం ప్రజలకు సంబంధించిన డిమాండ్‌లతో సిద్ధాంతపరంగా ఉన్న మావోయిస్టులతో శాంతిచర్చలకు ముందుకు రాకపోవడం హేయమన్నారు. భారతకు మిత్ర దేశంగా భావిస్తున్న అమెరికా యాజమాన్య దేశంగా రూపాంతరం చెందిందని వాపోయారు. మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద అమెరికాకు మోకరిల్లడం యావత్ దేశ ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్దిదారుడికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఆర్థిక చేయుత అందించాలని కోరారు. తెలంగాణ కోసం ఉద్యమించిన పార్టీలను వ్యక్తులను శక్తులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం తొక్కి పెట్టిందని, స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, బి.పరమేశ్వర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి,రాము, ఆర్.అల్వాల్‌రెడ్డి, భాగీ కృష్ణయాదవ్, చాంద్ పాషా, శంకర్‌నాయక్, శ్రీను, జి.సత్యనారాయణ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సి.రాజు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, భార్గవి, కొండిటి పద్మావతి పాల్గొన్నారు.

# అమరుల స్వప్నం, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
### సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం


నల్లగొండ..

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నీళ్లు నిధులు నియామకాల కోసం సాగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతోమంది ప్రాణ త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో గత ప్రభుత్వం అమరుల స్వప్నం, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లగొండ జిల్లా సిపిఐ కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఎమ్మెల్సీ సత్యం జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడుతూ నాడు నిజాం ప్రభుత్వం, భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి 4000 మంది అమరులను త్యాగాలను చేసిన గొప్ప చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కే దక్కిందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా మొట్టమొదటినే జాతీయ పార్టీ అయిన సిపిఐ ఉద్యమాన్ని బలపరిచి పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను చేయకుండా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలపైన దృష్టి పెట్టి అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్లుగి నర్సింహా, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి కెవిఎస్ రెడ్డి పట్టణ నాయకులు ముండ్ల ముత్యాలు, పుట్టల సుజాత, జె విజయ లక్ష్మి, కోమటిరెడ్డి ప్రద్యుమ్నా రెడ్డి, కౌసల్య చింత ధనలక్ష్మి ఎస్ కె మదర్,సీతారాములు,కె నారాయణ, తెలగమళ్ళ దశరథ,దోటి అక్కలయ్య,చంద్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సిపిఐ అనేక పోరాటాలు నిర్వహించి రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మర్రి వెంకటస్వామి ఎగురవేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమయ్య, కిన్నెర మల్లవ్వ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కంది రవీందర్ రెడ్డి, అందె చిన్న స్వామి, బామండ్లపెల్లి యుగేందర్, మచ్చ రమేష్, బూడిద సదాశివ, మావురపు రాజు, కొట్టె అంజలి, చెంచల మురళి, మామిడిపెల్లి హేమంత్‌కుమార్, ఓర్సు కొమురయ్య, నర్సింహులు, కడారి బీరయ్య, జక్కుల రాజయ్య, మామిడిపెల్లి శంకరయ్య, కూన రవి, నగునూరి రమేష్, నల్లగొండ శ్రీనివాస్, నా యిని సురేష్, సందీప్‌రెడ్డి,సాంబయ్య పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో సిపిఐది ప్రత్యేక భూమికని పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆయన జాతీయజెండా ఎగురవేశారు. కార్యక్రమం సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగాచారి, తండ సందీప్, వెలుగు శ్రావన్, ఎండి ఫాతిమా, బానోతు లింగ్యానాయక్, ఆబోతు అశోక్,కేదాసు రమేష్, వంకాయలపాటి చిరంజీవి, తోట రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను నేరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా కామ్రేడ్ ధర్మబిక్షం సిపిఐ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్, ఖమ్మంపాటి రాము, నిమ్మల ప్రభాకర్, శ్రీనివాస్, ఎండి పాషా, పెండకృష్ణ, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** అమరుల ప్రాణత్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పాటు జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ కార్యాలయం వద్ద జాతీయ జెండాను సుధాకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రఘురాం, సురేష్, అంజలి, ఆలీ ఇమ్రాన్, ఫిరోజ్, రాధకుమార్, కార్తీక్, భానుప్రసాద్ పాల్గొన్నారు.

**భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించినారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, ఎఐఎస్ఎఫ్ నాయకులు శాంతి, వంశీ, జానీ, చింతల పెంటయ్య, బద్దం వెంకట్ రెడ్డి, కోట శంకర్, కడారి మల్లేశం, చోప్పరి సత్తయ్య, ఎస్కే షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

**అదిలాబాద్/నిర్మల్ :** జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముడుపు నలినిరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కుంటాల రాములు, తబ్రెజ్ ఖాన్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు అమీనా బేగం, ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ధాంగి రమేష్, నర్సింగరావు, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రాందాస్, స్వామి పాల్గొన్నారు.

**సిద్దిపేట :** అమరుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురవారెడ్డి భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్. గజబింకార్ బన్సిలాల్. కర్నాల చంద్రం, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్దన్, రామగల్ల నరేష్, వేల్పుల ప్రసన్నకుమార్, బెక్కంటి సంపత్, కానుగుల రామ్‌నకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్..


నిర్మల్ అదిలాబాద్..


యాదాద్రిభువనగిరి..


సూర్యాపేట...


నిజామాబాద్...


సిద్దిపేట..



మహబూబాబాద్

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా 21 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుపేదలకు ఇండ్లు మంజూరు అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, ఎంపిడిఓ మమతబాయి, ఎంపిఓ వినూత్నరెడ్డి, శామీర్‌పేట కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్, డైరెక్టర్ భిక్షపతి, మాజీ సర్పంచ్ మల్లేష్, నాయకులు జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానం

పట్నం మహేందర్‌రెడ్డి





**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** గత సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజాభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలోకి తీసుకెళ్ళే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణా రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రభుత్వం ఆర్థిక, సామాజిక, పరిపాలనా రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో డాక్యుమెంట్ రూపొందించినట్లు ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడించారన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లాలో పటిష్టవంతంగా అమలు అవుతాయన్నారు. అర్హులైన నిరుపేదలకు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, తద్వారా గూడు లేని పేదలకు నీడ కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నామన్నారు. ధరణి స్థానంలో తీసుకొని వచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యల పరిష్కారం చేస్తున్నామని, ముందుగా దీన్ని ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామ రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయన్నారు. రాజీవ్ యువ వికాస పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఆర్థిక రుణాలందిస్తూ ఉపాధి కల్పిస్తోందని, రైతు భరోసా పథకం కింద రైతులకు ఎకరానికి రూ 12 వేల ఆర్థిక సాయం, రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లోనే నగదు జమ చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన నలుగురి కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించారు. మైనార్టీ శాఖ నుండి ఐదుగురు లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు. వ్యవసాయ పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు ఎంపిక చేసిన నాణ్యమైన విత్తనాలను ఐదుగురు రైతులకు చీఫ్ విప్ అందచేసారు. దీంతో పాటు జిల్లా నుండి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ఎంపికై ఉత్తమ ప్రతిభ కనపరచి బంగారం,వెండి పతకాలు సాధించిన17 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి జిల్లా ప్రతిష్టను ఇనుమడించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ గౌతంతో కల్సి ప్రశంసాపత్రాలు అందించారు. ముందుగా కీసర చౌరాస్తాలోని తెలంగాణా అమర వీరుల స్మారక చిహ్నం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,డిసిపి కోటిరెడ్డి, కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మైనార్టీ విభాగ అధికారి కాంతమ్మ, కలెక్టరేట్ ఏఓ రామ్మోహన్, వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, డిఇఓ విజయకుమారి, యువజన సర్వీసుల అధికారి గోపాల్, వివిధ ప్రభుత్వ కార్యాలయాధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తెలంగాణా సాంస్కృతిక సారథి, జిల్లా కళాకారులు ఆలపించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు ఆహ్వానితులను అలరించాయి.

తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, సిపిఐతో సహా పలు రాజకీయ పార్టీ కార్యాలయాలు, ప్రజా కూడళ్లలో సోమవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేస్తూ ప్రాణాలర్పించిన అమర వీరులను ఈ సందర్భంగా స్మరించుకొన్నారు.

## అధికారులకు అవార్డులు అందజేత

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయంపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వికారాబాద్ ఆర్‌డిఓ కార్యాలయంలో ఆర్‌డిఓ వాసుచంద్ర , తహసీల్దార్ కార్యాలయంలో లక్ష్మి నారాయణ, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ వినయ్‌కుమార్ , మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాకీర్‌అహ్మద్ , గ్రంథాలయంలో రాజేశ్వర్‌రెడ్డి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న అధికారులకు అవార్డులను అందజేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ ,జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఎమ్మెల్యేలు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** తెలంగాణా మీడియా అకాడమీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు ఈ నెల 9,10 తేదీల్లో శిక్షణ తరగతులు నాంపల్లిలోని తెలంగాణా మీడియా అకాడమీ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణా మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు ఆసక్తి కల్గిన జర్నలిస్టులు తమ పేర్లను పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఈ నెల 6వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని తెలిపారు.

## ఒక మార్పు అభివృద్ధికి మలుపు



**ప్రజాపక్షం/దుండిగల్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు నాయక్, ఎమ్మార్వో సయ్యద్ అబ్దుల్ మతిన్ సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నందే తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి మీ ఇంటికి వచ్చే స్వచ్ఛత ఆటోకి అందించాలని, బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయవద్దని అలా వేసిన వారిపైన జరిమానా విధిస్తామని, మున్సిపల్ స్వచ్ఛ ఆటో నుంచి వచ్చి చెత్తను మున్సిపల్ డంపింగ్ యార్డ్ వద్ద ఉన్నటువంటి డిఆర్‌సిసి వద్ద తడి చెత్త పొడి చెత్తగా వేరుచేసి తడి చెత్తను కంపోస్ట్ చేయడం జరుగుతుందని పొడి చెత్తను రీసైక్లింగ్ కి పంపియడం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు వర్షాకాలంలో భాగంగా ముందస్తుగా శుభ్రపరచాలని, దోమల వ్యాప్తి చెందకుండ యాంటీ లార్వా మందును నీళ్లు నిలువ ఉన్న ప్రదేశాలలో చల్లాలని అదే విధంగా సాయంత్రం వేళలో ఫాగింగ్ చేయాలని, ప్రతి ఒక్కరూ శ్రమదానంలో భాగంగా మున్సిపల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మొక్కలు నాటాలని వణముతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి పబ్లిక్ టాయిలెట్లు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని, అదేవిధంగా మున్సిపల్ రోడ్స్ మరియు డ్రైనేజీలు రిపేర్లు చేయాలని మున్సిపల్ ఆఫీస్ నుండి గండిమైసమ్మ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, రెవిన్యూ ఆఫీసర్ ప్రభాకర్, మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, వార్డ్ ఆఫీసర్లు మెప్మా మహిళ గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవం



**ప్రజాపక్షం/దుండిగల్:** తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా కొంపల్లి, దూలపల్లిలో ఘనంగా నిర్వహించారు కొం పల్లి మునిసిపల్ ప్రత్యేక అధికారి ఎ.చంద్ర మోహన్ జాతీయ పతాకని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "తెలంగాణ రైజింగ్ 2047" కార్యక్రమంలో భాగంగా, జూన్ 2 నుండి సెప్టెంబర్ 10 వరకు నడిచే 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను కొంపల్లీ మునిసిపల్ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, ఎస్‌హెచ్‌జి మహిళా సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలు, మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో సుమారు 600 వందల మందితో సమావేశం నిర్వహించారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నుంచి కొంపల్లీ సెంట్రల్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించరు మునిసిపల్ మేనేజర్ యస్.వెంకటేశం వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**శామీర్‌పేట :**ఉమ్మడి శామీర్‌పేట మండలంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మూడుచింతలపల్లిలో తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, మున్సిపల్‌లో పవన్‌కుమార్, ఎంపిడివో కార్యాలయంలో గీతారెడ్డి, రైతు వేదికలో ఎవో రవికుమార్, మూడుచింతలపల్లి సహకార సంఘంలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, శామీర్‌పేట తహశీల్దార్‌లో యాదగిరిరెడ్డి, మండల కార్యాలయంలో ఎంపిడివో మమత బాయి, రైతు వేదికలో ఎవో రమేష్, సోసైటిలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సిఐ శ్రీనాథ్, అలియాబాద్‌లో కమిషనర్ చంద్రశేఖర్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు.

**నవాబుపేట్:**తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం నవాబుపేట్ మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బుచ్చయ్య జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె. అరుణ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీలత, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బంట్వారం :** బంట్వారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యలయాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురుస్కరించుకోని స్థానిక పోలీస్టేషనులో ఎస్ విమల, తహసీల్దార్ కార్యలయంలో ఎఆర్ఓ విజయ్ కూమార్, ఎంపిడిఓ కార్యలయంలో ఎంపిడిఓ రాములు, పిఎసిఎస్ కార్యలయంలో చైర్మన్ రాంచంద్రరెడ్డి, ఎంఆర్‌సిలో ఎంఈఓ వేంకటేశ్వర్లు, ఐకెపిలో దేవయ్య, అయా గ్రామాలలో పాఠశాలలో సంబంధిత అధికారులు జాతీయ జేండాను ఎగరవేసి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరుపున్నారు.

**వికారాబాద్ ప్రతినిధి :**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా వికారాబాద్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ,వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలోని బిఆర్‌ఎస్ భావన్‌పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి జాతీయ జెండాను ,బిఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షులు గోపాల్ , ప్రభాకర్‌రెడ్డి , అశోక్ , అంజి ,శుభాన్ రెడ్డి , అనిల్ , శ్రీకాంత్‌రెడ్డి ,వేణుగోపాల్‌రెడ్డి , సత్తయ్య, పురుషోత్తంరెడ్డి ,గాయజ్ ,అనంత్‌రెడ్డి ,దేవదాస్ ,సురేష్ నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/అల్వాల్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా సిపిఐ అల్వాల్ మండల సమితి కార్యదర్శి అమరావతి బాబు ఆధ్వర్యంలో యాప్రాల్ బస్టాండ్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా నాయకులు సహదేవులు హాజరై మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడి 11సంవత్సరాలు గడుస్తున్న నిజమైన తెలంగాణ రాలేదని గత ప్రభుత్వం టిఆర్‌ఎస్ పది సంవత్సరాలు దోచుకొని దాచుకున్నారే తప్ప ప్రజలకు ఏమి చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వై.వెంకటేష్, పి.చంద్రయ్య, సల్మాన్ బిగ్, డి.జంగయ్య, ఎఐటియుసి నాయకులు బి.నరేంద్ర చారి, ఎన్.సంతోష, ఎన్.పద్మ, జి.గణేష్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగ ఫలమే తెలంగాణ



**ప్రజాపక్షం / కొడంగల్:** తెలంగాణ రావాలని, మా పాలన మా కొస్తే బాగు చేసుకుంటామనే ఆకాంక్షతో ఎంతో మంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగం చేశారని అమరుల త్యాగాలు మరువలేనివని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఫీర్ మహ్మద్, వెంకటేష్, కొడంగల్ నియోజకవర్గ నాయకుడు గంటి సురేష్‌లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అమరుల స్థూపం వద్ద ఘన నివాళులర్పించిన అనంతరం మీడియాతో వారు మాట్లాడుతు 1969లో జరిగిన ఉద్యం ఒక ఎత్తు అయితే మలిదశ ఉద్యమం మరో ఎత్తని తెలిపారు. మలీదశ ఉద్యమంలో ఎంతోమంది పాల్గొన్నారని విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, జర్నలిస్టులు ఇలా తెలంగాణ వాదులు స్వచ్ఛందంగా ఉద్యమించారని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగం అజరామరమని కొనియాడారు. ప్రభుత్వం అమరుల త్యాగాలను గుర్తు చేసుకుని బాధ్యతగా పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అనంతయ్య, యాదయ్య, అబ్దుల్లాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్‌లో..**

కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జేండాను ఎగురవేశారు. హంగుహర్భాటాలు లేకుండానే పలు కార్యాలయాల్లో ఉదయం 8 గంటల లోపు జేండాలను ఎగురవేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ సమక్షంలో పార్టీ నాయకులు ఘనంగా జేండాను ఆవిష్కరించి సంబరాలు చేశారు. కడ ప్రత్యేకాధికారి కార్యాలయంలో కడ అధికారి వెంకట్‌రెడ్డి జేండాను ఆవిష్కరించి తెలంగాణ అమరువీరుల త్యాగాలను కొనియాడారు.

## సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కృషి

స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట అవతరణ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా స్పీకర్ పాల్గొని జాతీయ జెండా అవిష్కరణ అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాడిన సంవత్సరకాలంలో అనేక ప్రతిష్టాత్మక అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది అన్నారు. గ్రామిణ, పట్టాణ ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సమగ్రఅభివృద్ధిని సాధిస్తూ తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుంది అని అన్నారు. తెలంగాణ రాష్టంన్ని భారత దేశం, ప్రపంచస్థాయిలో అగ్ర స్థానంలో నిలిపేందుకు తెలంగాలన రైజింగ్ విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. అందులో భాగంగా సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళల సర్వతో మూఖాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని, మహిళలు,ఆర్థిక స్వావలంబన పొందేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి మిషన్ పొందేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది అని తెలిపారు. మన జిల్లాలో ఇప్పటివరకు 20కోట్ల 37లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశమని తెలపారు. ఆర్‌టిసిల్ మహిళలకు ఉచిత పథకం కింద ప్రయణ సౌకర్యం కల్పించడం జరిగింది అన్నారు. వికారాబాద్ జిల్లాలో ఉచిత ప్రయాణం ద్వారా 3కోట్ల 19లక్షల రూపాయలను మహిళలు ఆదా చేసుకోవడం జరిగింది అని స్పీకర్ తెలిపారు. గృహణులకు 500ల రూపాయలకు గ్యాస సిలిండర్ ఇందులో 1లక్ష 19వేల 735 కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. గృహజ్యోతి పథకంలో జిల్లాలో 9కోట్ల 8లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మి ఇండ్ల క్రింద 5వేల రెండవందల 14మందకి లబ్దిదారులకు ఇందిరమ ఇండ్ల మంజురు చేయడం జరిగింది ,నిర్మాణ దశలను బట్టి ఇప్పటివరకు 92లక్షల రూపాయలను లబ్దిదారుల కథలలో జామచేయడం జరిగిందన్నారు. వికారాబాద్ జిల్లా లో రైతురుణమాపి 1లక్ష358 రైతులకు 849కోట్ల రూపాయలు రుణమాఫీ చేశామన్నారు. అంతకు ముదంప వికారాబాద్ జిల్లా కేంద్రాంలో ఉన్నా అమరవీరుల స్తుపం వద్ద జిల్లా కలెక్టర్ తో కలిసి స్పీకర్ నివళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ,సుధీర్ , ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి , మనోహర్‌రెడ్డి , సబ్‌కలెక్టర్ ఉమశంకర్ , జిల్లా అడిషనల్ ఎస్‌పి హనుమంతురావు ,ఆర్‌డిఓ వాసుచంద్ర ,తదితరులు పాల్గోన్నారు.


## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

పరిగి ఎమ్మెలే రామ్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/దోమ:**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుంది అని పరిగి ఎమ్మెలే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. దోమ మండల పరిధిలోని శివరెడ్డి పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇలుల గృహప్రవేశ పూజ కార్యక్రమంలో పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణంతో పాటు 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఉచిత విద్యుత్ ,సన్నబియ్యం పథకం అమలు చేయడం జరుగుతుంది అని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇండ్లు మంజురు చేస్తామని అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటిలను అమలు చేయడం జరుగుతుంది అని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను స్వాదినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, హౌసింగ్ ప్రాజేక్టు డైరెక్టర్ కృష్ణ ,మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ అయుబ్ దోమ మండల ప్రత్యేక అధికారి రవికాంత్ ,ఎంపిడిఓ గామ్య డిసిసీ అధ్యక్షులు ఉపాధ్యాక్షులు లాలు కృష్ణ కాంగ్రెస్ నాయకులు ,రాఘవేందర్ రెడ్డి ,యాదయ్య గౌడ్,రమేష్‌గౌడ్,మొగులయ్య పాల్గొన్నారు.

## ఘనంగా రాష్టవతరణ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/అల్వాల్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్కాజ్గిరి ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి బిఆర్‌ఎస్ పార్టీ యువకులు ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను స్థానిక కార్పొరేటర్లు తె లంగాణ ఉద్యమకారులు బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఎన్నో అవమానాలను వివక్షలను ఎదుర్కొని తెలంగాణ సాధన కోసం కష్టనష్టాలను ఎదుర్కొని ఆత్మ బ లిదానాలు ఇచ్చిన సందర్భాలను గుర్తు చేసుకోవాలన్నారు. కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, లడ్డు నరేందర్ రెడ్డి, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, జేఏసీ సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాసులు, లక్ష్మణ్ గౌడ్ శోభన్ బాబు, శరణగిరి, అరుణ్ కుమార్ ,సందీప్ రెడ్డి, జావేద్, మహేష్, సురేష్, హనుమంతు చారి, దేవేందర్, శివశంకర్,పవన్ ,ప్రశాంత్ రెడ్డి రేవంత్ రెడ్డి సతీష్, నిఖిల్ రెడ్డి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రెండు మండలాల్లో రెవెన్యూ సదస్సులు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల పరిధిలోని ,పరిగి మండల పరిధిలో మండల తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుంది అని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన తెలిపారు. భూభారతి చట్టం అనుసారం దరఖాస్తులను తక్షణమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూ సమస్యలు గల రైతులు మీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించే రోజు మీ దరఖాస్తులను అందించినట్లుయితే పరిష్కరించడానికి వీలుంటుందని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపిన నేత కెసిఆర్

ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :**దార్శనిక పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపిన నాయకులు కెసిఆర్ అని బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామా రం జంట సర్కిల్ కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కెపి వివేక్ మువ్వన్నెల జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. వివేక్ మాట్లాడుతూ అడుగడుగునా వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని తెలంగాణ సమాజాన్ని ఏకం చేస్తూ ఉద్యమమే ఊపిరిగా కేంద్రంతో కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సాధించిన తెలంగాణ రా ష్ట్రాన్ని తనదైన దార్శనిక పాలనతో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రాంగా తెలంగాణాను మాజీ సీఎం కేసీఆర్ నిలిపారని గుర్తు చేశారు. ఇరు మున్సిపల్ ఉప కమిషనర్‌లు నర్సింహా, మల్లారెడ్డి, కార్పొరేటర్‌లు జగన్, సత్యనారాయణ, హేమలతా, ఈఈ లక్ష్మీ గణేశ్, డీఈలు పాపమ్మ, శిరీష, రూపాదేవి పాల్గొన్నారు.



**కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో...**

కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ పాల్గొనిజాతీయ జెండాను ఎగురవేశారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, సలహా దారులు బల్వంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, నాయకులు మురళీ గౌడ్, లింగంగౌడ్, నాగేష్, నరహరిగౌడ్, ఆకుల సందీప్, శ్రీనివాస్ యాదవ్, భిక్షపతి గౌడ్, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూరు:**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్స వేడుకలను తాండూరులో ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే బ్యుయ్యని మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ముందు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు పట్టణంలో మున్సిపల్ అభివృద్ధికి 100రోజుల ప్రణాళిక జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ విక్రమ్‌సింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు నీరాజబాల్‌రెడ్డి,మాజీ వైస్ చైర్‌పర్సన్ రత్నమాల, ప్రభాకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, టౌన్ ప్రసిడెంట్ హబీబ్‌లాల తదితరులు పాల్గోన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకానికి ఆహ్వానం

రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** 2025–26 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద డే స్కాలర్స్, రెసిడెన్సియల్ పాఠశాలలలో ప్రవేశాలకు షెడ్యూల్డ్ కులాల బాల,బాలికలు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో డే స్కాలర్స్‌గా ప్రవేశం కొరకు 05 నుండి06 సంవత్సరాలలోపు వారు, 5వ తరగతిలో ప్రవేశం కొరకు 9 నుండి 10 సంవత్సరములలోపు ఉన్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన బాల, బాలికలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు రంగారెడ్డి జిల్లా వాస్తవ్యులై ఉండాలని, అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000లలోపు గ్రామీణ ప్రాంతాల వారికి, పట్టణ ప్రాంతాల వారికి రూ.2.00,000లలోపు ఉండాలన్నారు. జూన్ 16 వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, రంగారెడ్డి జిల్లా, కలెక్టర్ కాంప్లెక్స్ కొంగరకలాన్‌లో పొందాలని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను కొంగరకలాన్ కార్యాలయంలో నేరుగాగాని లేక పోస్టుద్వారా గాని అందజేయాలని ఆయన తెలిపారు.

## అమరుల ప్రాణ త్యాగాలతో తెలంగాణ

జాతీయ జెండా ఆవిష్కరించిన హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎంతో మంది ప్రాణా త్యాగాలతో తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమయిందని, అమరవీరులను స్మరించుకోవాలని హయత్ నగర్ సర్కిల్ జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. సోమవారం హయత్ నగర్ జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను గ్రేడ్ సెలక్షన్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బి నగర్ డిప్యూటి కమిషనర్ ఇస్లావత్ సేవా నాయక్, రూర్ నగర్ డిప్యూటీ కమిషనర్ ఏ. సుజాత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తిక్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఖదీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్‌డబ్ల్యూఎం నీలియ, చందన, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌హెచ్‌టిపి చైర్మన్, డైరెక్టర్ల అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్‌హెచ్‌టిపి సభ్యుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్క్ (హెచ్‌హెచ్‌టిపి) చైర్మన్, డైరెక్టర్ల అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్కు సభ్యుల సంక్షేమ సంఘం సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. తమకు ప్లాట్లు ఇప్పిస్తామని రూ.కోట్లు వసూలు చేసి, నిండా ముంచిన హెచ్‌హెచ్‌టిపి చైర్మన్ ఉప్పల నర్సయ్య, డైరెక్టర్లు ఘన్‌శ్యాం సరోడె, సామలేటి రాజు, రేగొండ మాణిక్యం, రేగొండ మార్కండేయలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు గజం శ్రీరాములు, చిలుక రవి, మామిడాల సురేంద్ర కోరారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 50మందికిపైగా బాధిత సంఘం సభ్యులతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని, టెక్స్‌టైల్ పార్కులో సభ్యులకు స్థలాలు కేటాయించి, టెక్స్‌టైల్ రంగాన్ని ముందుకు సాగేలా చేయూత అందించాలని సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సభ్యులు ఇంజమూరి శ్రీనివాస్, ఎ.పురుషోత్తం, వెంకటరమణ, ఉప్పల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్త నవోదయాల్లో ప్రవేశాలు కల్పించాలి : కల్యాణి

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఏడు కొత్త నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు కల్పించాలని క్రాంతి కీన్ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ కళ్యాణి కోరారు. జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో నవోదయ విద్యాలయాలను ఏర్పాటుకు 2024 డిసెంబర్ 6న కేంద్రమంత్రివర్గం ఆమోదించిందని గుర్తు చేశారు. కానీ, ఈనెల 1న విడుదలైన ఆరో తరగతి ప్రవేశాల నోటిఫికేషన్‌లో ఈఏడు విద్యాలయాలు చేర్చకపోవడంపై నవోదయ విద్యాలయాల్లో తమ పిల్లలకు చదువుకొనే అవకాశం లేకుండా పోతుందనే ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నదన్నారు. అధికారికంగా విద్యాలయాలు ప్రారంభించి, తాత్కాలిక భవనాల్లో అయినా తరగతులు నిర్వహించి, అడ్మిషన్లు తీసుకోవాలని ఆమె కోరారు.

## నిరు పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/షాబాద్ :** నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్ అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను పార్టీ నాయకులతో కలిసి అవిష్కరించారు. కారక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ సురేందర్ రెడ్డి, తమ్మళి రవీందర్, నర్సింలు, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, పామెన నర్సింలు, డీసీసీ జనరల్ సెక్రటరీ పామెన భార్గవ్ రామ్, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటా రెడ్డి, మండల మహిళ అధ్యక్షురాలు స్వరూప, అశ్వీని, యాదయ్య, గోపాల్, మద్దూరి మల్లేష్, అష్మత్ పాష, సుబాష్, ఇనాయత్ పాల్గొన్నారు.

## మేజర్ సాయిభార్గవ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ చేపట్టిందని రిటైర్డ్ కలెక్టర్ ఎం.వి.రెడ్డి అన్నారు. కోదాడ ఆత్మీయ ప్రవాస సమితి, ఆపోలో మెడికల్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో శాల్యూట్ టు సోల్జర్స్ పేరుతో చైతన్యపురిలోని అపోలో అకాడమీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ కలెక్టర్ ఎం.వి.రెడ్డి పాల్గొన్నారు. సంగోజు నాగాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న మేజర్ సాయి భార్గవ్‌ను సన్మానించారు. రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత ఆర్మీలో చేరేందుకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మాజీ ఆర్మీ అధికారులు కల్నల్ స్వర్ణారెడ్డి, సుబేదారు, మేజర్ పీఎస్‌ఎన్ స్వామి, సార్జెంట్లు జి.నర్సింహారెడ్డి, రామనాథం, వనం సుధర్శన్, దయాకర్‌రెడ్డి, సుబేదారు ఎస్.నర్సయ్యను సత్కరించి వారి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అపోలో అకాడమి డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ మదుసూదన్, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, వాలిబాల్ శ్రీనివాస్, బుడిగ అంజయ్య, కళింగరావు, గుంజ వెంకటేశ్వర్లు, సతీష్, నారాయణరావు, శ్యాంప్రసాద్, సుధాకర్, శేఖర్ పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధే అమరులకు అసలైన నివాళి

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో

రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి :** అమరవీరుల త్యాగాల పునాదులపై పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అన్నిరంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర అభివృద్ధే అమరులకు అసలైన నివాళి అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల కుటుంబాలను సత్కరించారు. జిల్లా జీవన జ్యోతి మహిళ సమాఖ్యకు రుణాల చెక్కులను నరేందర్ రెడ్డి అందజేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆమనగల్ తలకొండపల్లి కస్తూర్బా స్కూల్స్,సరూర్నగర్ పల్లవి హై స్కూల్,శేర్లింగంపల్లి నాగార్జున ఉన్నత పాఠశాల,కడ్తాల్ లోని గురుకుల పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంౖతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. సాంౖతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులకు మెమోంటోలను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఆవరణలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద ముఖ్య అతిథి వేం నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ఆర్‌డిఓ సంగీత, డిసిపి సునీతారెడ్డిలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు సంబంధించి స్టాల్స్‌ను నరేందర్‌రెడ్డి సందర్శించారు. వేడుకల్లో రాష్ట్ర పట్టణ, ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహరెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, డిఆర్ఓ సంగీత, జెడ్‌పి సిఇఓ కృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓ అనంత్‌రెడ్డి, డిసిపి సునీతారెడ్డితో పాటు జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రెవెన్యూ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆర్డీఓలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద భూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించేందుకు వీలుగా జూన్ 3 నుండి అన్ని మండలాలలో గ్రామాల వారీగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే జిల్లాలో పైలెట్ ప్రాతిపాదికన జిల్లాలోని కొందుర్గు మండలంలోని వివిధ గ్రామాలలో రెవెన్యూ సదస్సులను జరిపి, క్షేత్రస్థాయి విచారణ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

**ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా భూభారతి...** ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా, విచారణ ప్రక్రియను పూర్తి నిబద్ధత, నిజాయితీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా భూభారతి దరఖాస్తుల విచారణ చేయాలన్నారు. పొరపాట్లు చేస్తే, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తుదారుడు అప్పీలుకు వెళ్లే పరిస్థితి ఉత్పన్నం కాకుండా మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ జరిపి అభిప్రాయాలను నివేదికలో పేర్కొనాలని కలెక్టర్ తెలిపారు.

## ఆల్ ఇండియా జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో రెసోనెన్స్ ప్రతిభ

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి;** ఆల్ ఇండియా జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో రెసోనెన్స్ హైద్రాబాద్ బ్రాంచికి చెందిన విద్యార్థి పల్లా శివ సంకేత్‌రెడ్డి ఆల్ ఇండియా 102 ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడని రెసోనెన్స్ జూనియర్ కళాశాలల డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైద్రాబాద్ లోని వివిధ రెసోనెన్స్ క్యాంపస్ల నుండి 170 మందికి పైగా దేశంలోని ప్రముఖ ఐఐటీలలో ప్రవేశం పొందనున్నామని తెలిపారు. సాధారణ విద్యార్థి అసాధారనమైన ర్యాంకు సాధించడం విద్యార్థులకు ఒక గొప్ప ప్రేరణ గా నిలుస్తుందని డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు.



## బిఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ అవతరణ దినోత్సవం

**ప్రజాపక్షం/గండిపేట్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శంషాబాద్ లోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జాతీయ జెండా తోపాటు ఆ పార్టీ జెండాలను జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి ,డిసిసిబి డైరెక్టర్ బుర్కుంట సతీష్ ,మాజీ ఎంపిపి లు దిద్యాల జయమ్మ , కృపేష్ ,జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి,సీనియర్ నాయకులు దిద్యాల శ్రీనివాస్,మోహన్ రావు , మహ్మద్ పాషా,రమేశ్ గౌడ్,బుగ్గరాములు , చీరాల రమేశ్,ఆకుల యాదగిరి,లక్ష్మారెడ్డి , చిన్నయ్య ,కిషన్ గౌడ్ , కళ్యాణ్ నాయక్ , జెర్కోని రాజు , నిట్టు జగదీశ్, వివిద మండలాల పార్టీ అధ్యక్షులు , కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు







**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

**వనస్థలిపురంలో...** వనస్థలిపురం డివిజన్‌లోని ప్రశాంత్ నగర్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కనకదుర్గ ఆలయం కామాన్ దగ్గర పార్టీ జెండాను మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లగ్గొని శ్రీధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

**మన్సూరాబాద్‌లో..** మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాంనగర్ కాలనీ చౌరస్తా వద్ద మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జక్కిడి రఘువీర్‌రెడ్డి, జగదీష్, టంగుటూరి నాగరాజు తదితరులు ఉన్నారు.

**తుర్కయంజాల్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని తుర్కయాంజల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా వారు పాల్గొన్నారు





# అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర సాధన సుసాధ్యమైందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. సోమవారం హయత్ నగర్ మండల సమితి పార్టీ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ పార్టీ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని, సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సిపిఐ ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. ఎందరో విద్యార్థి, యువజన నాయకుల బలిదానాల ఫలితంగానే ఈ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శేషురాజు పల్లి శ్రీదేవి, మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన్, బొంగు అరుణ్ కుమార్ గౌడ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి రమావత్ సక్రు నాయక్, మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు సుజాత, సరిత, నాయకురాలు అరుణ, అనిత, జ్యోతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి :** తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్‌లో సిపిఐ కార్యాలయంలో సిపిఐ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చి పది సంవత్సరాలు గడిచిన ఇప్పటికి నీళ్ళు, నిధులు, నియామకాలు ఎవరికి అందలేదన్నారు. కార్యక్రమంలో చందు యాదవ్, తుపాకుల రాములు, వెంకటేష్, కొండలయ్య, నారాయణ, రఘు, బాలకృష్ణ పాల్గొన్నారు.

**తుర్కయంజాల్ :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, మేధావులు, రాజకీయ నాయకులు, కళాకారులపై పెట్టిన కేసులు తక్షణమే కొట్టివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు డిమాండ్ చేశారు. సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి రవీంద్రచారీ, ముత్యాల యాదిరెడ్డిలు హాజరై జాతీయ జెండా, సిపిఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమర వీరుల కుటుంబాలను, ఉద్యమకారులను ఆదు కోవటానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, బిఒసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, దిగోజు వేణుగోపాల్ చారీ, వట్టి నవనీత, కాటి అరుణ,పొన్నాల యాదగిరి, చిలుకూరి పుల్లయ్య, సుజాత, దేవమ్మ, అనూష ఆవుల యాదగిరి, దూపం నిరంజన్, చింత వెంకటేష్, వీరేష్,మాసయ్య, ఖాసీం గోపి తదితరులు పాల్గొన్నారు






క్రీడ

# నేడు ఐపిఎల్ ఫైనల్స్

ఐపిఎల్ ఫైనల్‌కు వానగండం..!

మళ్లీ ఆ సీన్ రిపీట్ అవుతుందా..?

అదే జరిగితే ఆర్‌సీబీకి టైటిల్ ఛాన్స్ లేనట్లే..!

# గెలిచేదెవరు ?



ఐపిఎల్ 2025 సీజన్ ముగింపు దశకు చేరింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మంగళవారం జరిగే ఫైనల్‌తో ముగియనున్నది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. ఐపిఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ఆర్‌సీబీ, పంజాబ్ జట్లు ఇప్పటి వరకు టైటిల్‌ను గెలువని విషయం తెలిసిందే. రెండు జట్లలో ఏదో ఒక జట్టు తొలిసారి చాంపియన్‌గా నిలువబోతున్నది. పంజాబ్, ఆర్‌సీబీ గ్రూప్ దశలో తొలి రెండుస్థానాల్లో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరి.. ఫైనల్‌లో తలపడబోతున్నాయి. ఈ సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆర్‌సీబీ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఆర్‌సీబీ, పంజాబ్ జట్లు అద్భుత ప్రదర్శన చేసి గ్రూప్ దశలో తొలి రెండుస్థానాల్లో నిలిచాయి. గ్రూప్ దశను ముగిసే సరికి పాయింట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో ఉండగా.. ఆర్‌సీబీ రెండోస్థానంలో నిలిచింది. ఆర్‌సీబీపంజాబ్ జట్లు 2021లో అహ్మదాబాద్‌తో ఓ మ్యాచ్‌లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిచింది. అయితే, క్వాలిఫయర్1 మ్యాచ్‌లో పంజాబ్‌ను ఆర్‌సీబీ ఓడించి ఫైనల్‌కు చేరింది. క్వాలిఫయర్2 మ్యాచ్‌లో ముంబయిపై విజయంతో పంజాబ్ ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ జరుగున్నది. పంజాబ్‌ముంబయి మధ్య ఆదివారం జరిగిన క్వాలిఫయర్2 మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించింది. వర్షం కారణంగా మ్యాచ్ 2.15 గంటలు ఆలస్యంగా మొదలైంది. అదనపు సమయం కేటాయించడంతో పూర్తిస్థాయిలో మ్యాచ్‌ని నిర్వహించారు. అయితే, ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగిస్తుందా? అని అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణశాఖ నివేదిక ప్రకారం.. ఫైనల్ రోజున అహ్మదాబాద్‌లో వర్షం కురిసేందుకు అవకాశాలున్నాయి. వర్షం కురవడంతో పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. 2023 సీజన్ ఫైనల్ మ్యాచ్ సైతం అహ్మదాబాద్‌లోనే జరిగింది. ఆ సమయంలోనూ ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిఇంచింది. ఆ సీజన్‌లో ఫైనల్ మ్యాచ్ మే 28న జరగ్గా.. వర్షం కారణంగా ఒక్క బంతి వేయడం కూడా సాధ్యపడలేదు. టైటిల్ మ్యాచ్ కోసం రిజర్వ్ డే ఉండడంతో ఫైనల్‌ను మరుసటి రోజున నిర్వహించారు. రిజర్వ్ డే రోజున సైతం వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. దాంతో మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. ఈ సీజన్‌లో ఐపీఎల్ ఫైనల్ జూన్ 3న మంగళవారం జరుగనున్నది. వర్షం అంతరాయం కలిగిస్తే.. మళ్లీ బుధవారం నిర్వహించనున్నారు. వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో బిసిసిఐ ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ సమయం పెంచిం ది. మ్యాచ్‌ను పూర్తి చేసేందుకు బిసిసిఐ అదనంగా రెండు గంటల సమయం కేటాయించింది. ఈ మేరకు మ్యాచ్ రాత్రి 9.30 గంటలకు ప్రారంభమైతే ఓవర్లు కుదించకుండానే మ్యాచ్ జరుగుతుంది. ఐదు ఓవర్ల మ్యాచ్‌కు కటాఫ్ సమయం రాత్రి 11.56 గంటలు కాగా.. ఆ సమయానికి కూడా మ్యాచ్ జరుగక పోతే మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంటుంది. రిజర్వ్ డే రోజున మ్యాచ్ పూర్తి స్థాయిలో నిర్వహించడం సాధ్యం కాక పోతే రెండు జట్లు సూపర్ ఓవర్ ఆడిస్తారు. సూపర్ ఓవర్ అత్యధిక పరుగులు చేసిన జట్టు చాంపియన్‌గా నిలుస్తుంది. ఈ సూపర్ ఓవర్‌కు సైతం అదనంగా 20 నిమిషాల సమయాన్ని అదనంగా కేటాయించింది. అంటే సూపర్ ఓవర్ రాత్రి 12.30 గంటలకు సైతం నిర్వహించేందుకు అవకాశం ఉంది. అప్పటి వరకు కూడా సూపర్ ఓవర్ నిర్వహించడం సాధ్యం కాకపోతే ఫైనల్ మ్యాచ్ రద్దవుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న పంజాబ్ విజేతగా నిలుస్తుంది.


ఫైనల్‌లో ఎవరు గెలిచినా..

## కొత్త ఛాంపియనే

మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పంజాబ్ కింగ్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంది. ఇందులో ఎవరు గెలిచినా కొత్త ఛాంపియన్ వచ్చినట్టే. ఇప్పటి వరకు పంజాబ్, బెంగళూరు ఒక్కసారి కూడా టైటిల్‌ను నెగ్గలేదు.

## ఫైనల్‌కు పంజాబ్

పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండో క్వాలిఫయర్‌లో ముంబయి ఇండియన్స్‌ను చిత్తు చేసిన పంజాబ్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 203/6 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పంజాబ్ ఐదు వికెట్ల నష్టానికి 19 ఓవర్లలో 207 పరుగులు చేసి విజయం సాధించింది. పంజాబ్ సారథి శ్రేయస్ అయ్యర్ (87*) దంచికొట్టాడు.



కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో తన జట్టును ఫైనల్‌కు చేర్చాడు. నేహల్ వధేరా (48: 29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోష్ ఇంగ్లిస్ (38: 21 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో పంజాబ్ టైటిల్ కోసం తలపడనుంది. ముంబయి బౌలర్లలో అశ్వని కుమార్ 2, ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్య ఒక్కో వికెట్ తీశారు. 2014 తర్వాత పంజాబ్ జట్టు ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. మొత్తంగా ఇది రెండోసారి. తొలుత సూర్యకుమార్ యాదవ్ (44: 26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (44: 29 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), బెయిర్ స్టో (38: 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) నమన్ ధీర్ (37: 18 బంతుల్లో 7 ఫోర్లు రాణించడంతో ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో ఒమర్జాయ్ 2, జెమీసన్, స్టొయినిస్, చాహల్, వైశాక్ ఒక్కో వికెట్ తీశారు.




## షష్టి పూర్తి సక్సెస్ మీట్

రాజేంద్రప్రసాద్, అర్చన భార్య భర్తలుగా నటించిన తాజా చిత్రం షష్టి పూర్తి. ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్‌లలో నడుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. రూపేష్, ఆకాంక్ష హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు పవన్ ప్రభా దర్శకుడు. ఈ మధ్యకాలంలో ఫ్యామిలీతో థియేటర్‌కు వెళ్లి చూసే సినిమాలు తక్కువగా వస్తున్నాయని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ సినిమాను ఇంటిల్లీపాది కూర్చుని హాయిగా నవ్వుతూ చూడొచ్చున్నారు. ఇలాంటి మంచి పాత్రలు వచ్చినప్పుడు చేయడానికి తాను ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని చెప్పారు. ఈ సక్సెస్ మీట్‌లో పలువురు నటీ నటులు, గేయ రచయిత చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.




## తొలిప్రేమేం తోపు కాదు

### కిరణ్ అబ్బవరం

తొలి ప్రేమేం తోపు కాదు. అంటూ గ్లింప్స్ ను చిత్రం యూనిట్ విడుదల చేసింది. చెన్నై లవ్ స్టోరీ పేరుతో వస్తున్న ఈ సినిమాకు మణి శర్మ సంగీతం అందించారు. క సినిమా నటుడు కిరణ్ అబ్బవరం గౌరీప్రియ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు సాయి రాజేష్ దర్శకత్వం వహీ స్తున్నారు.

## కుబేరా ఆడియో రిలీజ్

తమిళ నటుడు ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'కుబేరా'. అక్కినేని నాగార్జున ముఖ్య పాత్రల్లో కనిపిస్తున్నారు. ధనుష్ సరసన రష్మిక మందాన హీరోయిన్‌గా నటిస్తుంది. అమిగోష్ క్రియేషన్స్ బ్యానర్‌పై సునీల్ నారంగ్ , పుష్కర్ రామ్మోహన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ఆడియో రిలీజ్ వేడుక చెన్నైలో గ్రాండ్‌గా జరిగింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఒకేసారి ఈనెల 20న సినిమాను విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.



రీల్

## ముస్తాబవుతున్న కన్నప్ప




మంచు విష్ణు పాటిల్ రోల్ పోషించిన సినిమా కన్నప్ప. ఇటీవల దొంగతనమై పోయిన సినిమా హార్డ్ డిస్క్ దొరికింది. దీంతో సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నారు. మరో ఇరవై అయిదు రోజుల్లో కన్నప్పను థియేటర్‌లోకి తీసుకువస్తామని హీరో, నిర్మాత మంచు విష్ణు బాబు తెలిపారు. ఇందులో హీరో ప్రభాస్ ఓ కిలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఇతర పాత్రల్లో మంచు మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్, ప్రీతీ ముఖుందన్ నటించిన ఈ సినిమాకు స్టీఫెన్ సంగీతం అందించగా, ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు.

## వీరమల్లుకు టికెట్ ధరలు పెంచండి

### ఫిలిం ఛాంబర్‌కు ఏఎం రత్నం వినతి



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన సినిమా హరిహర వీరమల్లు ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. ఈనెల 12వ తేదిన హరిహర వీరమల్లు సినిమాను థియేటర్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈమేరకు సోమవారం తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ను కలిసిన హరిహర వీరమల్లు నిర్మాత ఏ ఏం రత్నం ఛాంబర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈనెల 12వ విడుదల అవుతున్న సినిమాకు ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ రేట్లు పెంచుకునే వెసులుబాటు కల్పించారని కోరారు. ఏపి ప్రభుత్వం దృష్టికి కూడా టికెట్ ధరలు పెంచుకునే అవకాశం ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈచిత్రానికి జ్యోతి క్రిష్ణ దర్శకత్వం వహించగా , ఎం ఎం కీరవాణి సంగీతం అందించారు.

## డల్లాస్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవ సంబురాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వతంత్ర భారతదేశ చరిత్రలో మోస్ట్ సక్సెస్ ఫుల్ స్టార్టప్ స్టేట్‌గా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని, ఇంత అమోఘమైన అభివృద్ధిని సాధించిన రాష్ట్రం దేశంలోనే మరొకటి లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో బిఆర్‌ఎస్ నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సభ, పార్టీ రజతోత్స సంబురాల కార్యక్రమంలో కెటిఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ ధూం ధాం'తో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి గోరెటి వెంకన్న, మాజీ ఎంఎల్‌ఎ రసమయి బాలకిషన్, గాయని మధుప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లాలని, కానీ జన్మభూమి రుణం కూడా తీర్చుకోవాలని ఎన్ఆర్ఐలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టమని విజ్ఞప్తి చేశారు. సంకల్పం, పట్టుదల, చిత్తశుద్ధి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని తెలంగాణ రాష్ట్రం దేశానికి చాటిచెప్పిందన్నారు.

## 'రెవెన్యూ' (మొదటి పేజీ తరువాయి)

కోరిన విధంగా రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఏప్రిల్ 14వ తేదీన సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చామన్నారు. మొదటి దశలో నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, ఆ తర్వాత మే 5వ తేదీ నుంచి 28 వరకు జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రస్తుతం సోమవారం నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా భూ భారతి చట్టంలో భాగంగా మిగిలిన అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో రైతులు వారి ప్రమేయం లేకుండానే భూ సమస్యల్లో చిక్కుకున్నారని, వాటి పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉండేదని, ఏ సమస్యకైనా కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అధికారులు వారి వద్దకే వెళ్లి, ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగానే భూ సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. మొదటి దశలో 72 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన సదస్సుల్లో 13 వేలకు పైగా దరఖాస్తులు, రెండో విడతలో 28 మండలలో 421 రెవెన్యూ గ్రామాలల్లో నిర్వహించిన సదస్సుల్లో 42 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఇప్పటి వరకు 60 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించామని మంత్రి పొంగులేటి వివరించారు. సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని, దీనికి త్వరలో పరిష్కారం చూపిస్తామని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామ స్థాయిలో అందించేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకెళ్తుందన్నారు.

**మానవీయ కోణంలో సమస్యలను పరిష్కరించండి :** జిల్లా కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. భూభారతి చట్టంలో భా గంగా గ్రామ పరిపాలన అధికారులను(జిపిఓ) అతిత్వరలో నియామక పత్రాలను అందజేసి, మండలాల్లో నియమించబోతున్నామన్నారు. గ్రామపాలన అధికారుల 10,954 పోస్టుల భర్తీకి జిఒ విడుదల చేయగా 5వేలకు పైగా దరఖాస్తులు అందాయని, తుదిమెరిట్ జాబితాలో 3,550 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని వివరించారు. సర్వే సెటిల్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని, మొదటి దశలో ఆరువేల మంది సర్వేయర్లను రెండు నెలల్లో నియమించబోతున్నామని, తరతరాలుగా నక్షా లేని 413 గ్రామాలలో పునఃసర్వే నిర్వహించబోతున్నామని వివరించారు. అలాగే టిజిఆర్‌ఎసి (టిజిఆర్‌ఎసి తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాపులు) డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టామని, దీనికి సంబంధించి 3 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి అన్నారు.

### పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనపై

## బహిరంగ చర్చకు సిద్ధం

### మహిళా కాంగ్రెస్ సమావేశం టిపిసిసి మహేష్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ నేత హరీష్‌రావు, బిజెపి నేత ఈటల రాజేందర్ భేటీపై పక్కా సమాచారం తమ వద్ద ఉందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనపై బహిరంగ చర్చకు వస్తామని, హరీష్‌రావుతో ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. కంచే చేను మేసినట్లు బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వ ఆస్తులు నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్, బిజెపి పొత్తుపై కవిత వ్యాఖ్యలకు ముందు సమాధానం చెప్పాలన్నారు. నాలుగు ముక్కలాటలో ఏ పార్టీ నుంచి హరీష్‌రావు పోటీ చేస్తారని, హరీష్‌రావుకు బి ఫామ్ వస్తుందా అని ప్రశ్నించారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిరాస్నోత్సవంలో ఆయన మాట్లాడుతూ కష్టపడే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, సీనియర్ మహిళా కార్యకర్తలకు పార్టీలో తప్పకుండా చోటు కల్పిస్తామన్నారు. మహిళ కార్యకర్తలకు పదవుల విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన అవకాశాలు కల్పిస్తామన్నారు. రాజకీయాల్లో ఓపిక, కచ్చితత్వం ఉండాలని, క్రమశిక్షణ చర్యలు తప్పితే ఎంతటి వారైనా సరే వేటు తప్పదని ఆయన హెచ్చరించారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com